భారతి

సాహిత్య మాసపత్రిక
మార్చి 1983

దిగుడు బావి
సాగరతీర దేవాలయము
కీ. శే. గణపతిశాస్త్రి

స్నేహం
దిలావర్

కొత్త దేవుళ్లు
రావి రంగారావు

అపర నన్నయభట్టు
కొర్లపాటి శ్రీరామమూర్తి

అసమర్థుని జీవయాత్ర
మాదిరాజు రంగారావు

బొట్టు బేత
కాకతి బేతకాడు
కొల్లూరు సూర్యనారాయణ

ఇంతా రమేష్‌బాబు, సస్యశ్రీ, సుబ్బరామశాస్త్రి, శ్రీరామమూర్తి, భానుమూర్తి, వేంకటేశ్వరులు, నాగేశ్వరశాస్త్రి, జనజ్వాల, 'తి', హనుమంతరావు, శాస్త్రి, జవహర్‌లాల్, సత్యనారాయణరెడ్డి ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

మార్చి 1983

సంపుటము : 60 సంచిక : 3

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

మార్చి 1983

ప్రేమ ప్రహసనం

ప్రేమ
పొంగుతున్న పాలసముద్రం!

తులసి తీర్థంలా సేవించ వచ్చు
మంగళగిరి పానకంలా లాగించవచ్చు

పుష్కరం నాటి గోదావరి లోలా యీదులాడ వచ్చు
కాదు కూడ దనుకొంటే ఏకంగా సముద్ర స్నానం
చెయ్యొచ్చు-

అది ప్రేమ!
ఎవరి పరిధి వారిది!

అయితే
ప్రేమనుకొని మితి మీరితే-

నాగ తీర్థమై
పూనక మొచ్చిన నరసింహమై
తరుము కొచ్చే ఉగ్ర గోదావరై
ప్రళయకాల భీకర సాగర స్వరమై
అపశృతులు పలికిస్తుంది!
అస్త వ్యస్త దుస్థితిలో ముంచి వేస్తుంది!

నీదంటూ ఏదీ లేకుండా
నిలువు దోపిడీ చేస్తుంది!

ఆ నాటి రాత్రి ...

ఆ రాత్రి ....
అదే ఆనాటి రాత్రి ....
నా అనుభూతులన్నీ రాలిపడిన రాత్రి ! -

నా చెలియ మనోహర మందస్మిత వదనంలో
వెన్నెల పూల నయనాలు వెదజల్లే నవ నవోన్మేష
మాధురి
నా తనువంతా తలపులతో నింపిననాటి రాత్రి!
అవ్యక్తభూత రాగస్నిగ్ధంలో నే మయిమరచిన రాత్రి! —

నా మగువ వినీల కుంతలాల శృంగారాల నీడలలో
పులకితానంద రవళి రమ్యనృత్యకై యీ ఎదను చేరి
పరవశోన్మత్త సాగర డోలికల్లో నన్నూగిన లాడించిన
నాటిరాత్రి!

అనంతానంత ప్రేమదేవత నా అణువణువునా
నిండుకొన్న రాత్రి!

యావజ్జగత్తునూ మరచిన నా మేధానుశక్తి
తన్మయ లాలితలో ముగ్ధమానస వసంతిలో
తలమునక లవుతూ తియ్యని బాధ ననుభవించిన
నాటి రాత్రి

నేను ....
సమస్త జీవాంశ సంభూత సంతోషాన్ని !
సకల చరాచర లోకేశ్వర స్ఫురద్రూపాన్ని!!

అంతేకాదు....
సృష్టికి ప్రత్యామ్నాయాన్ని!
ధర్మనిష్ఠకు ప్రతిరూపాన్ని!

[మనూ కి కృతజ్ఞతలతో]

నిన్ను చూసాకే...

నీలాకాశం
నా హృదయంలో
నిన్ను చూసాకే....
నీ ప్రేమార్ద్రతను చవి చూసాకే....
ఏడురంగుల హరివిల్లు విరిసింది!
ఏడు జన్మల కథా కమామిషూ తెలిసొచ్చింది!!

చూపు

నేల చూపు
నీళ్లు నమిలేందుకే!
పై పై చూపు
గాలిలో కలిసేందుకే!
ఒక్క ముందుచూపు మాత్రం....
ముచ్చటగా బ్రతికేందుకే!!!

రిలీఫ్

ఇన్నాళ్ళూ ....
నీవు లేవను కొన్నన్నాళ్ళు
ఈ హృదయమంతా
నిరామయం!
ఏదో వెలితి!!

కాని
నీవున్నా వనుకొన్న యీక్షణం
ఎంత రిలీఫని!
మార్వెలస్!!
ప్రభూ!
అది నీక్కూడా అర్థంకాదు!

డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు

ఆంధ్రదేశ గ్రామ నామాంత రూపములు

ఉపోద్ఘాతము

స్థలనామ పరిశీలన, యొక శాస్త్రము (టొపొనిమి)గా చెలామణి యగుచున్నది. చిలుకూరి నారాయణరావుగారు ఈ రంగములో పరిశోధన చేసినట్లు తెలియుచున్నది. ఇటీవల కాలములో కేతు విశ్వనాథరెడ్డిగారు కడపజిల్లా ఊరిపేర్లపై సిద్ధాంత వ్యాసమును ప్రకటించిరి. శ్రీవిజయ దత్తాత్రేయశర్మగారు "భారతి" (సెప్టెంబరు 1982)లో విజయనగర జిల్లా యూరిపేర్ల విశేషములను పరిశీలించిరి. పైవారి కృషియే నన్నీవ్యాసము వ్రాయుటకు ప్రేరేపించినది. ఇట్టి నా కృషి, యెవ్వరును నింతవరకు చేయలేదని నా విశ్వాసము.

వ్యాసోద్దేశము

ఆంధ్రదేశము (ఆఫీసు పరిభాషలో "ఆంధ్రప్రదేశ్") నందలి గ్రామము (హైదరాబాదుకూడా ఈ వ్యాసమున "గ్రామము"గా పరిగణింపబడినది) ల అన్నింటిని పరిశీలించి, వానిపేర్ల చివరలను క్రోడీకరించి, వ్యాఖ్యానించుట. ఇతఃపూర్వపు పరిశోధకులు చేసినది గ్రామనామముల గూర్చి. ఇది గ్రామ నామాంత రూపముల గూర్చి.

పరిశీలనా పద్ధతులు

ఒక గ్రామ నామమును రెండు నిర్దిష్ట స్వరములుగ విడగొట్టి మలి భాగమును గుర్తించుట. ఈ మలిభాగమును "నామాంత రూపము", "అపరభాగము", "ద్వితీయావయము" అని పిలువవచ్చును.

ఉదా : విశాఖపట్టణంలో "పట్టణము", చెర్లోపల్లిలో 'పల్లి' నామాంత రూపములు.

పేరును రెండుగ విడగొట్టుట కొన్ని పట్టుల సహజ సిద్ధముగను, కొన్ని యెడల కృతకముగను ఉండవచ్చును.

ఉదా : పట్టణము, ఊరు, మామిడి అను రూపములు సహజములు.

పుల (తలుపుల), లాం (ఉర్లాం), ఐప (కైప) యను రూపములు అసహజములు. నామాంతరూపము ఒక శబ్దపు యూనిట్టు అగుట యనునది మార్గదర్శక నియమము. ఒక నామాంత రూపము ఒకే పేరులో వచ్చిన యెడల, పరిగణించబడదు.

ఉదా : అవుకు, చిగళి, కోగిర వంటి పేర్లను స్వీకరించను.

ఎందుకు అంటే వాని చివరలు ఆ యొక్క పేర్లలోనే ఉన్నవి కావున. కానీ, గివుకు, బిగళి, బోగిర యను ఊరిపేర్లుండి యుండినట్లయిన, 'వుకు', 'గళి', 'గిర' యని కృతకముగా విడగొట్టి, యాపేర్లను స్వీకరించి యుందును. అయిన ఒకే పేరులో చివర యుండు కొన్ని రూపములను పట్టీలో నిచ్చినాను.

ఉదా : కాయ, గుడ్డ, కొట్టు, పూండ్ల, బొమ్మిలి మొదలైనవి.

ఇవి సహజరూపములుగా కనపడుటచేత, వీనిని కలిగియున్న రెండవ యూరుండవచ్చునను ఆశచేత వీనిని కొన్నింటిని పట్టీలో నిచ్చినాను. ఒక యపర భాగరూపము రెండు రకములైన పూర్వ భాగములతో చేరియున్నప్పుడే, యారూపము ఉదాహరణప్రాయముగా పట్టిలోనికెక్కును.

ఉదా : 'ఊరు' యను రూపము ఆలూరు, మరుపూరు అను వివిధ పూర్వ భాగములతో కలిసియున్నందున "ఊరు" అనునది ఒక ఉదాహరణగ స్వీకరించబడినది.

ఆంధ్రదేశమున 27, 221 ప్రధాన గ్రామములు, 31, 855 మజరాగ్రామములు లేక ఖండ్రికలు ఉన్నవని (1971 సెన్ససు) గణాంకశాఖ లెక్కలు తెల్పుచున్నవి. వీనినన్నింటిని పరిశీలించుట సాధ్యముకాక, నేను ఆంధ్ర సర్కిల్ పోస్టాఫీసుల (హెడ్, సబ్,

బ్రాంచ్) వర్గీకృత జాబితా (ఏప్రిల్ 1980 వరకు అమలులో నుండి నట్టిది)లో నమోదయిన ఊరి పేర్లను పరిశీలించితిని. అది చూచుచున్నప్పుడు, జేమ్స్ జాయిస్ రచన "యులిసిస్" కంటె లండను టెలిఫోను డైరెక్టరీయే ఎక్కువ ఆసక్తికర గ్రంథమని గెరాల్డ్ గౌల్డు ఎందుకన్నాడో యర్థమయినది.

మన పోస్టల్ జాబితాలో దాదాపు 16,000 గ్రామనామము లున్నవి. మొత్తము ప్రధాన గ్రామములలో నిది 60 శాతమగును. శాస్త్ర పరిభాషలో చెప్పవలెననిన, నమూనా పరిమాణం, పెరశిరాశికి పూర్తి ప్రాతినిధ్యము వహించుచున్నది. దీనివలన ఫలితాంశము నమ్మదగినదిగాను, యాథార్థ్య ప్రతిబింబకముగాను నుండునని మన మూహింప వచ్చును. పరిశీలించిన ఊర్ల పేర్లు యావదాంధ్ర (శ్రీకాకుళం నుండి నెల్లూరు, అనంతపురంనుండి ఆదిలాబాదు వరకు)లో విస్తరిల్లి యున్నందున "శాంప్లింగు"లో ఆత్మాశ్రయతగాని పక్షపాతముకాని లేవని యనుకొనవచ్చును. కానీ, ఉదాహరణముల పేర్కొనుటలో నేను పక్షపాతబుద్ధి చూపినందుకు పెద్దలు మన్నింపుడు. "పురము" నకు కొన్ని వేల సంఖ్యలో ఉదాహరణములుండగా "గౌహరాపురము" అనే దానే ఎందుకిచ్చినాను? అది మావూరు. సంతులే స్వస్థాన వేషభాషలను అభిమానించెదరని ఆదికవి నన్నయ్యే వ్రాసినాడు. అట్టితరి సాధారణ మనుష్యుడనైన నేనెంత? నేపరిశీలించిన ఊరిపేర్లు ఇంగ్లీషక్షరములలో (రోమను లిపి) ఉన్నందువలన, వానిని తెలుగు లిపిలో వ్రాయునప్పుడు కొన్ని సహజ ప్రమాదములు సంభవింపవచ్చును. దీర్ఘములు, గురులు, ఒత్తులు పరుష సరళములు తర్మీలగు నవకాశమున్నది. అది సంభవింపకుండ జాగ్రత పడినాను. ఊరిపేర్లు అకారాదిగ అమర్చి పట్టి తయారు చేసినాను.

[ఆంధ్రదేశ గ్రామనామాంత రూపముల పట్టి]

(చూ. పుట ?)

వి ష య చ ర్చ

పట్టీలో 400 గ్రామ నామాంతరూపములు తేలినవి వీనిలో 378 రూపాలకు రెండేసి యుదాహరణములు దొరికినవి. ఇరువది రెండు రూపములకొకటే యుదాహరణము దొరికినది. ఉదాహరణము దొరకని "దాడి", "పండ", "పోడు", "భోగల" వంటి రూపములు నున్నవి. ఊరిపేర్లనూటికి నూరుపాళ్లు పరిశీలించినచో, నింకను 100 రూపము లుఎక్కువ దొరుకవచ్చును. మొత్తానికి 500 గ్రామ నామాంత రూపములున్నట్లు మనము సద్యానికి నిర్ణయించవచ్చును. గ్రామసంఖ్యతో పోల్చి చూచిన ఈ సంఖ్యా నిష్పత్తి పెద్దదని చెప్పవచ్చును. ఆరు కోట్ల ఆంధ్రుల పేర్ల చివరలు కూడ ఇన్ని యుండవని నా యనుమానము. వ్యక్తుల పేర్ల చివరలలో లేని వైవిధ్యము ఊరు పేర్లలో ఎందుకున్నట్లు?

నాయుద్దేశము ఊరుపేరు అర్థము కాని, పుట్టు పూర్వోత్తరము కాని, సాంఘిక, చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యమును గాని చర్చించుటకాదు. గ్రామనామా పరభాగములెన్ని నిర్దిష్ట స్పష్ట పదస్వరములుగా (ఫోనాలజి) ఉన్నవో కనుగొనుట. "ఊరు" అను రూపము చాలా ముఖ్యమయినది. దీని యితర యవతారములు "పూరు", "పురి", "పురము" కూడ ఎక్కడ పడిన అక్కడ కన్పించును. భూమిని త్రవ్వినను అచట కన్పించును. ఐదువేల సంవత్సరముల నాటి సుమేరియన్ సామ్రాజ్యంలో "ఊర్", "నిప్పూర్" అనుపేర్లుగల పట్టణములుండెనని అచటి పురాతత్వ త్రవ్వకములు తెల్పుచున్నవి. ఇండోనీసియాలోని ప్రసిద్ధబౌద్ధ క్షేత్రము "బరోబదూరు" అటువంటిదే శ్రీలంకలోని "అనురాధపుర". "సింగపూరు" అనుపేరుగల దేశమేయున్నది. "ఊరు" తర్వాత "పల్లి" దాని రూపాంతరములయిన "పల్లె", "పాలెం", "పాళెం", "పాళ్యం" ఎక్కువగా యున్నవి. విద్యుచ్ఛక్తిమండలి వారు తయారు చేసికొనిన అనంతపురంజిల్లా గ్రామముల జాబితాను ప్రత్యేకముగా పరిశీలించినాను. ఇందు అనంతపురం జిల్లాలోని గ్రామములన్నియు నమోదయినవి. ఈ జిల్లాలో 958 గ్రామములు, 3042 ఖండ్రికలు ఉన్నవి. ఈ యూర్లలో 61 శాతముకు "పల్లి" లేదా దాని రూపాంతరములయిన "పల్లె", "పాళ్యము", "హళ్ళి" చివరన ఉండును. "ఊరు" 10 శాతము గ్రామనామములకు చివరన ఉండును. "పల్లి" బెంగాలీలో కూడ ఉన్నది. శరచ్చంద్ర చటర్జీ నవల. "పల్లీ సమాజ్"లో "పల్లి"ని పరికింపుము. "కోట" కూడ దేశము మొత్తము కనపడును.

పట్టీలోని 400 రూపములు, 90 శాతము ఊర్లలో కనిపించును. ఆంధ్రదేశమున నొక్కొక్క ప్రాంతమున నొక విధమైన పేర్లు ప్రచురముగా వినబడును. నేడు త్రాగు నీటికి గూడ టికాణా లేని రాయలసీమ (మాజీరత్నాలసీమ)లో "మడుగులు", "చెరువులు" "సముద్రములు" ఎచ్చట జూచిన నచ్చట కన్పించును. రాయలసీమ వారు అల్పసంతోషులు ఒక జలాశయము కనపడినజాలు దానికి "సముద్రము" అని పేరు పెట్టెదరు. కోస్తా ప్రాంతము వాడైన నాయుడుబావ ("ఎంకిపాటలు" ఫేం) సముద్రమును జూచి, "ఇంతేనా సంద్రమెంతో అనుకొంటి"నని తాత్సారము చేయును. కోస్తా ఆంధ్ర (గుంటూరు, కృష్ణ, గోదావరి)లో "పాడు" లెక్కువ. ఊరిపేర్లు మాత్రమిట్లున్నవి కాని, అచటి యూళ్ళస్థితి రాయలసీమ యూళ్ళస్థితి తారుమారుగ నుండుట చరిత్రలీలలలో నొక్కటియని

Statement about Ownership and other particulars about newspaper

BHARATI

Form IV (See Rule 8)

1. Place of Publication : Vijayawada
2. Periodicity of its Publication : Monthly
3. Printers Name : Sri S. Radhakrishna
   Whether citizen of India : Yes.
   Address : 14-14-21, Mallikarjuna Rao St., Vijayawada - 3
4. Publisher's Name : Sri S. Radhakrishna
   Whether citizen of India : Yes
5. Editor's Name : Sri S. Radhakrishna
   Whether citizen of India : Yes
   Address : 14-14-21, Mallikarjuna Rao St., Vijayawada - 3
6. Name - and address of individuals who own the newspaper and partners or share holders - holding more than one percent of the total capital :
   1. Name : S. Kamakshamma
      Address : 1, Luz Avenue, Mylapore, Madras - 600 004.
   2. Name : S. Radhakrishna
      Address : 14-14-21, Mallikarjuna Rao Street, Vijayawada - 3
   3. Name : S. Nageswara Rao
      Address : 1, Luz Avenue, Mylapore, Madras - 600 004
   4. Name : S. Rajeswari,
      Address : 14-14-21, Mallikarjuna Rao Street, Vijayawada - 3
   5. Name : S. Seshamma,
      Address : 1, Luz Avenue, Mylapore, Madras - 600 004
   6. Name : S. Sreeramamurty, Trustee, Kasinadhuni Nageswarao, Sivalenka Sambhu Prasad Dharma Nidhi
      Address : 14/45, Luz Church Road' Mylapore, Madras - 600 004.
   7. Name : S. Ramayamma
      Address : 1, Luz Avenue, Mylapore, Madras – 600 004.
   8. Name : P. Satyanarayana
      Address : 183/184, Rashtrapathi Road, Secunderabad.
   9. Name : D. Subba Rao
      Address : 1, Luz Avenue, Mylapore, Madras - 600 004.

I, S. Radhakrishna, hereby declare, that the particulars given above are true to the best of my knowledge and belief.

S. Radhakrishna.

1-3-83 Signature of Publisher

నా అభిప్రాయము కళింగ ప్రాంతమున (విశాఖ పట్టణం, విజయనగరం, శ్రీకాకుళం) "వలస" లెక్కువ. తెలంగాణాలో పేర్లు తెలుగువే యయినను హలంతములుగా నుండును. ఉదా : మేడ్చెల్, మంచెరియల్. అన్యభాషా ప్రభావములు బుజ్‌రుగ్, గాంవ్ వంటి వానిలో కనపడును. నాచారం, ధర్మారం, బుగ్గారం వంటి పేర్లను తటస్థపడును. ఈ "ఆరం" యనునది "వరం" అనుదానికి ఉచ్చారణాభ్రష్ట రూపము. నాచవరం, ధర్మవరం, బుగ్గవరం అని నిజమైన రూపములు. తెలంగాణాలో చాలాయూర్లను 'పహాడ్' అని పిలుచుచుందురు. ఇది 'పహాడు' కాదు. 'పాడు' ఉదా : బూరుగుంపహాడ్‌ను బూరుగుంపాడు అని పిలువవలెను.

అన్య రాష్ట్ర సరిహద్దులలో నుండు గ్రామ నామములు తమాషాగా నుంటును. శ్రీకాకుళం (ఒరియా), ఆదిలాబాదు (మహారాష్ట్ర), అనంతపురం (కన్నడ), చిత్తూరు (అరవం) జిల్లాలలోని యూరిపేర్ల మీద నన్య భాషా ప్రభావముండును. ఆంధ్ర నడిబొడ్డుననున్న గుంటూరు, కృష్ణాజిల్లా యూరిపేర్ల ప్రత్యేకత వేరు.

"రణస్థలం", "శృంగవృక్షం", లేపాక్షి", "సిద్ధవటం," "మంత్రాలయం" అను పేర్లు మరీ సంస్కృతము మీరినవి. "రాజమంద్రి" యనునది యాంగ్లేయులు పెట్టినపేరు. అనంతపురములో "తాడిపత్రి" యున్నది. ఇతర జిల్లాలలో "తాడిపర్తి", "తాటిపర్తి" అని ఊర్లుండగా, ఈ అనంతపురముది మాత్ర మీ రూపమేల దాల్చెనో? "బొబ్బిలి" యనుపేరు గురించి "భారతి"కి పంపిన ప్రత్యేక వ్యాసమున వివరించినాను. ఆ పేరు చాలా ఆసక్తికరము. ఏ యే అక్షరములతో నెన్ని యూర్లపేర్ల చివరలు మొదలిడునో తెలిసికొనుట ఆసక్తి కరము. అక్షరముల ప్రాముఖ్య మిట్లున్నది. 'గ'తో 58, 'మ'తో 52, 'ప'తో 47, 'బ' 'వ' లతో చెరి 30 యూర్లపేర్లు మొదలిడును. 'ఖ', 'ఘ' లతో చెరి 2 పేర్లు 'ణ', 'భ' 'శ' తో చెరి 1 పేరు కన్పట్టును. యథాప్రకారము 'య' తోనే పదమూ మొదలు పెట్టుట చూడలేదు. 'యాగీ' చేయుట వలన లాభ ము లేదు.

గ్రామ నామీకరణములో నొక రివాజు కనిపించును. గ్రామము పెద్దదయినట్లెల్లా, లేదా గ్రామమిటీవల కట్టబడిందయినా, ఆ పేరు సంస్కృతములో తప్పకయుండును. జనులలో సాంఘిక ప్రతిపత్తి పైకిపోయినట్లెల్లా వారి భాష, సంస్కృతీకరింపబడును. పూర్వకాలము వారూర్లపేర్లు సహజసిద్ధముగా పెట్టెడువారు. అందు అవమాన అశ్లీల న్యూనతలున్నను సరే. ఉదా : గాడిదమల, లంజపోలూరు, బోడిగాని దొడ్డి వారిలో సత్య సంధతకూడా ఉండెడిది. ఇసుక యున్న చోట ఊరు కట్టిన, అది 'ఇసుకపల్లి' కానీ 'ఇంద్ర

పురి' కాదు. ఇటుకలు చేయునూరు 'ఇటుకల పాళ్యం' కానీ 'హిమనగర్' కాదు. ఈలాగున పూర్వపుటూర్ల నామ్నీకరణము వెనుక ఏదో ఘర్షణ, ఆవేదన, చరిత్ర యుండును. ఇప్పటివారు అన్ని యూళ్ళకును 'శ్రీరాంనగర్' అని పెట్టుకొనుటకు తహతహ లాడెదరు. 'పేరులోననేమి పెన్నిధి యున్నది' యని గిరీశం అడుగును. 'ఆక్స్‌ఫర్డ్' సుప్రసిద్ధ స్థలము. ప్రాచీనకాలమున బ్రిటనులో నది 'ఎద్దులదొడ్డి' యేకదా! 'ఆక్స్‌ఫర్డు'ను సంస్కృతీకరించిన 'ఉక్షపురం' అగును. మనవారు 'గాడిదమ'లను 'గార్గేయపురము'గానూ 'లంజపోలూరు'ను శ్రీరాంపురము'గానూ, 'బోడిగానిదొడ్డి'ని 'రోటరీపురం'గానూ మార్చ ప్రయత్నించెదరు. 'బెజవాడ' అను ప్రాచీన రూపమును 'విజయవాడ' అని మార్చినారు. 'మామిళ్ళపల్లి', 'చూతపురి' యగును. నేడు పట్టణ శివార్లలో లేచుచున్న కాలనీలకు సంస్కృతప్పేరులు పెట్టెదరు. సంసార జంబాలపటల మగ్న గృహమేధి మండలంబున్న యొక కాలనీపేరు 'తపోవన్ నగర్'. వ్యక్తినామ సంస్కృతీకరణము శ్రీనాథుని నుండి ప్రారంభమయింది. ఇతని తాత పేరు కమలనాభుడు. ఆంధ్రత్వ మెక్కడికి పోయినది? అపరశివావతారుడు, అరవవాడు అయిన అప్పయ్య దీక్షితుడు ప్రాయశః యెవరి కవిత్వపఠన ప్రాప్తికై, మలిజన్మలోనైనా ఆంధ్రత్వమబ్బవలెనని కోరుకొనెనో యా కవి పేరేమో తెలియునా? తిక్కన! రజనీకాంత్ కాదు!! తెలుగుపల్లె సీమల సొబగును సున్నితముగా వర్ణించిన కవిపేరు?- పోతన! 'సుకుమార్' కాదు. వీరి పద్యం బొక్కటి చదువని మన తెనుంగువారు తమ యనుంగునిసుంగులకు పెట్టుపేరులు "చంద్రనాథ్", 'సుధీర్', 'ప్రకాశ్', 'ప్రసాద్', 'సురేష్', 'రమేష్'. వీరిని కాన్వెంటు ఇస్కోళ్ళకు మమ్మీ, పప్పీ అని నేర్చుటకు పంపుచున్నారు. (సింహళద్వీప హిందువుకు, ఇంగ్లీషు స్త్రీకి జనించిన ఆనందకుమారస్వామి తన కొడుకును హరిద్వారలోనుండు కాంగ్రి గురుకులమున చేర్చియుండెను) గోగులపాటి కూర్మకవి సింహాద్రి అప్పన్నను 'ఆంధ్ర సంస్కృతి నిల్పుదేవా' యని మొఱపెట్టుకొనిన యాంధ్ర సంస్కృతి యిప్పటి మన 'టెలుగు పీపుల్'ల సంస్కృతి కాదని నేనను కొందును.

ఉ ప సం హా ర ము

అర్ధ లక్షకు పైగా నుండు గ్రామ నామములను సమీక్షించుట ఒక్కడు చేయజాలడు. కృశాను, విశ్వావసులకై వేంకటాధ్వరి నియోగించిన విమానమున్న గాని యది సాధ్యపడదు. విశ్వవిద్యాలయములలో నచట నొకరు, నిచట యింకొకరు సంవత్సరముల తరబడి యసమగ్ర వైయక్తిక పద్ధతులలో ఒక్కొక్కజిల్లాపైన పరిశోధన జరుపుటవలన విషయమునకు న్యాయయూ చేకూరదు. కాలహరణమూ అగును. అందు కొఱకు నేనిచ్చు సలహా ఇది. ఒక అంతర్విశ్వవిద్యాలయ, యంతర శిక్షామండలి యేర్పడవలెను. అందులో నొక గణాంక శాస్త్రజ్ఞుడు, భాషాశాస్త్రవేత్త, సాహిత్యవేత్త, చారిత్రికుడు, సాంఘిక శాస్త్రజ్ఞుడు, భూగోళ శాస్త్రజ్ఞుడు, పురాతత్వవిదుడు, రెవెన్యూ అధికారి, మరికొందరు నిపుణులుండవలెను. ఈ పరిశోధకమండలి ఆంధ్ర ప్రదేశము, పరిసర రాష్ట్రములలోని ఆంధ్ర ప్రాంతములలోని యూర్ల పేర్లంటిని సేకరించి, అత్యధునాతన తరం కంప్యూటరు సహాయమున ప్రాజెక్టు ప్రాతిపదికపై, సమగ్ర పరిశోధన చేయుట యవసరము.

వా ల ఖి ల్య ము

స్థల నామ విచారము చెన్న నగరములోని "నల్ల పెత్తల్లి వీధి", "బార్బర్స్ బ్రిడ్జి"లలో వలె వెర్రి తలలు వేయునవకాశము కలదు. విశ్వనాథ నవల "వేయిపడగలు"లో ధర్మారావు రైలు స్టేషనుకుపోవును. సుబ్రహ్మణ్యస్వామి పేరకట్టిన సుబ్బన్నపేట అను యాయూరి పేరును ప్లాట్‌ఫారం మీద "సుభాన్‌పేట" యని వ్రాసియుండిరి. ఒక కాలేజీలోని యుపన్యాసకుడు, దాక్షిణాత్యుడు "సుభాన్‌పేటయా? భానుడని యెవరైన నిచ్చట రాజ్యము చేసెనా ఆ రాజీ యూరు కట్టించి యుండవచ్చును" ననెను. ధర్మారావు "మీరు చరిత్రోపన్యాసకులా" యని యడిగెను. ఆ యుపన్యాసకుడేమి చెప్పెనో విశ్వనాథ వ్రాయలేదు.

ప ట్టి
ఆంధ్రదేశ గ్రామ నామాంత రూపములు

ం

ంకి	జలదంకి, పోరంకి
ంగి	మేరంగి, రేలంగి
ంచ	కోసులంచ, తంగెడంచ
ంట్ల	గోరంట్ల, ఇల్లంట్ల

అ

అక్క	కోటక్క, నూతక్క
అచలం	ద్రోణాచలం, భద్రాచలం
అర్గ	షక్కర, హంగర్గ
అసం	దెరసం, పరసం

ఆ

ఆక	ఉపమాక, దుబ్బాక
ఆడ	కొమరాడ, తుమరాడ

ఆరం నాచారం, ధర్మారం
ఆల నంద్యాల, మల్యాల

ఇ

ఇగి కిష్టిగి, కోసిగి

ఈ

ఈశ్వరం కాళేశ్వరం, ధవళేశ్వరం

ఉ

ఉట్ల ఎల్లుట్ల, కౌలుట్ల
ఉడికి దోసలుడికి, రావులుడికి
ఉవ కెంగువ, జక్కువ

ఊ

ఊరు ఆలూరు, తిరువూరు

ఎ

ఎంద్ర చేవెంద్ర, పెంజెంద్ర
ఎళ్ళ కూరెళ్ల, మారెళ్ల

ఏ

ఏడు గంద్రేడు, చియ్యేడు
ఏడ్గి దోమల్‌యేడ్గి, బొరంగియేడ్గి
ఏరు కుదేరు, పాడేరు

ఐ

ఐప కైప, మైప

ఓ

ఓడు పెందోడు, బేలోడు
ఓతి ఎల్లోతి, చీపులోతి
ఓలు ఒంగోలు, బోగోలు

క

కండ్లి రాయ్‌పూర్‌కండ్లి, రత్నపూర్‌కండ్లి
కందాల గుంతకందాల, మిట్టకందాల
కట్ట వెల్లికట్ట, మంచాలకట్ట
కట్టు మరకట్టు
కట్ల అప్పికట్ల, అరట్లకట్ట
కనుమ చెరుకుకనుమ, పోతుకనుమ
కర్ల కాకర్ల, కొండికర్ల
కలన్ కొడప్‌గల్‌కలన్, వల్గొట్‌కలన్
కల్లు గుంతకల్లు, పెండేకల్లు
కాడ చినకాడ, పెదకాడ
కాడు కరేకాడు, వాకాడు
కాని కాకాని, చింతకాని
కాయ కంబకాయ
కాలువ తాళ్లకాలువ, సజ్జలకాలువ
కిత్తలి తాతవారికిత్తలి, ఫకీర్‌కిత్తలి
కిమిడి పర్లాకిమిడి, పెదకిమిడి
కిరి కలికిరి
కుంట చింతకుంట, జమ్మికుంట
కుంట్ల కోవెలకుంట్ల, కౌకుంట్ల
కుంద ఉరుకుంద, కురుకుంద
కుడ ఇడుకుడ, నడికుడ
కుడి నడికుడి
కుడితి ఉడుములకుడితి
కుదురు నడకుదురు, రాయకుదురు
కుద్ది/కుద్ద కపాస్‌కుద్ది, రుషికుద్ద
కుప్పం రామకుప్పం, సదాకుప్పం
కురికి గొట్టికురికి, చెళ్లకురికి
కుర్తి కల్వకుర్తి, చీమకుర్తి
కుర్ద్ కొడప్‌గల్‌కుర్ద్, లింబకుర్ద్
కుర్రు పుల్లేటికుర్రు, బొడసకుర్రు
కుళ్ల నీరుకుళ్ల, మునుకుళ్ల
క్కువ జక్కువ, మక్కువ
కూడల చినకూడల, పెదకూడల
కెర కిరికెర, మద్దికెర
కెళ్ల అకెళ్ల, తనికెళ్ల
కొండ ఉరవకొండ, కోటకొండ
కొండి అకొండి, ఊకొండి
కొండ్ల కొనకొండ్ల, కవికొండల
(కొండల రూపాంతరము)
కొట్టు ముంజవరపు కొట్టు
కొట్ల చినకొట్ల, పెదకొట్ల
కొలను గుండుకొలను, వావిలికొలను
కొల్లు కోరుకొల్లు, పాలకొల్లు
కోట కొత్త కోట, శృంగవరపుకోట
కోన నందికోన, కాప్రేనికోన

ఖ

ఖండి గరుడఖండి, సిరియఖండి
ఖని కల్యాణఖని, గోదావరిఖని
ఖల్లు దుద్దఖల్లు, మొండెం ఖల్లు

గ

గంజ్ మిశ్రిగంజ్, అఫ్జల్ గంజ్
గంజాం చినగంజాం, పెద గంజాం
గండి పాముగండి, యండగండి
గండ్ల గోనెగండ్ల, వడగండ్ల
గండ్రేడు కొండగండ్రేడు, వల్లిగండ్రేడు
గట్ట కర్లగట్ట, గుమ్మగట్ట
గట్టు గొల్లగట్టు, దుంపలగట్టు
గట్ల ఉసిగట్ల, దామగట్ల
గడ కలగడ, శ్రీగడ
గడప దుంపగడప, దేవునిగడప
గడ్డ అళ్ళగడ్డ, మేఘాద్రిగడ్డ
(గెడ్డ రూపాంతరము)
గర అంగర, వంగర
గలి ఇడగలి, వరగలి
గల్లు కుప్పగల్లు, పాడగల్లు
గాడి కొత్తగాడి, పెదగాడి
గాని అనగాని, వనగాని
గాము జనగామ, నందిగామ
గాల కనగాల, మునగాల
గాలి వడగాలి, సురగాలి
గాంవ్ దేహగాంవ్, బ్రాహ్మన్‌గాంవ్
గిద్ద దమరగిద్ద, మొగలుగిద్ద
గిరి చిప్పగిరి, లద్దగిరి
గుంట రేణిగుంట, వేపగుంట
గుంట్ల ఎర్రగుంట్ల, గురుగుంట్ల
గుండం మోక్షగుండం, రాయగుండం
గుండాల అన్నిగుండాల, గొట్టిగుండాల
గుండి కుంగుండి, రేగుండి
గుండు అటుకులగుండు, అల్లుగుండు
గుండ్ల కొలిమి గుండ్ల, మల్లాగుండ్ల
గుట్ట కొటగార్లగుట్ట, యాదగిరిగుట్ట
గుడబ కొండగుడబ, బాలగుడబ
గుడి ఎర్రగుడి, చోరగుడి
గుడిపి కేతుగుడిపి, నాగెళ్ళ గుడిపి
గుడు సరుగుడు
గుడ్డ బొల్లన గుడ్డ
గుప్తం ఉప్పలగుప్తం, దేవగుప్తం
గుప్ప అడుగుప్ప, బెళగుప్ప (కుప్ప రూపాంతరము)
గుబ్బ ముదిగుబ్బ
గుమడం రాచగుమడం, ములకలగుమడం
గుమ్మ బూదలగుమ్మ
గుమ్మల కంచుగుమ్మల, చీడిగుమ్మల
గుమ్మి పాలగుమ్మి, పుల్లగుమ్మి
గుర్తి అమనగుర్తి, నిడగుర్తి
గుల బూరుగుల, మాడుగుల
గూడ ఉప్పుగూడ, యాకల్ గూడ
గూడు గూగూడు
గూడెం తాడేపల్లి గూడెం, దొమ్మగూడెం
గూ(గు?)ళ్ల కూటగూళ్ల, భూషణగూళ్ల
గేరి ఎరిగేరి, బిణిగేరి
గొండ తరిగొండ, నల్లగొండ
గొంది మట్లగొంది, హొలలగొంది
గొట్ల కలుగొట్ల, తాటిగొట్ల
గొప్పుల తరిగొప్పుల, పెద్దగొప్పుల
గొమ్మ చేగొమ్మ
గొమ్ము తటుకూరుగొమ్ము, రేపాక గొమ్ము
గొయ్యి పిడింగొయ్యి
గోడు కురుగోడు, వెలుగోడు
గోళం ఊదే గోళం, ముదిగోళం

ఘ

ఘట్ట దోపఘట్ట, శ్రీధరఘట్ట
ఘాట్ చాదర్‌ఘాట్, వేముల్‌ఘాట్

చ

చంద గడచంద, చింతల చంద
చర్ల అసుంచర్ల, తామర చర్ల
చలమ కొరివి చలమ, సిరి చలమ
చింత అమరచింత, పూలచింత
చింతల ఊరు చింతల, రెంట చింతల
చిరువెళ్ల అమని చిరువెళ్ల, బోయిల చిరువెళ్ల

చిలి కంచిలి, షంచిలి
చెర్ల కంచెర్ల, నంచెర్ల
చెరువు జక్కులచెరువు, రాయలచెరువు
చెల కొలచెల, మేడ్చెల
చెలక ఉప్పల చెలక, కోయ చెలక
చెలిమల చెల్లెలి చెలిమల, నల్ల చెలిమల
చేడు కారంచేడు, తొగర్చేడు
చేను చిలమన చేను

జ

జంగి అలజంగి, కింజంగి
జమ్ము పుట్టజమ్ము, రాయగడజమ్ము
జర్ల చెంజర్ల, నల్ల జర్ల
జాడ అజ్జాడ, గురజాడ
జాల గురజాల, యామిజాల
జెళ్ల నూజెళ్ల, వేజెళ్ల
జోల ఒండ్రజోల, లోహరిజోల

ట

ట్టిస కొట్టిస, పట్టిస

డ

డపి కొండపి, మేడపి
డం నిడ్డం, బొడ్డం
డాల ఎనమడాల, చామడాల
డంగి జడ్డంగి, తొండంగి

ణ

ణికి కొణికి, మిణికి

త

తంపర అకులతంపర, తుంగతంపర
తరిణి పినతరిణి, పెదతరిణి
తాండ మరాటితాండ, వెంకటాంపల్లి తాండ
తాడు మడితాడు, రాప్తాడు
తిప్ప పొలతిప్ప, బులుసుతిప్ప
త్రికి కత్రికి, మంత్రికి
త్తిలి అత్తిలి, బెత్తిలి
తుమ్మిడి చినతుమ్మిడి, పెదతుమ్మిడి
తుర్తి కుందుర్తి, తుంగతుర్తి
తుర్పి చిగతుర్పి, హిరేతుర్పి
తుర్రు పెందుర్రు, మొగలితుర్రు
తేరు పాత్తేరు, వాల్తేరు
తోట కురుకులతోట, దాడితోట
తోడు పాలతోడు, వెలగతోడు

ద

దండి చొప్పదండి
దండ్ల నాద(దె?)ండ్ల, వెలిదండ్ల
దల కొణిదెల, గుణదల
దాట్ల అవులదాట్ల, గ్రామదాట్ల
దిండి కలిదిండి, గిలకలదిండి
దిన్నె దైవం దిన్నె, పెసలదిన్నె (తిన్నె రూపాంతరము)
దిబ్బ పితనివారి దిబ్బ, లంజదిబ్బ
దిమిలి చిన్నదిమిలి, పెద్దదిమిలి
దిస కందిస, కొదిస
దీవి అడపుల దీవి, హంసలదీవి
దుద్ది జొకులదుద్ది, నలగదుద్ది
దుమ్మ జోగులదుమ్మ
దుర్గము కల్యాణదుర్గము, రాయదుర్గము
దుర్తి తోపుదుర్తి, పాముదుర్తి
దెన అలిదెన, కొణిదెన
దేవి మోపిదేవి, వెల్దేవి
దొడ్డి చీరమానిదొడ్డి, బోడిగానిదొడ్డి
దొణ తంగెరదొణ, బెలదొణ
దోలు అందోలు, చందోలు

న

నంది పారనంది, మహానంది
నగర్ మహబూబ్‌నగర్, షాద్‌నగర్
నగరం గజపతి నగరం, విజయనగరం
నరవ గుడ్లనరవ, వేములనరవ
నవ ఉన్నవ, మన్నవ
నాడ కాకినాడ, తాడినాడ
నాడు తొండమనాడు, వేనాడు
న్నాడ జొన్నాడ, పెన్నాడ
నాపి చీపునాపి, వేపినాపి
నాల గుంతనాల, మిట్టనాల (నేల రూపాంతరము)

నూతల	కురునూతల, రావినూతల
నెమిల	చిన్న నెమిల, పెద్ద నెమిల
నేడు	వెల్మినేడు

ప

పటం	ఇప్పటం, కలపటం
పట్టణం	మచిలీపట్టణం, విశాఖపట్టణం
పట్నం	ఇబ్రిహీంపట్నం, కళింగపట్నం
పట్టి	దారపట్టి, రేపాకపట్టి
పట్టు	పూతలపట్టు, ముంగిలిపట్టు
పట్ల	దొడ్డిపట్ల, పల్లపట్ల
పడగ	బురిడిపడగ, మద్దిపడగ
పత్తి	ఎగువకొండపత్తి, దిగువకొండపత్తి
పర	కొల్లిపర
పర్తి	పాలపర్తి, హసన్‌పర్తి
పర్రు	చాటపర్రు, మోపర్రు
పర్ల	గొండిపర్ల, వలపర్ల
పర్వ	కొండపర్వ, మద్దుల పర్వ
పల్ల	చిన్నపల్ల, రెంటపల్ల
పల్లి	బండమీదపల్లి, మూగచింతపల్లి
పల్లె	మునిపల్లె, బైరెడ్డి పల్లె
పవని	చిన్న పవని, పెద్ద పవని
పహడ్	పోచం పహడ్, బూరుగుం పహడ్
	(పాడు రూపాంతరము)
ప్పల	కైరుప్పల, బైలుప్పల
పాం	కురుపాం, కోటిపాం
పాక	తాళ్ళపాక, మండపాక
పాడ	ఉప్పాడ, మధుపాడ
పాడు	పునాదిపాడు, పెద్దపాడు
పాముల	అకుపాముల, తాటిపాముల
పాల	ధూళిపాల, పైడిపాల
పాలెం / పాళెం	అంతర్వేది పాళెం, ఎర్రగొండపాలెం
పాళ్యం	గూలపాళ్యం, పెరుగుపాళ్యం
పిరాల	అరిపిరాల, మురిపిరాల
పిరి	అలిపిరి
పుట్టి	మార్కొండ పుట్టి, లొద్దపుట్టి
పుట్టు	అడుగులపుట్టు, బుసిపుట్టు
పుట్టుగ	గొనపపుట్టుగ, దెప్పిలిగొనపుట్టుగ
పుర	జోహరా పురము, షేర్ మహమ్మదాపురము
పురి	ధర్మపురి, మత్స్యపురి
పూరు	అలంపూరు, తలుపూరు
పుల	తలుపుల, పసుపుల
పూండ్ల	తూరుపుపూండ్ల
పూడి	కొండేపూడి, ద్వారపూడి
పెంకి	చినపెంకి, పెదపెంకి
పెంట	ఓణిపెంట, పాచిపెంట
పెట్ల	తప్పెట్ల, దంపెట్ల
పెడ	మరిపెడ, మునిపెడ
పేట	ఖాదర్‌పేట, కొండపేట
పేడు	ఏర్పేడు, వైపేడు
పోలు	పంద్రపోలు, భీమపోలు
ప్రగడ	తల్లాప్రగడ, వెంట్రప్రగడ
ప్రోలు	తేలప్రోలు, భట్టిప్రోలు

ఫ

ఫసల్‌వార్	గోకోఫసల్‌వార్, దేవల్‌ఫసల్‌వార్

బ

బండ	దేవనబండ, పెసలబండ
బండి	మెట్టుబండి, రాళ్ళబండి
బందరు	కానూరుబందరు, మోఫస్‌బందరు
బగ్గాం	పాతబగ్గాం, కొత్తబగ్గాం
బట్టు	అకనంబట్టు, సురుకంబట్టు
	(పట్టు రూపాంతరము)
బట్ల	ఎంపుబట్ల, సానంబట్ల
బర్తి	కిర్తుబర్తి, పెనుబర్తి
బల్ల	నల్లబల్ల, పొగడబల్ల
బల్లి	తెల్లబల్లి, రేబల్లి
బాక	తుర్రబాక, తేకుబాక
బాకం	కలియం బాకం, చవరం బాకం
బాగ్	ఇబ్రహీంబాగ్, సీతారాంబాగ్
బాగల్	గునెమొరుబాగల్, మొరుబాగల్
బాడి	కరకంబాడి, పెరియంబాడి
బాడు	ఏకుబాడు, తెల్లబాడు
బాద	అమీనాబాద, రుస్తుంబాద
బాదాం	చినబాదాం, పెదబాదాం
బాది	కదిమాబాది, గుర్బాబాది

బాదు జహీరాబాదు, హైదరాబాదు
బావి కల్లుబావి, గోనబావి
బాల చాబాల, రేబాల
బిల్లి అలుగుబిల్లి, రేగుబిల్లి
బీడు హుళేబీడు
(వీడు రూపాంతరము)
బుగ్గ కాశీబుగ్గ
బుజురుగ్ కౌతాబుజ్ రుగ్, కిర్గుల్ బుజ్ రుగ్
బురిడి } కొండ బురిడి
బరిడి } తాళ్ల బరిడి
బెట్ట రొల్లెబెట్ట, హొశ్టెబెట్ట
బేడు తాలెంబేడు, తొట్టంబేడు
బైలు గూటిబైలు, చామచేనుబయలు
(బయలు రూపాంతరము)
బొమ్మిలి కోట బొమ్మిలి

భ

భద్రి పిప్పలభద్రి, బోరుభద్రి

మ

మంగి బొమ్మంగి, రాజబొమ్మంగి
మంచి కట్టమంచి, జనమంచి
మంచిలి ఎలమంచిలి, పెనుమంచిలి
మంట్రి పెనుమంట్రి
మండ పొల్లమండ, దిగువమండ
మండలం నందిమండలం, హీరమండలం
మండవ చిన్నమండవ, పెద్దమండవ
మంద గాజులమంద, చింతకాయలమంద
మచ్చ పెనుమచ్చ, గోపమచ్చ
మట పటమట
మట్ల పాటిమట్ల, వెలుగుమట్ల
మఠం ఎర్రమఠం, గవిమఠం
మడ పుచ్చకాయలమడ, పొలమడ
మడక జమ్మలమడక, పూడిమడక
మడుగు నూతి మడుగు, వేల్పుమడుగు
మద్దాలి ఏదుల మద్దాలి, కురుమద్దాలి
మద్ది కుంటి మద్ది, జానమద్ది
మన్నాడు ఆకుల మన్నాడు, వడ్ల మన్నాడు
మర్తి గోటమర్తి, వంగ మర్తి
మర్రి తాడిమర్రి, పెండ్లిమర్రి
మర్రు దిరుసుమర్రు, పామర్రు
మర్ల కొండకమర్ల, నెల్లిమర్ల
మల గాడిదమల, సంజమల
మల్లం గుడిమల్లం, పెదమల్లం
మల్లి జరుగుమల్లి, నేదురుమల్లి
మళ్ల ఆకుమళ్ల, తేకుమళ్ల
మాణిక్యం ఉదయ మాణిక్యం, ముడి మాణిక్యం
మాన చీరమాన, పేరమాన
మాని నేమాని, వడ్లమాని
మాను కాకుమాను, వడ్డేమాను
మామిడి కురు మామిడి, చీకటి మామిడి
మామిళ్ల చిరు మామిళ్ల, పొరు మామిళ్ల
మాల మల్లె మాల, విన్న మాల
మిట్ట ఒంటిమిట్ట, దర్గమిట్ట
మిడి పామిడి, పెరిమిడి
మిలి కుమిలి, దిమిలి
మిల్లి అడుసు మిల్లి, మారేడు మిల్లి
ముడి ఉగ్గుముడి, మోడుముడి
ముత్తేవి చిన్నముత్తేవి, పెద్దముత్తేవి
ముది కొండముది, గొరగనముది
మూడి జాగర్లమూడి, జిల్లెళ్లమూడి
మెట్ట కన్మెట్ట, గుడిమెట్ట
మెట్ల జీడిమెట్ల, పురిమెట్ల
మెట్టు ఖమ్మంమెట్టు
మెడ గుండిమెడ
మెర కొమ్మెర, బిమ్మెర
మెరక కరిమెరక, పరిమెరక
మెల తరిమెల, బలిమెల
మెళ్ల గరిమెళ్ల, తురిమెళ్ల
మేడు అంజిమేడు, పిల్లమేడు
మైలారం ఎద్దు మైలారం, పాళం మైలారం
మోలు చనుమోలు, నిడుమోలు

ర

రంగి తొండ్రంగి, పండ్రంగి
రట్ల కొరట్ల, కొటారట్ల
రభ పెదరభ, సింగరభ
రాయి చాట్రాయి, బేట్రాయి

రాల　దుగ్గిరాల, వడ్డిరాల
రాళ్ల　కప్పట్రాళ్ల, పిడుగురాళ్ల
రెడ్డి　కామారెడ్డి, సంగారెడ్డి
రెళ్ల　కూరెళ్ల, మారెళ్ల
రేగ　గాజులరేగ, పాతరేగ
రేణి　కొక్కిరే (రోః) ణి, సింగరేణి
రేవు　పుల్లలరేవు, వాడరేవు
రేవుల　గడిగరేవుల, బోయరేవుల
రొప్పం　కల్లురొప్పం, నరసింగరాయని రొప్పం

ల

లంక　నాగాయలంక, బొబ్బర్లంక
లబుడు　చినలబుడు, పెదలబుడు
లాం　ఉర్లాం, కొర్లాం
లింగాల　పంచలింగాల, కోటిలింగాల
లికి　తెలికి, పొలికి
లోవ　కోనలోవ, రాజపులోవ

వ

వంక　ఎలగలవంక, వినవంక
వంచ　ఉప్పలవంచ, పాలవంచ
వంత్స　అవంత్స, వీరసావంత్స
వతి　అమరావతి, హేమవతి
వనం　నందనవనం, హరివనం
వరం　గన్నవరం, ధర్మవరం
వర్రి　గొడవర్రి, తాటివర్రి
వలస　అముదాల వలస, చిట్టివలస
వలి　కావలి, పెరవలి
వల్లి　గూడవల్లి, మొలగవల్లి
వాక　గాజులవాక, పాములవాక
వాకిలి　ఏటవాకిలి
వాగు　కరకవాగు, మెల్లవాగు
వాడ　బనస్వాడ, విజయవాడ
వాడి　గువ్వాడి, జువ్వాడి
వాయి　కలువాయి, వత్సవాయి
విడి　అవిడి, గరివిడి
విల్లి　అరసవిల్లి, గుట్టవిల్లి
వీడు　ఆకివీడు, వంగవీడు
వీధి　చింతలవీధి, బండవీధి
వెందుల　పులివెందుల, శ్రీవెందుల
వెన్ను　కృత్తివెన్ను, కోలవెన్ను
వెలుగు　నందివెలుగు
వెళ్ల　కడివెళ్ల, సిరివెళ్ల
వేడు　ఆకువేడు, గాలివేడు
వేమిలి　చినవేమిలి, పెదవేమిలి
వేముల　అరకట వేముల, గడి వేముల
వేలు　చిత్వేలు, బద్వేలు
వోయి　కాకివోయి, కలువోయి
వోలు　నిడుదవోలు, బిక్కవోలు

శ

శిల　తక్కశిల, సోమశిల

స

సత్రం　పద్మనాభుని సత్రం
సముద్రం　బుక్కరాయ సముద్రము, హరే సముద్రము
సాగర్　ధర్మసాగర్, నాగార్జున సాగరం
సాగరం　నరసింహ సాగరం, రామసాగరం
సాల　ఘంటసాల, మల్లిసాల
సింగి　నర్సింగి, భీమసింగి
సిరి　ఏకసిరి, గ్రంధసిరి
సిల్ల　పిడిసిల్ల, సిరిసిల్ల
సీల　అడ్డపుసీల, దోకిసీల

హ

హళ్లి　కల్లు దేవన హళ్లి, కొడగిన హళ్లి
హాళు　బంటన హాళు, బేవిన హాళు
హాల్తి　చిన్నహాల్తి, పెద్దహాల్తి

దిగుడు బావి

నీకోసం చిరంతన గతకాల దీర్ఘిక
లోలోపలికి తొంగి చూశాను.
కాని మసక మసక చీకటిలో
నీవెచ్చటు కాన రాలేదు.

కాని జ్ఞాపకాల గట్టి మెట్లులన్ని
క్రమ క్రమంగా దిగి పోయి నీలాల
తేటనీటి దరికి చేరుకున్నాను.

అయినా ఆ నిర్మల నీరంలో నీ మూర్తి
చూచాయగా నయినా స్ఫురించలేదు!

అయితే చిన్నారి మీనుల చెంగలింపులు
నీ చిరునగవుల తళత్తళలయి
మిరుమిట్లు కలిగించాయి!

నీ అధరంతోబాటు అరుణారుణ
కపోలాలు చెంగలవలయి
విచ్చుకున్నాయి!

నిన్ను గురించిన నా తలపోతల తాబేళ్లు
నెమ్మది నెమ్మదిగా నలువైపుల
పారాడాయి!

నీకోసం కూర్చిన నా కైత ముత్యాల
హారం నీటి అట్టడుగునే నిశ్చలంగా
పవ్వళించిన
మెరుపులా తరళించింది!

దాని నిరంతర సౌరళ్యంలో
నీ సర్వాంగ సౌందర్యం
సమగ్ర చైతన్యంతో
సాక్షాత్కరించింది!

అవును! నా అపూర్వ మాధురీమూర్తీ!
నీ వా చిరంతన
గతకాలపు దిగుడు బావిలో,
సజీవమూర్తి వయి నిలిచి,
నన్నానందావేశంతో
మైమరిపించావు!

సాగరతీర దేవాలయము

సాగర తీర పురాతన దేవాయతనంలో
ఓ అదృశ్య దైవత మూర్తీ!
అలనాటి నీ అర్చక భక్తుల ద్గోషించిన
వేదమంత్ర స్వరాల సరోవరాలలో తేల ఆడిన
ఓంకార రాజహంస లీనాడు
గోచరించవు గదా!

అందాల మందారాలయిన అంగనల
మంగళ హారతుల కాంతులతో
మేళవించిన వారి మౌక్తిక హారాల,
కాంచనాలంకారాల వెలుగుల
వింజామర లీ వేళ నీ గర్భాలయంలో
సంభవించవు గదా!

ఒకప్పుడు నీ సమక్షంలో నృత్యమందిరంలో
గజ్జె కట్టి ఆడి పాడిన నర్తకీ గణికల
మోహాన గానాలతో, వారి
మంద్ర మంజీరాలతో శ్రుతి కలిపిన
గర్భగ ఘంటా ధ్వని నేడు
ప్రతి స్వనించదు గదా!

అయ్యో! ఆ వైభవం సమస్తము
అనతి కాలంలోనే
అత్యద్భుత మహేంద్రజాలమయి
అంతరించినది గదా!

అయినా ఓ దేవళమా! నీ శిలా మూర్తుల
అనల్ప కల్పనలో అజరామరులయి
నిలిచిన అలనాటి పల్లవ రాజన్య
శిల్పు లీనాడు కూడా మా
భావనా నేత్రాల సమక్షంలో
సాక్షాత్కరిస్తూనే ఉన్నారు !

ప్రాకారంపై పవ్వళించిన నందీశ్వర
ప్రతిమ లనుదినము నీ దివ్య రహస్యం
నిత్య నూతన బాల భాస్కర
కిరణాల కెరిగిస్తూనే ఉన్నవి !

నీ ప్రస్తుత శిథిల సరళ సౌందర్య
ప్రాభవం సాగర సార్వభౌముడే
సదా వేనోళ్ల
వినుతిస్తూనే ఉన్నాడు !

ఇది ఏ పురాతన జన్మాను
బంధమో కదా !
నిన్ను గురించిన కలల అలల
కన్నీళులతో అర్ద్రమయి
నాకైత అక్షర కర్పూర దీపావళితో
నీకీనాడు నివాళి సమర్పిస్తున్నది !

కీ. శే. పి. గణపతిశాస్త్రి

త ప న

డాక్టర్ గంటి శ్రీరామమూర్తి

కాలం గడుస్తోంది
మనసు మరుగుతోంది
ఏదీ మార్పు ?

కాలం కరుస్తోంది
ఆశ రగుల్తోంది
ఏదీ శాంతి ?

లోకం మండుతోంది
ఆశ నాశమైంది
ఏదీ గమ్యం ?

కాలం మళ్లీ వస్తుందా ?
శాంతి మళ్లీ చిగురిస్తుందా ?
ఆశ మళ్లీ పురివిప్పుతుందా ?
కాలం విసరిన పసిడి గాలిపై
మళ్లీ పయనం సాగిస్తానా ?

శ్రీ చట్టి హనుమంతరావు

ఆర్కెస్ట్రా

ఆ క్షణాల్లో - మా వీధి - అదే మా పట్టాభి వీధి. ఆ వీధిలో మా వాళ్ళంతా ఏంచేస్తూంటారో?

ఆ వీధిలో వున్నన్నాళ్ళ అనుభవం ఎంత బావుండేది- ప్రతి ఇంటిచుట్టూ పైకి లేచిన కొబ్బరిచెట్లు- ఎండ అనిపించనీయని చెట్లగాలి- కొబ్బరాకులతోనే అల్లిన దళ్ళు, మండువా లోగిళ్ళు -

కరువుతీరే అప్యాయతతో పాటూ- కక్షలు కావేషాలు, సెన్సిటివ్ మనుషుల్లో అంటిపెట్టుకున్న ఆచారపు నిష్టలు- అమాయకత్వంతో కూడుకున్న మూర్ఖత్వం. ఏమైనా ఆ జ్ఞాపకాల్ని- నాల్గేళ్ళ క్రిందటి స్మృతుల్ని తరచి చూసుకుంటే ఏ గోదావరి పాయలోనో హాయిగా కులాసాగా ఈదులాడినంత సంతృప్తి. కోనసీమలో పరికించి చూస్తే ఒక్క-క్షణం ఏ కొబ్బరాకుచాటు నించో తెలుగుతనం మూర్తీభవించి కనిపించి మాయమవుతుంది.

నాల్గు సంవత్సరాల క్రిందటి జ్ఞాపకాల అధారంగా ఈ క్షణాల్లో మా వీధిని చూడ్డానికి మనస్సుని వీధి ప్రవేశం చేయిస్తూ —

ఆ వీధి మొదట ప్లీడరు శర్మగారి ఇల్లు - పెంకుటింటి కటకటాల వసారా లోపల్నించి కేకలు- ఇంకెవరూ ఇంటి యజమాని శర్మగారే —

"అబ్బా! మీ వ్రతాలూ - పూజలు కాదుగానీ నాదుంప తెగుతోంది. ఆ మరీనూ- అదేదో చంటిదాని పెళ్ళిలోనే ఏడవల్సిందిగా- అన్నీ కల్సివచ్చేవి. వరేయ్! చవటా మురికిలో దొర్లిన వెధవ బ్యాట్లు తీసుకొచ్చి దస్తావేజుల పక్కన పెడతావూ! తియ్యి చూస్తావే పెరట్లో పారెయ్యి- కొంతం ఆ ఫ్లాస్కు- ఏవో తొందరగా తగలెయ్యి, అమ్మడూ-బోడసకుర్రు మునసబు వస్తే తోటకి వెళ్ళానని చెప్పు అర్జంటయితే అక్కడికే రమ్మను తెలిసిందా ఏమిటే వంట్లో ఎలావుంది. రాత్రి అన్నం సయించిందా టానిక్కువ్వగానే చెప్పు నే తీసుకువస్తాను." పక్క ఇంటి వాటాలో అద్దెకుంటున్న పక్కవూరి హైస్కూలు హెడ్ మాస్టారు రామమూర్తి "ఏమేవ్ కాఫీ కొంచెం వెచ్చబెట్టి ఇస్తావ్ - అః వచ్చాడా! ఈసారి ఇంటికి వస్తే మొఖం మాడేటట్టు చివాట్లు బెట్టు. చివరికి నాతోకూడా అల్లానే వాగుతాడు వెధవ — అయినా వాడి భవిష్యత్తంతా నా చేతిలోనే వుందిగా—ఆ స్పెషల్ ఇంక్రిమెంట్ - టూర్ ఎడ్వాన్స్ నా సంతకం లేకుండా వస్తాయనుకుంటున్నాడు కాబోలు. అన్నట్టు ఆ వెధవ్వేళంగివారి అబ్బాయి వచ్చాడా-ఆ హిప్పీ జుత్తువాడు-ఆ వాడే—ఆ ముఖానికి ఆ జుత్తొకటి — రాలేదూ — అరి స్కౌండ్రల్ నిన్న హోటల్లో ఎవరితోనో మాట్లాడుతుండగా నా దగ్గరికి వచ్చి మీఫీజు ఇంట్లో ఇచ్చానండీ అని నవ్వుకుంటూ పోయాడు. నల్గురిలో నేనేదో సర్దుకోబట్టి అంత అవమానం నించి తప్పించుకున్నాను. చెబుతా వాడిపని. అన్నట్లు అమ్మాయి ఉత్తరం రాసింది ఆదివారం వరకూ ఊటీలో ఉంటారట అట్నించి మైసూరు వెళతారట."

వాళ్ళింటి పక్కనే ఉన్న రమణమ్మగారి భర్త ఎండోమెంట్సు డిపార్టుమెంట్లో ఉద్యోగం. రమణమ్మ గారితో పోట్లాడుతున్న పక్కింటి సుందరి

"మీ వాడికి అంతగా కావాలనివుంటే ఏ వీధిలో కుక్కతో, ఇష్టం లేనివాళ్ళ చెవులో కొరుక్కోమనండి—

అయ్యో బుజ్జి స్వీటీ — ఏడ్వకురా మా చిన్నన్నయ్య నాకిష్టమని వైజాగు నించి తెచ్చి ఇచ్చాడు. వెధవ కొబ్బరి నొజు మీఇంట్లో రోజూ చేసేదేగా పాపం నోరులేనిది — గాట్లుచూశారా ఎలా ఏడుస్తోందో"

"మావాడి సంగతి తెల్సీ మీ కుక్కని అలా విడిచిపెడితే ఎలాగండి? ఫరవాలేదులేండి. రా నాయనా-నీకు మళ్ళీ పెడతాను."

ఆ పక్క ఇంట్లో వుంటున్న ఆయుర్వేదం డాక్టరుగారింట్లో ఏవో పొళ్ళు నూరుతున్న చప్పుళ్ళు. భీమశంకరం గారి మూడో అమ్మాయి మామిడి చెట్టుకింద మంచంమీద నీరసంగా పడుకొని వుంది. ఆ అమ్మాయి వేవిళ్ళ వికారాన్ని పోగొట్ట డానికి ఉసిరికాయ డబ్బా పుచ్చుకొని అమ్మమ్మ తెగ తంటాలు పడుతోంది.

ఆ పక్క-ఇల్లు గోపాలం గారిది. పిల్లలందరూ గుమ్మం లోంచి తలలు బయటపెట్టి అరుగు మీదకి విచిత్రంగా చూస్తున్నారు.

ఆ ఇంటి మామ్మగారు అరుస్తోంది. వరేయి కిట్టూ నువ్వెళ్ళి పనిదాన్ని పిల్చుకురా! ఫో తొందరగా ఫో అసలే నాకూ మీ అమ్మకూ ఉపవాసం. ఈ రోజు ఇదెక్కడి తద్దినం-ఏ కాకో, కుక్కో తెచ్చి పడేసి వుంటుంది. అమ్మా సుబ్బలక్ష్మీ నువ్వెళ్ళి బావి నీళ్ళు తీసుకురామ్మా. మావిళ్ళు వచ్చాక శుభ్రం చేయించి అరుగు బావిడి అంతా కడిగించేస్తాను. ఒక్క కాగు చాల్లేవే! ఆ! మరీనూ!

వెధవ సంత ఎలా తిని ఏడుస్తారో-మనుషులో - రాక్షసులో

వరేయి! ఏమిటా చోద్యం - ఏమిటంటూ -

"మామ్మా వెనుకకాలి ఎముకా! ముందుకాలి బొమికా అని చూస్తున్నానంతే. అబ్బా - దూరంగానే ఉన్నానులేవే-"

పక్కింటి దీక్షితులు గారింట్లోంచి -

లక్షపత్రి పూజకి విజయనగరంనించి రామనాధం సోమయాజులుగార్కి వారి బావగార్ని పిలిపిద్దామనుకుంటిమి కదా. అదే మొన్న కమిటీలో తీర్మానించాం కదా. ఎక్కవుంటులోంచి నాల్గు వందలు తీయించి మావాడ్ని విజయనగరం పంపించాను. మా ఇంట్లోనే మకాం అదీను అనుకోండి. ఆ, అగుతాడు-మా మూడో అమ్మాయి నిర్మల పురిటికి ఈ సారికి ఇక్కడికే వస్తానని వాళ్ళమ్మకి వుత్తరం రాసింది. ఎలాగూ - అనకాపల్లి అదే దారికాబట్టి పదిరోజులు ముందు అయితే అయింది తీసుకొచ్చేయ్యమన్నాను. - అమ్మా సుశీ - శాస్త్రిగార్కి మంచినీళ్ళు పట్రా.

ముఖాన బొట్టు లేనట్టుంది చూడు.

ఆ పక్క ఇంటివాళ్ళ తులసి చెట్టు వాడిపోయి - ఎండిపోయే పరిస్థితుల్లో వుంది. ఇంటి వాళ్ళంతా మొన్నీమధ్య ఉత్తర దేశ యాత్రలకి వెళ్ళి పోయారు. పోస్టుమాన్ కవరు నొకదాన్ని తలుపు సందులోంచి లోపలికి పడేయడానికి తంటాలుపడుతున్నాడు.

ఈ వాటాలో మొన్నీమధ్యే దిగినట్లున్నారు. కొత్తగా పెళ్ళి గట్టా అయిన కాపురం కాబోలు. ఈ ఇంటి తలుపుల్ని ఒక్క క్షణం తెరిపించ గలిగే వీరు లెవరయినా వుంటే - ఒక్క పాలవాడు - తప్పితే పనిమనిషి.

ఆ ఇంటి పక్క మొదటివాటా శైలజమ్మగార్ని ఓదార్చుతూ రెండవ వాటా జానకీబాయి.

"ఇంకా ఎందుకండీ బాధపడతారు. పిల్లాడు క్షేమంగానే ఉన్నట్టు తెల్సిందికదా-ఎంత జంతువులతో ఆడేవాళ్ళయితే మాత్రం వాళ్ళు మాత్రం మనుషులు కారటండీ! ఎదో పని జేయించినంత మాత్రాన తిండి పెట్టకపోరు. అయినా మీ వీరేష మాత్రం ఎన్నాళ్ళుండ గలడండీ మిమ్మల్ని విడిచిపెట్టి - ఏదో కొత్తతో వెళ్ళాడు కానీ మొహమ్మొత్తి నాల్గురోజుల్లో ఆ సర్కస్సు వాళ్ళ కళ్ళుకొట్టి ఇట్టే వస్తాడు.

అదిగో నామాట సత్యం! విన్నారా మా ఇంట్లో కొత్త గడియారం గంట కొట్టింది. మా పిల్లలు గొడవ జేస్తున్నట్లున్నారు - నే వెళుతున్నా కానీ బాధ పడకండమ్మా -"

ఎదురుగా ఆ వూరి లీడింగ్ లాయర్ భక్తవత్సలంగారి ఇంట్లో ఆయన్ని పెంచిన మేనత్త తద్దినం హడావుడి. పెరట్లో గాడిపొయ్యి వెనుక వీధిలో పక్కగుమ్మంలోంచి చాటుగా ఇంట్లోకి హోటల్నించి టిఫిన్ చేరవేస్తున్న మునిమనమడు అండ్ కో.

డిప్టీ తాసిల్దారి ఇంట్లో పెద్దమ్మాయి సుశీల చిన్నమ్మాయి సుందరితో - వసేయి - ఏమైనా సరే ఇవాళ మాష్టారిచేత కొత్త రాగమేదయినా చెప్పించుకొని గానీ వదిలేదిలేదు. ప్రకాశం వీధిలో మనతోపాటు నేర్చుకుంటున్న మాలినికి రెండు కొత్త రాగాలతో పాటు అన్నమాచార్య కీర్తనలొచ్చేసాయిట.

పక్కఇంట్లో డిటెక్టివ్ నవలలు రాసే ఆయన వెస్టర్న్ మ్యూజిక్ వింటూ గదిలో కాగితాలతో కుస్తీ పడుతున్నాడు. అతని భార్య కల్పన పూలకోసం అవల వీధి నవలల ఫ్రెండ్ పంపిన పనిపిల్లకి సన్నజాజి మొగ్గలు తుంచి ఇస్తూ ఓపక్క పూర్తిచేసి ఇవ్వాల్సిన సీరియల్ని సీరియస్‌గా చదివేస్తోంది.

ఆ పక్కవాటాలో అద్దెకుంటున్న వాళ్ళింటిలోంచి కొత్తగా కొన్న టేప్‌రికార్డరు పెంకులు బద్దలు కొడుతోంది.

ఆ పక్క ఇంటి మామ్మగారు వడియాల్ని కాపలాకాస్తూ కూనిరాగాలు తీస్తోంది.

ఇళ్ళ హడావిడి వదిలి వీధిలో రోడ్డుమీద సంబడం చూస్తే.

ఒకచోట "వరేయి గంటలో వస్తా - రెడీగావుండు బట్టలు వేసుకొని."

"ఏయ్ పిల్లా! ఆ కొబ్బరిమట్ట మా చెట్టు మీదనించే పడింది అలా వదిలేయి - ఊ! నిన్నే."

"అలా రోడ్డు మీద రాళ్ళు విసరకు నాయనా! వెళ్ళు ఇంట్లో కెళ్ళి ఆడుకో -"

"చూస్తాను సాయంత్రం ఇలా వెడుతుందికదూ - అప్పుడు దాని పొగరణగ దీస్తాను - డర్టీ" ....

"అక్కయ్యా - ఈ వాల్ పోస్టరు బావుంది కదూ - ఛీ! అప్పుడే ఎవరో పేడపూసేసారే -"

నాన్నోయి - నా రిబ్బను మర్చిపోకు - ఎఱ్ఱ రంగుది.

ఇంకా -

వీధిలో మంచి శకునంకోసం గంటనించి ఎదురు చూస్తున్న సుబ్బారావు -

పదేళ్ళ పిల్లాడ్ని వీధి ప్రెస్టేజీకోసం చావగొడ్తున్న నర్సమ్మ.
సీతాకోక చిలుకని పట్టి నల్లేస్తున్న ఏడేళ్ళ రాంబాబు.

ఏకాసి స్నానంకోసం జిల్లేడాకులు కోస్తున్న అవధాన్లు -

అక్క నోటు బుక్కులో బొమ్మలు గీస్తున్న శీనప్ప -

పెళ్ళి ముహూర్తం దగ్గరవడంతో చెప్పలేని దిగులుకలసిన ఆనందంతో ఇల్లంతా పనిలేకుండా తిరిగేస్తున్న వసుమతి —

భర్త రాకకోసం ఆశని ఆకాశం అంత చేసుకొని చూసే నిర్మలమ్మ —

వీళ్ళందర్ని తల్చుకున్నప్పుడల్లా - అబ్బా —

పులి పంజా

"సస్యశ్రీ"

వహా విశాఖలోని మత్త కోకిల మరి మారుపలుకదు;
మధురసాలూరు మందారం తేట తెలుగు లిక ఒలుకదు.
పదిమందిపలుకుబడిలో దేవతలకు పంచాంగం చెప్పడానికి,
కోయిల హంసగా మారి పోయింది ఎగిరి దివికి;
"సౌదామిని" వెలుగులో మందారం చేరుకుంది నందనానికి,
పారిజాతాన్ని పెకలించి పట్టుకు రాడానికి భువికి.

తెలుగుమీరి మిద్దెక్కిన పద్యాన్ని తెగువతో కిందకుదింపి
తేలిక వచనంగా, చెవులు మెలిపెట్టి, తెలిగించుకొని,
గంపల్లతో వాడుక భాషను గాదెలలో నింపి,
గద్యానికి గండ పెండరము వేసి గద్దెమీదకు పంపి,

గుప్పెడు కప్పురం తీసి గుప్పున వెలిగించుకున్న గుండె
అప్పన్నకొండ; కండగల కళింగాంధ్ర కలకండ!

గిడుగు వారసుడిగా "వ్యావహారిం"చిన పిల్లపిడుగు,
ఫిరంగి గుండు;
ఛాందసం మడికీ, గ్రాంథికం జడికీ జడియని గండరగండ.
తోకతొక్కిన కోడెనాగు పడగ నింగి కెత్తిన విప్లవ
"పులిపంజా!"
తోక తక్కువ తొంభై దీపావళులు తొంగలించిన సారస్వత
సంజ
జన పదాన ఎగరేసిన "జానపదం" జయ జండా!
అభ్యుదయకామి; అగ్రగామి; అప్పలస్వామి పులిపంజా!!

డాక్టర్ కోర్లపాటి శ్రీరామమూర్తి

అపర నన్నయభట్టు

లక్షణసారము, ఆంధ్రశబ్దచింతామణి

నన్నయభట్టు లక్షణసారము అని ఒక లక్షణగ్రంథము కలదు. కాని, ఉపలబ్ధము కాలేదు. ఇతర లక్షణగ్రంథము లందు ఉట్టంకనములు కలవు. కస్తూరి రంగకవి ఆనంద రంగరాట్ఛందము నుండి ఒక పద్యమును కందుకూరి వీరేశలింగము గారు ఉదహరించిరి.[1] ఆనంద రంగరాట్ఛందము నుండియే మరొక ఏడు పద్యములను చాగంటి శేషయ్య గారు ఉదాహరించుటయే గాక, ఇట్లు వ్రాసిరి.[2]

'నన్నయభట్టు లక్షణసారమును రచించినట్టు అప్పకవ్యాది లక్షణవేత్త లెవ్వరును జెప్పియుండలేదు. కవులు గాని పండితులు గాని చరిత్రకారులు గాని యిదివఱ కెవ్వరును, నన్నయభట్టు లక్షణసారమును రచించినట్లు చెప్పలేదు. అట్టి సందర్భములో నీ రంగకవికి లక్షణసార మెచ్చట లభించెనో తెలియదు. తృప్తికరమయిన సాక్ష్యము లభించిననే తప్ప నీ పద్యములు నన్నయభట్టువని తలంప వీలులేదు.'

ఇట్టిఅభిప్రాయము కలుగుట సహజమేగాని, ఎట్టి సాక్ష్యము లభించునో ఇంకను పరిశోధనీయము. నన్నయభట్టు లక్షణసారము గుఱించి అప్పకవ్యాది లాక్షణికులు కొందఱు చెప్పిరి. కస్తూరి రంగకవి ఆనంద రంగరాట్ఛందమున 'నన్నయభట్టు లక్షణ సారంబున' అని ఉట్టంకించిన పద్యములు మొత్తము తొమ్మిది కలవు. అవియెల్ల అంతఃపూర్వుడైన గణపవరపు వేంకటకవి ఆంధ్రప్రయోగరత్నాకరము నందు కలవు. రంగరాట్ఛందము పదునెన్మిదవశతాబ్ది ఉత్తరార్ధములోని గ్రంథము. ప్రయోగ రత్నాకరము పదునేడవ శతాబ్ది ఉత్తరార్ధములోని గ్రంథము. రంగరాట్ఛందములోని,

'స్వరవర్గప్లుతముల్ శకంధు గణఋత్వ ప్రాద్యభేదోర్వను
స్వర భిన్న ప్రభుకాకు నిత్యములు దేశ్యజ్ఞోభయా ఖండ
ముల్
సరసాదేశ విభాగ వృత్తులును మా సంయుక్త వైకల్ప
ముల్
గరిమింబోలిన చక్క-టెక్క-లి యనంగా నిర్వదేడౌ
యతుల్' 13 ప., 3 ఆ.

అను పద్యము మాత్రము ప్రయోగ రత్నాకరము నందు,

'స్వరవర్గప్లుత నిత్యపోలికలు ఋత్వప్రాద్యభేదర్యను
స్వర భిన్న ప్రభుకాకు వృద్ధ్యుభయముల్ చక్క-ట్లు
ఖండమ్ములున్
సరసాదేశ విభాగమత్వముయి నా సంయుక్త వైకల్ప్య
ముల్
ధరలో నిర్వది నాల్గువళ్లగు ముకుందా యెక్క-టిం
గూడగన్'

అని కలదు. అంతేకాదు. ఇది 'అనంతుని ఛందము' లోనిదని కలదు. కాని, అనంతుని ఛందము నందు ఈ పద్యము లేదు. ఉండవలసిన అవశ్యకము లేదు. ఉండుటకు అవకాశమును లేదు. వేఱు పద్యములు కలవు. (79-81 ప., 1 అ.). అనంతుని ఛందము నందు ఇరువదినాల్గు యతులే కలవు. కాని అనంతుని ఛందము లోని ఇరువదినాల్గు యతులు, పయి పద్యములోని ఇరువదినాల్గు యతులు ఒకటి కాదు. కనుక గణపవరపు వేంకటకవి తెలిపిన ఆకరము ప్రామాదికము, కస్తూరి రంగకవి తెలిపిన ఆకరము ప్రామాణికము కావలయును.

ప్రయోగ రత్నాకరము నందు -

'ప్రాదినిత్యయతి యని సంజ్ఞ. ప్రాదినిత్య సమాసరహిత సమస్తోభయ యతి యనేటందుకు - ఇందుకే నన్నయభట్టు లక్షణ సార లక్ష్యం. పెద్దిరాజులంకారం - అచ్చకు -

ఉ. సాలకపాలభాగలును సంకురిత స్తనబింబలున్ పిక
ల్పాంన బాలలీలలును సల్పవివేకలు నైనవారి భూ
పాలుర ముద్దుగన్నియల భాగ్యము లెన్నుదురర్థి విశ్వభూ
పాలుని రాజ్యలక్ష్మికి సపత్నికులయ్యెదరంచు ప్రాశ్నికుల్'

అని కలదు. పెద్దిరాలంకార మన విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి. అందు పయి పద్యము కలదు. (32 ప., 3 ఉల్లా.). అది నన్నయభట్టు లక్షణ సారములోని లక్ష్యమని పయి వచనము నందు స్పష్టముగ కలదు. కనుక నన్నయభట్టు లక్షణసారము విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి కంటె అనంతర గ్రంథము కావలయును.

అనంతుని ఛందము నందు ఇరువదినాల్గు యతులు ఉండు టయేగాక,

'భీమన పదిచెప్పె ననం
తామాత్యుడు చేసె వెనుక యతు లిరువదినా
ల్గా మీఁదఁ గొందఱు కవి
గ్రామణు లిరువదియు నేడు గావించి రాగిన్' 7 ప., 3 ఆ

అని కాకునూరి అప్పకవి ఆంధ్రశబ్ద చింతామణి యందు కలదు. ఇందు ఇరువది యేడు యతులు కొందఱు కవిగ్రామణులు కావించి రని కలదు గాని వారి పేరులు లేవు. ఆనందరంగరాట్ఛందములోని 'స్వరవర్గప్లుతముల్' అను పద్యము నందు ఇరువదియేడు యతులు కలవు. అవి 'నన్నయభట్టు లక్షణ సారము' లోని వని అందే కలదు. కనుక అప్పకవి చెప్పిన కొందఱు కవిగ్రామణులలో లక్షణసారమును రచించిన 'నన్నయభట్టు ఒకడు కావలయును. అంతేకాక నన్నయభట్టు లక్షణసారము విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి కంటె మాత్రమే గాక, అనంతామాత్యుని ఛందము లేక ఛందోదర్పణము కంటెను అర్వాచీన గ్రంథము కావలయును.

కస్తూరి రంగకవి ఆనందరంగరాట్ఛందము నందు నన్నయ భట్టు లక్షణసారములోని లక్షణములు తొమ్మిదే కలవు గాని, గణప వరపు వేంకటకవి ఆంధ్ర ప్రయోగ రత్నాకరము నందు నన్నయ భట్టు లక్షణసారములోని లక్ష్యలక్షణములు మొత్తము పాతిక వఱకు కలవు. అందు,

'అఖండ స్వరయతికి నన్నయభట్టు లక్షణసారలక్షణం–

కవిజనసంజీవనిలో లక్ష్యం—

మ. సుకవిస్తుత్యముగా నఖండయతి నిల్చున్ విక్రతంబై యొకా
నొకచోటన్ జలజాత జాతశతమన్యుల్ సన్నుతుల్ సేయగా
సకలోర్వీ వలయంబు చూచుటకు కంసాది ప్రమత్తాభియా
త్రికులంబెల్ల నడంచినాఁడు జితదైత్యేంద్రుండుపేంద్రుం డనన్'

అని కలదు. ఇందు పయి పద్యము నన్నయభట్టు లక్షణసారము లోని లక్షణ మని, కవిజనసంజీవనిలోని లక్ష్యమని ఇదమిత్థముగ కలదు. కవిజనసంజీవని అనగా ముద్దరాజు రామన రచించిన కవి సంజీవని. అది ముద్రితమేగాని అసమగ్రము. సమగ్ర గ్రంథము సముపలబ్ధము కాలేదు. అసమగ్రమైన ముద్రిత గ్రంథము నందు పయి పద్యము కలదు. (89 ప., 1 త.) కాని, నన్నయభట్టు లక్షణ సారములోని లక్షణమనిలేదు. ఉపలబ్ధ మైనంతవఱకు, కవిసంజీవని లక్షణములెల్ల కందగీతము లందు వినా, మఱొక్క లక్షణమును వృత్తము నందు లేదు. కనుక వృత్తలక్షణము కవిసంజీవని లక్షణము కాదు. కవిసంజీవనిలోని లక్ష్యమే కావలయును. నన్నయ భట్టు లక్షణసారములోని లక్షణము కవిసంజీవనిలోని లక్ష్యమనియే ప్రయోగరత్నాకరము నందు కలదు. కనుక ప్రయోగరత్నాకరము లోని ప్రకరణము యథార్థము కావలయును. అయిన, నన్నయ భట్టు లక్షణసారము ముద్దరాజు రామన కవిసంజీవని కంటె పూర్వ గ్రంథమే అగును.

గణపవరపు వేంకటకవి ఆంధ్రప్రయోగ రత్నాకరము నందు, కస్తూరి రంగకవి ఆనందరంగరాట్ఛందము నందు, నన్నయ భట్టు లక్షణసారములోనిదని ఉట్టంకించిన,

వపయో రభేద యనియెడు
నెపమున పఫ బభలు వాకునిడుదురు వళిగా
నుపమింపవచ్చు కృతులన్
దుపనిపదు చితాప్తసూక్తు లొనరుట వలనన్'

అను పద్యము లింగమగుంట తిమ్మకవి సులక్షణసారము నందు కలదు (146 ప.) కనుక నన్నయభట్టు లక్షణసారము ముద్దరాజు రామన కవిసంజీవనితోపాటు లింగమగుంట తిమ్మకవి సులక్షణ సారముకంటెను పూర్వగ్రంథము కావలయును.

మొత్తముమీద నన్నయభట్టు లక్షణసారము, విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి, అనంతామాత్యుని ఛందో దర్పణముల కంటె అర్వాచీనగ్రంథము, ముద్దరాజు రామన కవి సంజీవని, లింగమగుంట తిమ్మకవి సులక్షణసారముల కంటె పూర్వ గ్రంథము. విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి, అనంతా మాత్యుని ఛందోదర్పణము పదునైదవశతాబ్ది పూర్వార్ధములోని గ్రంథములు. ముద్దరాజు రామన కవిసంజీవని పదునేడవ శతాబ్ది

పూర్వార్ధములోని గ్రంథము. లింగమగుంట తిమ్మకవి సులక్షణ సారము పదునారవ శతాబ్ది ఉత్తరార్ధములోని గ్రంథము. కనుక నన్నయభట్టు లక్షణసారము తన్మధ్య కాలములోని గ్రంథము కావలయును. ఆ మధ్యకాలము స్థూలముగ 1450-1550.

మఱి నన్నయభట్టు ఇంద్రవిజయమని మఱొక గ్రంథము కలదు. అదికూడ ఉపలబ్ధము కాలేదు. కాని లక్షణగ్రంథము లందు ఉట్టంకనములు కలవు. కస్తూరి రంగకవి ఆనందరంగరాట్ఛందము నుండి ఒక పద్యమును కందుకూరి వీరేశలింగము గారు ఉదాహరించిరి.[3] మఱొక పద్యమును వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఉదాహరించి, 'విశ్వాస్యమగునా ?' అని శంకించిరి.[4] కస్తూరి రంగకవి ఆనందరంగరాట్ఛందములోని ఆ రెండు పద్యములును చాగంటి శేషయ్యగారు ఉదాహరించి ఇట్లు వ్రాసిరి.[5]

"ఈ పద్యమున 'నాలుక' యనుటకు బదులుగా 'నాలిక' యనుటయు, ల, ళ, లకు యతిమైత్రిఁ జేయుటయు, ద్రుతాంత శబ్దముపై వచ్చు పరుషమును బరుషముగా నుంచుటయుఁ జూడ నీ గ్రంథము నన్నయ మహాకవి కృతము గాక నన్నయ నామధారి యగు మఱియొకనిచే రచింపబడినదై యుండుననియుఁ దలంపవలసి యున్నది."

ఇందు 'నన్నయ నామధారి యగు మఱియొకనిచే రచింపబడినదై యుండు' నను తలంపు గమనార్హమైన విషయము.

కస్తూరి రంగకవి ఆనందరంగరాట్ఛందము నందు నన్నయభట్టు ఇంద్రవిజయములోని పద్యములు రెండు కలవు. (102, 278 ప., 3 ఆ.). అవి రెండును గణపవరపు వేంకటకవి ఆంధ్ర ప్రయోగ రత్నాకరము నందు కలవు. అంతేకాదు. గణపవరపు వేంకటకవి ఆంధ్ర ప్రయోగ రత్నాకరము నందు నన్నయభట్టు ఇంద్రవిజయములోని పద్యములు మొత్తము అయిదు కలవు. అందు,

'ఇందుకే ఉత్తమగండ ఛందోలక్ష్యం. నన్నయభట్టు ఇంద్ర విజయం. చంగవకు -

'క. అంగజుఁడను మాసటి చ
క్కంగను రాయంచయేనుగను నూకుచు చే
చెంగలువ నేజచే చెలి
చంగవ నడుచక్కి గుమ్మ సరగున నాచేన్'

అని కలదు. పయి కంద పద్యము నన్నయభట్టు ఇంద్ర విజయములోనిదని మాత్రమేగాక, అది ఉత్తమ గండచ్ఛందములోని లక్ష్యమని కూడ పయి వచనము నందు స్పష్టముగ కలదు. ఉత్తమ గండచ్ఛందమును ఉపలబ్ధము కాదు. అది చిత్రపుభీమన రచించిన లక్షణ గ్రంథమని పొత్తపి వేంకటరమణ కవి లక్షణ శిరోమణి యందు కలదు. ఉత్తమ గండచ్ఛందము 'ఉత్తమ గండ బిరుదము గల సాళువ కంపరాజున కంకితము'. అని రావూరి దొరస్వామిశర్మ గారి అభిప్రాయము.[6] సాళువ "కంప రాజుకు 'ఉత్తమ గండ' అనే బిరుదు ఉన్నట్టు కనబడదు" అని ఆరుద్రగారి అభిప్రాయము.[7] కనఁబడనిమాట నిజము. కనుక ఉత్తమ గండచ్ఛందము సాళువ కంపరాజునకు అంకితము కాఁజాలదు. ఉత్తమ గండచ్ఛందములోని లక్షణములు ప్రథమతః లింగమగుంట తిమ్మకవి సులక్షణసారము నందు ఉట్టంకింపఁబడినవి. కనుక చిత్రపు భీమన ఉత్తమ గండచ్ఛందము, లింగమగుంట తిమ్మకవి సులక్షణసారము కంటె పూర్వ గ్రంథము కావలయును. ప్రయోగ రత్నాకరము నందు ఉత్తమ గండచ్ఛందములోని లక్ష్యములును కలవు. అందు కవి మాధవుని బ్రహ్మాండ పురాణము నుండి, కవి పేరు తెలియని శతముఖ రామాయణము నుండి పద్యములు కలవు. శతముఖ రామాయణ, బ్రహ్మాండ పురాణములును ఉపలబ్ధములు కావు. వాని రచనా కాలములు తెలియు నవకాశములు లేవు. కాని, పదునారవ శతాబ్ది పూర్వార్ధములోని గ్రంథములు కావచ్చును. కనుక ఉత్తమ గండచ్ఛందము పదునారవ శతాబ్ది కంటె ప్రాచీన గ్రంథము కాకపోవచ్చును.

నన్నయభట్టు ఇంద్ర విజయములోని పద్యము ఉత్తమ గండచ్ఛందము నందువలె ఆంధ్ర శ్రీధరచ్ఛందము నందును కలదని ఆంధ్ర ప్రయోగ రత్నాకరము నందు కలదు.

"నన్నయ భట్టింద్ర విజయం. ఆంధ్ర శ్రీధర ఛందో లక్ష్యము.

ఒక పలువాతగొన్న కిటియన్ తలలోనిడు కూర్మి భర్త నా
లికె లిరుగన్న శీదిరపు రెండు పయోధరదార పుట్ట బెం
చు కులనగాలి యీడు ప్రతిజోడెనయంచన గూడదేరి నె
న్నికగ యయాతి యొంటిధరణిన్ భజియించె చెలంగ
వానికిన్'

ఇందు నన్నయభట్టు ఇంద్రవిజయములోని పద్యముఆంధ్ర శ్రీధరచ్ఛందములోని లక్ష్యమని కలదు. శ్రీధరచ్ఛందస్సును ఉపలబ్ధము కాలేదు. కాని లక్షణ గ్రంథము లందు ఉట్టంకనములు కలవు. అందు 'అరిరాయ విభాల సోమయవనీపాలా, పెన్నభూవరుని సోమా, పిన్నయసోమా' అను సంబుద్ధులు కలవు. కనుక శ్రీధరచ్ఛందస్సు పిన్నయ సోమభూపాలునికి అంకితము కావలయును. అతడు అరవీటి తాత పిన్నమ సోమభూపాలుడు అయిన,

శ్రీధరచ్ఛందము పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధములోని గ్రంథమగును. కాని పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధములోని వేములవాడ భీమకవి కవి జనాశ్రయము నందు గాని, పదునైదవ శతాబ్ది పూర్వార్ధములోని విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి, అనంతామాత్యుని ఛందోదర్పణముల యందు గాని పూర్వకవి ప్రయోగ ప్రదర్శనము లేదు. పదునారవశతాబ్ది పూర్వార్ధములోని వెల్లంకి తాతంభట్టు కవి చింతామణి నుండి పూర్వకవి ప్రయోగ ప్రదర్శనము కలదు. శ్రీధరచ్ఛందము ప్రథమతః పదునారవశతాబ్ది ఉత్తరార్ధములోని లింగమగుంట తిమ్మకవి సులక్షణసారమునందు ప్రసక్తము. కనుక శ్రీధరచ్ఛందము పదునారవశతాబ్ది మధ్య కాలములోని గ్రంథము కావలయును. అందు ప్రసక్తమైన నన్నయ భట్టు ఇంద్ర విజయము తత్పూర్వకాలములోని గ్రంథమగును. ఆ కాలము స్థూలముగ 1450– 1550 కావచ్చును.

ఇక నన్నయభట్టు రాఘవాభ్యుదయ మని ఇంకొక గ్రంథము కలదు. ఇది కందుకూరి వీరేశలింగము గారు తెలిపినది. ఆ విషయ మిది [8]:

'నన్నయభట్టు రాఘవాభ్యుదయ మను నొక గ్రంథమును జేసినట్లు వ్రాసి యా గ్రంథము లోనిదని యీ క్రింది పద్యము నొకానొక రుదాహరించి యున్నారు.

క॥ వికలుని ఖరదూషణముఖ
సకలవనచరులు వొదివిరి సమ్మదముగ ని
ష్పుకకుప్పకు మూఁగెడు మిడు
తుకపిండువితాన బాఁతి తోచెడు బుద్ధిన్

ఈ పద్యము నన్నయభట్టారకుని కవిత్వమును బోలి యుండక పోవుటచేత నీతఁడా నామముగల మఱియొక యప్రౌఢకవి యయియుండవచ్చును. '

ఇందు రాఘవాభ్యుదయమును రచించిన నన్నయభట్టు 'మఱియొక యప్రౌఢకవి' అను మాట గమనార్హమైన విషయము.

అయినను చాగంటి శేషయ్య గారి అభిప్రాయ మిది [9]:

'నన్నయభట్టు రాఘవాభ్యుదయమను నొక గ్రంథమును వ్రాసి యున్నట్లొకరు వ్రాసియున్నారు.

కాని యందుల కాధారమేమియు లేదు' –

ఇందు ఆధారము లేదనియు, ఒకరు వ్రాసియున్నా రని యును కలదు. ఆ ఒకరు ఎవ్వరో లేదు. రాఘవాభ్యుదయములోని పద్యమును ఉదహరించిన వీరేశలింగము గారు తెలిపిన విషయము నందును ఒకానొకరు ఉదాహరించి రనియే గాని, ఆ ఒకానొకరు ఎవ్వరో లేదు. వీరేశలింగము గారు తెలిపిన విషయము 1917 వ సంవత్సరము నందు ప్రకటింపఁ బడినది. అంతకు పూర్వము రాఘవాభ్యుదయములోని పద్యమును ఉదాహరించి వ్రాసినవారు ఎవరో తెలియదు. రాఘవాభ్యుదయమును రచించిన నన్నయభట్టు అప్రౌఢకవి వలె, 'ఒకానొకరు' అప్రామాణికులు అయినను, పద్యము కలదు. కావున పరిత్యాజ్యము కాదు. రాఘవాభ్యుదయ మును రచించిన నన్నయభట్టు వలె, ఇంద్రవిజయమును రచించిన నన్నయభట్టును అప్రౌఢకవియే. కనుక ఇంద్ర విజయమును రచించిన నన్నయభట్టు, రాఘవాభ్యుదయమును రచించిన నన్నయ భట్టు కావచ్చును.

ఇక నన్నయభట్టు చాముండికా విలాసమని వేఱొక గ్రంథము కలదు. ఇది మాతృక, పుత్త్రిక, ముద్రితపత్రిక కలది. పుత్త్రికను ముద్రిత పత్రికను చదివిన కందుకూరు వీరేశలింగము గారు అందిచ్చిన సమాచార మిది :[10]

'నన్నయభట్టు విరచితమైన 'చాముండికావిలాస' మను పద్యకావ్య మొకటి నూతనముగా లభించినట్టి నడుమ నాంధ్ర పత్రిక యందుఁ బ్రకటింపఁబడినది. దుర్మతినామ సంవత్సరమునం దనఁగా నిప్పటికేఁబది యైదు సంవత్సరముల క్రిందట (1917 – 55 =1862) పూర్వపు మాతృకను జూచి దొర్ని పేరయ్య యను నాతనిచే వ్రాయఁబడిన పుత్రికను దెప్పించి సావధానముగా నేనా మూలాగ్రముగాఁ జదివితిని. చదివిన కొలఁదిని నాకది నన్నయ భట్టకృతము కాదన్న యభిప్రాయము బలపడసాగినది. .... ఈ గ్రంథమును రచించినకవి వేఱొక నన్నయభట్టనుకొనుటకును వీలులేకుండఁ బ్రథమాశ్వాసారంభమున నున్న యీ క్రింది సీస పద్యము బాధించుచున్నది––

వ్యాసాది ఋషులకు వందనమొనరించి
  కవిమల్లులను జాల ఘనత నెంచి
సుకవీశ్వరులనెల్ల సొంపుగా వినుతించి
  గురుపాదయుగ్మముల్సరవిఁగొలిచి
యిష్టదేవాళి సంతుష్టత సేవించి
  మంత్రాధిదేవత మదిఁ దలంచి
సర్వజనావళికి సంతోష మొనరించి
  పార్థివసభల వైభవము గాంచి
యాంధ్రవాక్యానుశాసనం బతిశయిల్లఁ
జేసి లోకోపకారార్థ సిద్ధిఁజేసి
ఘనత రాజరాజనరేంద్రుని కరుణఁబడసి
నట్టివాఁడను నన్నయభట్టనేను.

రాజనరేంద్రుని కరుణను బడసిన యీ కవి యీ పుస్తకమును రాజనరేంద్రుని కేల యంకిత మొనర్పలేదో? చాముండికా విలాసము శ్రీరాముని కంకితము జేయఁబడినది .... ఈ గ్రంథము నన్నయభట్ట కృతము గాదని తలఁచుటకు నాకుఁగల కారణముల నిందు క్రింద సంగ్రహముగా దెలుపుచున్నాను.

"1. .... చాముండికా విలాసమునం దాదిని సంస్కృత శ్లోకము లేకుండుటచే నది నన్నయకాలపుది కాదనుట స్పష్టము.

2. నన్నయభట్టు కాలమునం దాచారములోలేని షష్ఠ్యంత పద్యము లిందుండుట.

3. నన్నయభట్టు కాలమునందు విశేషముగా వాడఁబడుచుండిన మధ్యాక్కర మొదలగు పద్యము లిందు లేకపోవుట.

4. నన్నయ సీసపద్యముల కంటె భిన్నవిధమైన సీసపద్యము లిందుండుట....

5. .... రాజమహేంద్రవరపు తెలుఁగును గాక దత్తమండలము (లోని తెలుగును) గలిగి యుండుట....

6. .... యక్షగాన రూపకము....లందుండిన రీతిగా 'ఎట్టులనిన' 'ఎట్లంగిననిన'లో నగు పద ప్రయోగములను జేయుట

7. పుస్తక మంతయు నత్యల్ప పద్యభాగముతోను నత్యధిక గద్యభాగముతోడను గూడియున్నది".

ఇందు తెలిపిన ప్రత్యంశము చాముండికావిలాసము ఆదికవి నన్నయభట్టు కృతము కాదనుటకు సాధకము. మధ్యకవి నన్నయభట్టు కృత మనుటకును చాముండికావిలాస పద్యములోని 'ఘనత రాజనరేంద్రుని కరుణఁబడసినట్టి వాఁడను నన్నయభట్ట నేను'అను పంక్తి బాధకము. కనుక నన్నయభట్టు చాముండికావిలాసము ఆదికవి నన్నయభట్టు పేర అర్వాచీనకవి కూటసృష్టి కావలయును.

ఇంతకు, ఆదికవి నన్నయభట్టు కాలము పదొకండవ శతాబ్ది. మధ్యకవి నన్నయభట్టు కాలము పదునైదవశతాబ్ది ఉత్తరార్ధము, పదునారవశతాబ్ది పూర్వార్ధమును (1450–1550). కనుక మహాభారత సంహితా రచన బంధుడైన నన్నయభట్టు కంటె, లక్షణసారేంద్ర విజయరాఘవాభ్యుదయ రచన సంబంధుడైన నన్నయభట్టు భిన్నుడని కరతలామలకము.

నన్నయభట్టు రాఘవాభ్యుదయము గుఱించి కందుకూరి వీరేశలింగము గారు, నన్నయభట్టు ఇంద్రవిజయము గుఱించి చాగంటి శేషయ్య గారు అనుమానించిన విషయము నన్నయభట్టు లక్షణ సారమునుబట్టి నిరూపితము.

మఱి నన్నయభట్టు ఆంధ్రశబ్దచింతామణి అని మరొక ప్రసిద్ధ గ్రంథము కలదు. ఇది ప్రథమతః ఎలకూచి బాలసరస్వతి తెలిపినది. తదుపరి కాకునూరి అప్పకవి వివరించినది. ఆమీద గాలి ఓబళయ్య ఉరపు ప్రభంజనము అహోబలపతి విశదీకరించినది. అయినను మఱి ఆంధ్రశబ్దచింతామణి ఆదికవి నన్నయభట్టు కృతము కాదని కందుకూరి వీరేశలింగముగారి సిద్ధాంతము.11 ఏమైనను సరే, ఆంధ్రశబ్దచింతామణి ఆదికవి నన్నయభట్టు కృతమే అని వక్కాణించిన సీతారామస్వామి శాస్త్రిగారి రాద్ధాంతము.12 తదుభయవాదముల తథ్యమిథ్యా వివేచనమున ఆంధ్రశబ్ద చింతామణి ఆదికవి నన్నయభట్టు కృతము కాదని అవగత మగును.13 అంతేకాదు. ఆదికవి నన్నయభట్టు భారతము నందు 'ధర్మువు' అను శబ్దము బహుధా ప్రయుక్తమైనది. అది ఆదికవి నన్నయభట్టు నాటి ఆంధ్రభాషకు ధ్వజస్తంభ ప్రాయమైన చిహ్నము. ఎనిమిదవశతాబ్ది గుణక విజయాదిత్యుని అద్దంకి శాసనము నందు, 'దమ్మువులు' అని కలదు.14 తొమ్మిదవ శతాబ్ది యుద్ధమల్లుని బెజవాడశాసనము నందు 'తనధమ్మున్ వొడుంబడి' అని కలదు.15 తొమ్మిదవ లేక పదవ శతాబ్ది కొరవి శాసనము నందు 'ధమ్మున్ వుఅ, ధమ్మున్ వుల' అని కలదు. 16 పదొకండవశతాబ్ది జుత్తిగశాసనము నందు 'ధమ్మున్వు' అని,17 దక్షారామశాసనము నందు 'ధమ్మున్వుగా' అని18 కలదు. ఇంకను పెక్కు ఇతర శాసనములందు ఇట్లు కలదు. మఱి పదొకండవ శతాబ్ది నన్నయ భారతము నందును ధర్మువు అను రూపము సర్వత్ర కలదు. ఒక ప్రయోగము –

> 'అవని యరాజకంబయిన యప్పుడ భూప్రజలందు సర్వధర్మువులుఁ దొలంగు దేవముని ముఖ్యులు వాయుదు రోలి వృష్టిలేదవు మఱి యఘువుల్ దఱుఁగునందురుగావునఁగాలయాపనం బవితథవాక్య చేయక నయంబున రాజ్యము నిల్పుమిత్తఱిన్'
>
> – 249 ప., 4 ఆ., ఆ. ప.

ఇందు 'ధర్మువు' ఇదమిత్థము. ప్రాస ఘటితము. కనుక నిర్ధారక ప్రయోగము. 'సర్వధర్మువులు' సమస్త రూపము. 'అఘువుల్' అనుచోట 'అగువుల్' అను పాఠాంతరము కలదు. అయినను మఱి 'అఘువు' నకు వికృతి. అంతేకాదు. స్థలాంతరములందు 'కర్మువు' అను శబ్దమును నన్నయభారతము నందు కలదు. కనుక అదంతములైన అమహన్నపుంసకములకు మువర్ణకము, గాక, అదంతములైన మహత్తులకు వలె ఉత్వము, ఉదంతములైన మహత్తులకువలె పువర్ణకము వచ్చుట ఎనిమిదవశతాబ్ది నుండి పదొకండవశతాబ్ది వఱకు ప్రచురముగ కలదు. అది తిక్కన భారతము నందు అరుదుగ కలదు. శ్రీనాథుని కృతులందు మిక్కిలి అరుదుగ కలదు. అట్టి రూపములను ప్రయోగించిన ఆదికవి నన్నయభట్టు ఆంధ్రశబ్దచింతామణిని రచించినచో, తద్రూపనిష్పాదక సూత్రమును రచించుట తథ్యము. అట్టి సూత్రము ఆంధ్రశబ్ద చింతామణి యందు లేదు. కనుక ఆంధ్రశబ్ద చింతామణి ఆదికవి నన్నయభట్టు కృతము కాదు. ఇది చారిత్రికాధారము. నిర్ధారక సాధనము. [స శే షం]

కొత్త దేవుళ్ళు

శ్రీ రావి రంగారావు

"అందని ఆకాశంలో
వ్యర్థంగా ఉన్నా మేమిటి ?
క్షణం మాత్రమే బతికి
చనిపోతున్నా మేమిటి ?"
అని చింతించి చింతించి
మెరుపులన్నీ కలిసి
తపస్సు చేశాయి
సృష్టికర్త గురించి

ఒక పూటైనా బతకాలని
తీపి గుర్తులు వెద చల్లాలని
సృష్టికర్త నడిగాయి మెరుపులు
తగిన జన్మ కావాలని,
ఆ తపస్సు ఫలించింది
అవనిమీద పువ్వులుగా
మెరుపు లవతరించాయి

కనులు తెరచి తెరవకనే కొందరు
మమ్మల్ని కత్తిరిస్తున్నా రేమిటి ?
ఒకపూట బతికి రేకుబట్ట కట్టినా
మరోపూటకే గాలి మృత్యువు
అదృశ్యపాశం వేసి
మమ్మల్ని లాక్కు పోతుందేమిటి ?
అని వగచి వగచి
పూవులన్నీ కలిసి
తపస్సు చేశాయి
సృష్టికర్త గురించి

గంభీరాకృతి కావాలని
సహస్ర నిశిత కరాలతో సాగాలని
సృష్టికర్త నడిగాయి పూలు
తగిన జన్మ కావాలని,
ఆ తపస్సు ఫలించింది
అందమైన దీపాలుగా
పూవు లవతరించాయి

పగలు సూర్యుడుండే సరికి
మా ప్రాణ వాయువు లూదేస్తున్నా రేమిటి ?
మా బ్రతుకులు దినం దినం
సగం చావు సగం బ్రతుకుతో సతమతమవుతున్నా యేమిటి ?

అని యేడ్చి యేడ్చి
దీపాలన్నీ కలిసి
తపస్సు చేశాయి
సృష్టికర్త గురించి

శాశ్వత జీవితం కావాలని
సమలోకం నిలపాలని
సృష్టికర్త నడిగాయి దీపాలు
తగిన జన్మ కావాలని,
ఆ తపస్సు ఫలించింది
గ్రంథాలయంలో పుస్తకాలుగా
దీపా లవతరించాయి

కాలం చాలా దొర్లిపోయింది
సృష్టికర్తకు గుండె జారిపోయింది
వెంట వెంటనే తనను గురించి
తపస్సు చేసే భక్తులు
తరతరాలు గడిచినా
తన ఊసే ఎత్తలేదేమిటని !

దేవుడే దిగి వచ్చాడు
భక్తుల్ని కలిశాడు

గ్రంథాల కెదురుగా నిలబడి
కడుదీనంగా అడిగాడు దేవుడు
'ఈ మధ్య మరీ బొత్తిగా
ఎందుకు తలవటమే మానేశా' రని,
పుస్తకాలు నోళ్ళు విప్పలేదు
దివ్యదృష్టితో తను గ్రహించక తప్పలేదు

పుస్తకాలు నిరంతరం
అనేకానేక రూపాలతో
ప్రజల గుండెల గుడులలోనే
నిలిచి పూజలందుకుంటున్నాయి

మరికొన్ని పుస్తకాల్ని
ఇప్పుడిప్పుడే ప్రజలు
గుండెల్లో నిలుపుకుంటున్నారు

గుండెల్లో కంపు పెంచుకొని
కుళ్ళిన కొన్ని పుస్తకాలు మాత్రమే
చెదల నోళ్ళ పాలయ్యాయి

ఒకనాటి తన ప్రియభక్తులు
ఈనాడు భూమిమీద దేవుళ్ళు
ఇలా భావిస్తున్న సృష్టికర్తకు
ఎదురుగా వచ్చాయి కొన్ని కొత్త పుస్తకాలు
వాతావరణానికి వెలవని
కొత్త అట్టలు తొడుక్కున్నాయి
అయనను చూసీ చూడనట్లుగానే
ఉచితాసనం మీద కూర్చొని
తల పక్కకు తిప్పుకున్నాయి

సృష్టికర్తకు సిగ్గేసి
ఎవరైనా చూస్తే పరువు తక్కువౌతుందని
కొత్త పాఠకుడిగా మారిపోయాడు
కొత్త పుస్తకాన్ని అందుకున్నాడు.

శ్రీ మాదిరాజు రంగారావు

అసమర్థుని జీవయాత్ర ప్రధానపాత్ర - మనస్తత్వ చిత్రణం

అసమర్థుని జీవయాత్ర, అసాధారణమైన మనస్తత్వ చిత్రణం గల వ్యక్తి ప్రధానమైన నవల. సీతారామారావు పాత్రను గోపీచంద్, కథాగమనానికి అవసరమైనమేరకు బాహ్యరూపానికి స్థానంకల్పిస్తూ, రచనమొత్తం మానసికమైన స్థితి సమర్పకంగా నిర్మించడంజరిగింది. ఒక జీవితంలోని అనేకసంఘటనల సంకలనం అనవచ్చు. ఇందులో క్రమ పరిణామంకన్నా స్థితి చిత్రణకే ఎక్కువ ప్రాముఖ్యం ఉంది. ఈ విధంగా సాధారణమైన నవల నుండి భేదిస్తుంది. ప్రధాన పాత్ర వెలుగులో తక్కిన పాత్రలు ప్రకాశిస్తాయి, దాన్ని అనుసరించి ప్రవర్తిస్తాయి. సీతారామారావు లోకం దృష్టిలో అసమర్థుడు. అతడుమాత్రం అంతరంగంలో తానొక విశిష్టమైన వ్యక్తిగా భావించే ఆలోచనాజీవి. పాత్ర అంతస్తత్వంతో రూపొందిన వ్యక్తిత్వానికీ, బయటి సమాజానికీ మధ్య జరిగిన సంఘర్షణ రూపమే ఈ రచన అనవచ్చు. సమాజంలో వివిధ వలయాల్లో దేనితోనూ సామరస్యం కుదరక, మానసికమైన వ్యథతో సాగిన జీవయాత్ర, ఇతని జీవితం. నవల పేరులో ఉన్న 'జీవ' శబ్దం, పాత్ర అంతరమైన మనో రూపాన్ని, ఆవిష్కరించేది. మనస్తత్వ పరమైన రచనాతత్త్వాన్ని సూచించేది. ఇందులో ఉద్రేకం, ఆందోళన, క్షోభ, ఆలోచన, బాధతో పాత్ర వెనక్కు తిరిగి చూడడానికి వీలులేని వేగాన్ని పొంది, విషాద పర్యవసానానికి దారితీయడం జరిగింది. దీనికి కారణం పాత్రను క్రమ్మిన నిరాశా వాతావరణమే. ఈ పాత్రలో సుఖం, శాంతీ కన్నా; బాధ, అలజడే ఎక్కువ. ఆరంభంలో తప్ప ఎక్కడా ఆశా ప్రసారం కన్పించదు. క్రియారూపం కన్నా ఆలోచనా ధోరణి ఎక్కువ. అదీ ఒక్కొక్కపుడు కాల్పనికతను, ఒక్కొక్కపుడు సమాజాన్ని విశ్లేషించే హేతురూపాన్నీ పొందింది. మరొకపుడు ఉద్రేక భరితమూ, వేదనా యుతమూ ఐంది.

మంచి స్థితిగతులు గల సంపన్నమైన కుటుంబ వాతావరణంలో పుట్టి పెరిగిన ఇతని జీవితం సుఖ రూపంతో మొదలై, విషాద మయంగా ముగిసింది. దీన్ని రచయిత ఆరంభంలో స్వచ్ఛమైన గిరి శిఖరం నుండి ప్రవహించే నది, చివరకు మురికి కాలవలో అంతమైనట్లుగా ప్రతీకాత్మకంగా సూచిస్తాడు. జీవితం, దౌర్భాగ్య మయంగా, అంతా అసహ్యపడే స్థితిలో, బీభత్స యుతంగా అంతమైంది. తండ్రి చనిపోయినప్పటి నుండీ, కాలం గడిచేకొద్దీ ఆదర్శరూపానికీ వాస్తవ రీతికీ మధ్య ఎంతగానో నలిగిపోయాడు. వివిధ సంఘటనల్లో దీని ప్రభావం అంటే మానసికమైన స్థితి - ఇతని చర్యలో ఒక్కొక్క విధంగా విపరీతమైన ప్రవర్తనగా వ్యక్తమౌతుంది. ఒకదాని తరువాత మరొక సంఘటన సంక్షుబ్ధ స్థితిని పెంచుతుంది. సంక్లిష్టతను ఎక్కువచేస్తూ పోతుంది. జీవితంలో అన్నిపార్శ్వాల్లోనూ, భర్తగా, తండ్రిగా, బంధువుగా, ఆఖరికి సామాన్య పౌరుడు, మానవుడుగా ప్రయోజన పరమైన పాత్రను నిర్వహించలేక పోవడం విశేషం. ఇతని అపజయాన్నే భావింపజేస్తుంది. తండ్రి మరణంతో బాధ్యత పైబడింది. లోకానుభవం, దీనికి సరిపడిన మనస్తత్వం లేకపోవడంవల్ల తృప్తికరంగా నిర్వహించలేక పోతాడు. దీనితోపాటు వంశగౌరవంపై మోజు, లోకం మెప్పుకోసం అభిలాష ఉండడం వల్ల లోకం ఇతణ్ణి బాగా వాడుకుంటుంది. ముఖ్యంగా మేనమామకు ఈ బలహీనత, ఎంతో ఉపయోగపడుతుంది. లోకంలో ఈ వైఫల్యం ఏకాకిని చేసి, ఏకాంత ధోరణికి దారి తీసింది. ఇతడు తన ప్రవర్తనను, హేతుబుద్ధిచేత సమర్థించుకో జూస్తాడు. ఇతనిలో మంచి లక్షణం వెలుగూ ఉంది. అది బయటపడి ప్రయోజన పరమైన ప్రశస్తినీ పొందలేదు. అతనికి చదువుఉంది. చురుకైన తెలివీఉంది. ప్రతి విషయాన్ని పరిశీలించి చూచే దృష్టి ఉంది. సంస్కరణ దృక్పథం, హృదయ వైశాల్యమూ ఉంది, ఆర్ద్ర గుణమూ లేక పోలేదు. ఇంకాఎన్ని మంచి లక్షణాలున్నా ఎందుకు పనికిరాకుండ

పోయాయి. చిత్రమేమంటే ఇందులో చీకటి వెలుగును అవహిస్తుంది. భార్య, పిల్లలు, బంధువులు, పరిచయస్థులు– ఇతరులుతో ఒక్కొక్కరితో ఒక్కొక్క వలయం నుండి, మరో వలయంలోకి క్రమిస్తూ జరిగిన సంఘర్షణలో, బాధకు గురి ఔతూ దూరం అవుతూ పోవడంతో ఈ చీకటి మరింత పెరుగుతూ,భౌతికంగా దగ్గర ఉన్నా వీరికి, మానసికంగా దూరం అవుతాడు. ఇతివృత్తంలో దీనికి సంబంధించిన అనేక సంఘటనలు ఒక్కొక్క పార్శ్వాన్ని చిత్రిస్తూ, ఈతని వైఫల్యాన్ని సంపూర్ణంగా చిత్రిస్తాయి.

2

సీతారామారావు పూర్తిగా లోక ప్రవృత్తి తెలీనివాడుకాదు. లక్ష్యం ఎరుగనివాడూకాదు. అతనికి అన్నీ "తెలుసు." గురుకులంలో తనతో పాటు చదివిన ఇందిరను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. కట్నాలు, కానుకలకూ విముఖుడు. సంస్కరణ దృష్టి కలవాడు. తాను స్వయంగా నిర్వహించే అవసరం లేని, తండ్రి మరణానికి పూర్వదశ వేరు, అంతా ఆదర్శమయమైంది. తాను స్వయంగా నిర్వహించే ఆవసరం కలిగిన దశలో, వాస్తవ జీవితం ఎదురైంది. ఆ జీవితానికీ, ఈ జీవితానికీ ఎంతో భేదం ఉంది. అతనిలో ఉన్న ఆర్ద్రత, క్రమంగా పరిస్థితుల వేడికి అదృశ్యమౌతూ వచ్చింది. చివరకు పరిశుష్కమై, రాను రాను కఠినమూ అయింది. తండ్రి చనిపోయాక, మొదట్లో మేనమామపట్ల భూమి విషయంలో చూపిన ఉదారభావం ఆత్మ తృప్తి కోసమా? లోకం కోసమా? అన్న ప్రశ్నకూ అవకాశం ఇవ్వకపోలేదు. ఈతడు మేనమామకు వ్రాసిన ఉత్తరం, అతడు దానికి వ్రాసిన సమాధానం – బట్టి ఈ అభిప్రాయం తలెత్తుతూంది. దీనికి కారణం ఒకటే – పరిస్థితులు మారడం. దీని ప్రభావంవల్ల చూచే దృష్టిలో మార్పు రావడం. మానవుని ఊహపై, ప్రవర్తనపై పరిస్థితులు ఏలా పనిచేస్తాయో తెలియజేస్తుంది.

సీతారామారావు ఉద్యోగంలో ప్రవేశిస్తాడు. ఉద్యోగం చేయడం వంశప్రతిష్ఠకు భంగకరం అన్న భావం ఇతనిలో మొదటి నుండి పనిచేస్తోంది. అయినా ఉద్యోగం చేయక తప్పింది కాదు. పైగా ఉద్యోగ నిర్వహణంలో క్రమశిక్షణమూ, పై అధికారుల స్వార్థప్రవృత్తినీ, ఈతనిలో నిబిడంగా ఉన్న స్వతంత్ర ప్రవృత్తి అంగీకరించ నీయదు. పైగా నిరాకరిస్తుంది కూడా. ఉద్యోగం మానేస్తే తన కాళ్ళపై నిలబడే ఆర్థికమైన స్తోమత ఇప్పుడు లేదు. అయినా తన మనస్సుకు నచ్చిన విధంగానే ప్రవర్తిస్తాడు. ఇంట్లో నిర్వ్యాపారంగా, ఉండిపోవడానికే సిద్ధమౌతాడు. అయితే గడవడమేలా? ఉన్నదంతా హరించుకొని పోయింది. దారిద్ర్యంలోనే స్వేచ్ఛను అనుభవిస్తూ, ఏవేవో ఆలోచనలతో పగటి కలలతో కాలక్షేపం చేయడమే ఈతని పని. లౌకికంగా నిర్వ్యాపారంగా ఉన్న ఈతని మనస్సు స్వల్పమైన విషయాల్లో ముఖ్యంగా, చిరాకు, కోపం, అసహనం, అనుమానం మొదలైన వికార రూపాన్ని పొందుతూ ఉంటుంది. ఇతడు కనే కలల్లో కన్పించేది. అన్నం – డబ్బు – ఈ రెండు భౌతికమైన అస్తిత్వానికి లోకంలో చాల అవసరమైనవి. ఇంకా ఇతని మనస్సు పొరలలో అణగి ఉన్న సాహసం, ధైర్యం, విజయం, శృంగారం సంఘటనలుగా కలలో కన్పించేవి. రచయిత మనస్తత్వపరంగా నెరవేరని కోరికలు గాఢమై, కలలో ఉద్గమించిన తీరు రచయిత శిల్పవంతంగా ఆవిష్కరిస్తాడు. ఈ విధంగా సీతారామారావు మానసికమైన తృప్తిని పొందుతాడు. సర్వమూ హేతుయుతంగా పరిశీలిస్తాడు. ఈ విధమైన ఆలోచనతో నిర్మితమైన ఆదర్శానికీ, నేలపై బ్రతుకులలో ఎదురయ్యే యథార్థావాతావానికీ సమన్వయం కుదుర్చుకునే లక్షణం లేకపోవడంతో, రెండిటికీ మధ్య నిలచిన ఇతణ్ణి ఒంటరితనం ఆవహిస్తుంది. ఎక్కడన్నా కలిసేస్థితి సమకూడితే, అది సంఘర్షణతో విడిపోవడం జరుగుతుంది. ఆదర్శ ప్రపంచం, జీవన యాథార్థ్యం, రెండిటికీ మధ్య పాత్ర ప్రవర్తించే మనస్తత్వ చిత్రణంతో రూపొందిన ఈ రచన, మనస్సులోని అంతర ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. ఇది ఒక్కొక్కపుడు చైతన్య స్రవంతి ధోరణిలోనూ ప్రవహిస్తుంది.

3

'హేతుదృష్టి గల మానవుడు సుఖంగా వున్నాడా?' అని బల్లిని ప్రశ్నిస్తాడు. తనకంటే అది సుఖంగా ఉందని పైకి భావిస్తాడు. హేతుదృష్టి కలిగి ఉండడంతోపాటు, మానవుడేదో లోపించి ఉన్న విషయమూ సూచితమౌతూంది. బల్లికీ మనిషికీ భేదం గుర్తించే జ్ఞానం అతనిలో ఉన్నా, ఆ సమయంలో అతడున్న క్లిష్టమైన స్థితి ఎదుటి మానవుడు లేదా ప్రాణి ఒక్కొక్కప్పుడు జడమూ, సుఖంగా ఉన్నట్లు భావింపజేస్తుంది. ఇది సహజం. ఇతర ప్రాణులకన్నా మానవుడు విశిష్టమైన అనేక భౌతిక మానసిక శక్తులు కలిగిన వాడు అందులో చదువూ, సంస్కారం, అన్నీ కలిగిఉన్న తనకూ బల్లికీ ఎక్కడో సామ్యమూ లేకపోలేదు. బల్లి గోడలు, దూలాలు పట్టుకొని తిరుగుతూంటే తాను ఇంటిని పట్టుకొని, బయటి ప్రపంచంతో పనిలేకుండా ఉన్నాడు. బల్లి ఏ ప్రయోజనాన్ని సాధిస్తుందో జీవించి తనూ అంతకన్నాఎక్కువ ప్రయోజనాన్ని సాధించడం లేదు. అతని మనసులో దీన్ని గురించిన ఆలోచనలో ఆవేదన ఉంది, పరిశీలనమూ ఉంది. జీవితం అంటే ఏమిటి? ఏమి

సాధించడానికి? అనే ప్రశ్నలకు సరియైన సమాధానం లభించలేదు. అన్నిప్రశ్నలే! సమాధానం దొరకదు. అతనిలో క్రియాత్మకంగా ఉద్యమించేలక్షణం లోపించడంతో అనుభవ ప్రసారంస్తబ్ధమైంది. కాబట్టి జీవితం గురించి తెలీదు. అతనిలో కలిగే సందేహం అనిశ్చయం, అధైర్యం, ఏకాంతంవల్ల ఏ సమస్యా పరిష్కృతం కావడంలేదు. తాను సుఖపడలేడు, ఇతరులకూ సుఖం ఇవ్వలేడు. తనకుటుంబ సభ్యులనూ తృప్తిపరచలేక పోయాడు. ఇతనిజీవితం నిష్ప్రయోజనం అవుతూంది. లౌకికజీవితంలో అవసరమైన డబ్బు, ఉద్యోగం, అధికారం, పలుకుబడి, వ్యాపృత్తి- ఏదీలేని జీవితంలో, మంచితనం, సంస్కారం, చదువు, ఆదర్శం - ఉపయోగించే నేర్పులేని వ్యక్తి-సీతారామారావు చుట్టూఉన్న ప్రపంచం-న్యూనతాభావాన్ని అధికంచేసేదే అయింది. ప్రపంచంలో బ్రతకడానికి డబ్బు అవసరం. దీనివిలువ అతనికి మొదట్లో తెలియలేదు. అదికాస్త తెలిసేవరకు మనస్సు ఈ వలయంనుండి అధిగమించింది. డబ్బు సంపాదించే మార్గాలు అతని పెంపకం వల్ల, మనస్తత్వం వల్ల ఆలోచించనూ లేకపోయాడు. న్యూనతాభావం వల్ల ఇతని మనస్సు పొరల్లో అణగి ఉన్న ధనాపేక్ష, క్రియా శూరత్వం మొదలైనవి. లోకంలో తాను సులభంగా పొందలేనివి, తనలో లేనివీ కోరికలుగా మిగిలిపోయి, చివరకు కలల రూపంలో అనుభవిస్తాడు. కాలం గడుస్తున్న కొద్దీ సంఘానికి దూరంగా ఏకాంతంగా, మానసికంగా ఆలోచనలు మరీ ఎక్కువౌతాయి. ఆందోళన, అశాంతి ఎక్కువైంది. సమాజంనుండి ఉపసంహృతుడై, వ్యక్తిగా విశిష్టుడనను కొనే అహంభావంతో - ఇతరులతో సంఘర్షణ మొదలైంది. ఇతని ప్రవృత్తి చాల చిత్రంగా కన్పిస్తుంది. డబ్బు చాల అవసరం. కాని డబ్బు అంటే నిర్లక్ష్యం. ప్రేమించే పెళ్ళి చేసుకున్నాడు. ఆ తరువాత తరువాత ఆమెను ద్వేషిస్తాడు. జీవితాన్ని ఆదర్శ శిఖరాల్లో ఊహిస్తాడు, కలలు గంటాడు, అన్నీ 'తెలుసు'ననే అనుకుంటాడు- తన మార్గం సరియైందనే అభిప్రాయంతో ఉంటాడు. చివరకు తన్ను తానే చంపుకునే స్థితికి వస్తాడు. ఇలా పరస్పరం వ్యతిరిక్తమైన ఆలోచనా ప్రసారం అతనిలో మనం గమనించవచ్చు. ఎక్కడ ఎవరికి లోకువైపోతానేమో అన్న భయంతో ఆధిక్యతను నిలుపుకునే ప్రయత్నం చేస్తాడు. ఎరకలదానితో తగాదాపడిన సందర్భంలో ఈ వైఖరి స్పష్టం. అంతలో త్వరపడతాడు. ఇంతలో ఆర్ద్రమనస్కుడౌతాడు. పశ్చాత్తాపం పొందాడు. విపరీతమైన ధోరణి అవలంబిస్తాడు. చిన్న పిల్లని కొట్టినపుడు, భార్యపై చెయ్యి చేసుకున్నపుడు ఇది మరీ శిఖరాలనందు కుంటుంది. అతని మనస్సును నీడ కమ్మేసింది. అక్కడక్కడా ఉన్న వెలుగు కాస్తా క్రమ క్రమంగా పూర్తిగా మాయమౌతుంది. వాస్తవ జీవితంలో క్లిష్ట పరిస్థితుల్లో, ఎదుర్కొనే వ్యక్తిత్వాన్ని కూడదీసుకొని ఉత్సాహంతో ఉపక్రమించనూ లేడు. ఈ ప్రయత్నం ఏమాత్రం జరిగినా ఇంత త్వరగా అతని సమాప్తి జరిగేది కాదు. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఏమాత్రమూ ప్రయత్నించక పోవడం ఇతనిలోపం తన సిద్ధాంతాలు అభిప్రాయాలనుండి ఏమాత్రం తొలగి పోరాదనే పట్టుదల ఎక్కువైంది. భౌతికంగా దారిద్ర్యంతో, మానసికంగా క్షోభతో క్రమంగా హృదయ సౌకుమార్యమూ నశించింది. పైగా కరకుదనం పొందింది. మొదట్లో వంశం పేరు ప్రతిష్ఠలకోసం తండ్రిని మించిన చేయని అనిపించుకోవడం కోసం పడిన ఆరాటం ఇప్పుడు చల్లారింది కాని స్ఫులింగం ఇంకాం లోపల మిగిలేఉంది. ఇది చివర శ్మశానంలో చనిపోయిన తల్లిని గురించి చేసిన

ఆలోచనలో గాని పూర్తిగా అంతరించలేదు. పాత్రలో చిట్ట చివర వచ్చిన హఠాత్ పరివర్తనం, పాత్ర చిత్రణలో కొంత మెరుపును తేజోవంతంగా తీరుస్తుంది. కథా గమనంలోనూ అనూహ్యమైన పరిణామంతో ప్రయోజన శీలాన్ని విస్తృతం చేస్తుంది. రచనా శిల్పం దృష్ట్యా కొత్త అభిలాషను కలిగిస్తూ వైవిధ్యాన్ని సంతరింప జేస్తుంది.

4

చిన్నప్పటి నుండీ పెరిగిన వాతావరణానికీ ఇప్పుడు బ్రతికే వాతావరణానికీ మధ్య ఎంతో అంతరం ఉంది. ఎంత స్వతంత్ర ప్రవృత్తి కలవాడైనా కనీసస్థాయిలో సమన్వయం కలిగి ఉండాలి. అలా జరగలేదు. కాలం గడచే కొద్దీ ఈ అంతరం పెరుగుతూ పోయింది. ఇక వెనక్కు రాలేని దశకు చేరుకుంది. మొదట్లో ఉదారుడుగా సంస్కర్తగా గుర్తించిన సంఘం, తరువాత తిరస్కరించింది. ఈ అంతరం, అఖాతమైంది. ఇతని కుటుంబం మొదలుకొని సమాజం వరకూ పర్యాప్తమైంది. ఒక సభలో ఇతని మాటలు విని జనం కొట్ట బోవడమూ జరిగింది. చివరకు పరిణత మతియైన రామయ్యతాతకూడ అసహ్యించుకునే స్థితికి వస్తాడు. అతని నిష్క్రమణకు అనివార్యమైన పరిస్థితులు ఆసన్న మౌతున్నాయన్నమాట. "ప్రపంచానుభవం తక్కువ, కొంచెం తెలిసి మెలగాలి" అని రామయ్యతాత బోధిస్తాడు. అతనికీ మాటనచ్చదు. "నేను తెలిసే చేస్తున్నా" నంటాడు. అతడొకవేళ అంగీకరిస్తే పాత్ర స్వరూపమే మారుతుంది. అలామారడం రచయిత ఉద్దేశంలోలేదు. ఈ పాత్ర "అన్నీ" తెలిసే చేస్తున్నట్లు ప్రవర్తించడంలోనే మనస్తత్వ పరమైన అంశం ఉంది. ఇతనిలో ఆర్ద్రత, సుకుమారమైన ప్రవృత్తితోపాటు విషయాన్ని చాల నిశితంగా పరిశీలించే లక్షణమూ ఉంది. మొదటిది అప్పుడప్పుడూ లోపించినా, శుష్కించినా, కరకు దేలినా చివరిది మాత్రం నైశిత్యాన్ని కోల్పోదు. పరిశీలనా గుణం తగ్గలేదు. ఇది ఇతనిలోని వెలుగుపార్శ్వానికి సంబంధించింది. మరో పార్శ్వం, ఇంతకు ముందు పేర్కొన్నట్లు వంశగౌరవం, అహంభావంతో పాటు భయం, అధైర్యం, మొదలుగా న్యూనతాభావంతో కూడిన మానసికమైన బలహీనతలతో ఏర్పడింది. నీడతో చీకటితో ప్రవృత్తమైంది. అతడు పరిస్థితులకు తట్టుకోలేక క్రుంగి పోవడం మొదలు పెట్టాక, తిరిగి తనలో ఉన్న శక్తిని సమీకరించి నిలిచే ప్రయత్నం చేయలేక పోవడం పాత్రలోని ప్రధానమైన అంతస్త్వం. దీన్ని మానసికమైన క్షోభ, ఉద్రేకం, ఆవేశం బాధతో నరాల బలహీనతవల్ల సిద్ధించిన అసమర్థతగా విశ్లేషించవచ్చు. మొదటి పార్శ్వాన్ని రెండో పార్శ్వం క్రమక్రమంగా క్రమ్మేసింది. అతనిలో ఉత్సాహం నశించింది. జీవితంపై ఆశ రాలిపోయింది. జీవించడం దుర్భరమైంది. దీనికి సంబంధించిన చర్యలు, ప్రతిచర్యలు అనేకం వివిధ సంఘటనల్లో స్ఫుటంగా చూడవచ్చు. ఈ తత్త్వం క్రమంగా అధికమై మనస్సు రాపిడితో అదుపు తప్పింది. ఈ పాత్ర చిత్రణలో ఈ అంశం మరీ ముఖ్యమైంది. "కళ్ళెం లేని గుర్రం" అయినాడు. అస్థిమితత్వానికీ చేరుకున్నాడు. ఈ దశలోనే అతడు బొమ్మలు వేయడం రాయడం మొదలుకొని అసంబద్ధంగా మాట్లాడడం, లోకదృష్టికి విపరీతంగా ప్రవర్తించడం, మనస్సులో మెదలింది అణచుకోకుండా, సంస్కరించకుండా, కత్తిరించకుండా ఎదురుబడి మాట్లాడటం అన్నీ జరిగాయి. ఈ స్థితివ్యక్తిలోని బలహీనతల్ని విజృంభింపజేసి, చిత్రవధచేసుకొని తన మరణానికి ప్రత్యక్షంగా తానే కారణభూతమైంది. ఈ విధంగా పాత్ర మనస్తత్వంపై ప్రధానమైన దృష్టితో, విపరీతమైన ధోరణికి నెట్టేసే పరిస్థితులచిత్రణం, రచయిత అవలంబించిన సంవిధానం చైతన్యస్రవంతికి చెందింది. ఇందులో అంతర విశ్లేషణమూ ఉంది.

5

రామయ్యతాత చదువుకోకపోయినా జీవితంలో తృప్తినీ, శాంతినీ పొందాడు. చదువు, సంస్కారమున్న ఈతనిలో అది లోపించింది. చదువు, సంస్కారం వల్ల ఇంకా ఇది అత్యుత్తమ స్థితిని పొందాలి. కాని అలా జరగలేదు. రామయ్యతాత తరం వేరు, ఈతని తరం వేరు. వారు పెరిగిన వాతావరణంలోనూ భేదముంది. జీవన స్థాయిలోనూ అంతరం ఉంది. ఇది ఇలాఉంచి, సర్వసామాన్యంగా అందరిలోనూ కనీసస్థాయిలో మౌలికమైన కొన్ని లక్షణాలుంటాయి. అందులో పేర్కొనదగింది మానవత. ఈ గుణమూ పోనుపోను విస్మృతం కావడం ఈ పాత్రలో మరోవిశేషం. ఇతనిలో లోపించిన లోకానుభవం, వివేకస్ఫూర్తి రామయ్యతాతలో పుష్కలంగా ఉన్నాయి. అతని సాఫల్యానికి ముఖ్యమైనవి. ఇతని మాట సీతారామారావుకు నచ్చలేదు. అతని హితవుముందు యథార్థం నిలవలేదు. దీనికి పోషకమైన మరోఅంశం ఉంది. నవల చివరలో ఇతడు

శ్మశాన భూమి చేరుకున్న సన్నివేశంలో ఉంది. ఇతనికి తల్లిలోని సహనం, వివేకం కన్నా తండ్రిలోని అహం, మొదలైనవి సంక్రమించాయి. శ్మశానంలో తండ్రి సమాధిపై మొలిచిన జిల్లేడు చెట్టు, బూడిద ఐన తండ్రి భౌతిక రూపం ఎరువుగా బలిసింది. జిల్లేడుచెట్టు తండ్రి మనస్తత్వానికి ప్రతీక. ఇది ఎవరికీ ఉపయోగంలేనిదీ, అందరూ దూషించేదీ. ఒక్కమారు ఇతనిమనస్సులో గతం పరిశీలనారూపంలో పరివర్తిత మౌతుంది. ఈ పరివర్తనంలో, తల్లి మనస్తత్వం అభినందనీయంగా, ఆదర్శమయంగా ఇతనిలో అవిష్కృతం కావడం జరిగింది. తల్లి పట్ల సౌముఖ్యం, తండ్రిపట్ల వైముఖ్యం ఏర్పడింది. ఇది ఈ నవల్లో చాల ముఖ్యమైన అంశం. భౌతికంగా అతడు మృత్యు సన్నిహితుడైనా, మానసికంగా కొత్త రూపంలో సీతారామారావు పాత్ర ఇది వరకు లేని వెలుగుతో స్పందిస్తుంది.

నవల మొత్తం మీద, ఆత్మన్యూనతాభావం, భయభావం, ఆందోళనాస్వభావంవల్ల, ఏ ఆదర్శాన్నీ అఖరికి సాధారణజీవితాన్నీ ఫలవంతం చేసుకోలేని క్రియాశూన్యుడు, ఆలోచనా జీవిగా ఈ పాత్ర నిర్మితమైంది. నిరాశోప హతుడూ వివేక రహితుడూ, ఐన అసమర్థునికి ప్రపంచంలో స్థానం లేదన్న విషయమూ స్థాపితమైంది. చిట్ట చివర అతనిలో అంకురించిన కొత్త రూపం, పూర్వ రూపం నశించిన మృత్యు భూమినుండి ఉదయించింది. రచయిత ఉద్దేశంలో సూచితమైన జీవన రూపం.

సభిక సూక్తము

(ఋగ్వేదము X - 34)

శ్రీ కె. నాగేశ్వరశాస్త్రి

ఉన్నత తరు శాఖాగ్ర భాగోదయంబు
వాయు కంపన నిత్యసం వలన శీల
మక్ష ఫలకంబు నెక్కి నా మదిని దోచి
దొరలు చుండు నానంద సందోహ మొసగి

మూజ వద్గిరి వనులందు మునులు సోమ
లతల లాగురీతిని సమూలంబుగాగ
ఈడ్చు చుండె [1]విభీతక మిట్లు నన్ను
మదికి మిఱుమిట్లు గొల్పుచు మట్టి గఱపి

ఆమె యేమనదు దురాగ్రహంబు నూని
మృదు దయాశీల నాకు నామిత్రులకును
ఒక్కగా నొక్క యక్షంబు నూహసేసి
తరిమి వైచితి నర్ధాంగి దయను వీడి

అత్త ద్వేషించు, నాభార్య యడలుకొంచు
గెంటివైచు, నీదురవస్థ కితవు నెవడు
దయగనగరాడు వృద్ధ సైంధవము నమ్మ
దలచు చందాన కితవుని దలచు నెవడు?

జూదమున నోడి సర్వంబు సోలునెవడు
వాని యువిద పరజనుల వక్షమందు
జిక్కు; పితరులన్నలును వచింతు రెపుడు
పట్టికొని పొండు ఎరుగమా భ్రష్టుననుచు

ఒక్కపరి దలంతు నిక పో నొల్లనంచు
వారు నన్విడిచి వెడల పాచికలవి
మధుర రవళుల గళమెత్తె మహిని పడుచు
పరుగు పరుగున చనుచుంటి; వారకాంత
యలరి సంకేత భూమికై అరుగు నటుల

ద్యూతశాలకు నేగి నే నూహసేతు
తనువు కంపింప గెల్తునో యనుచు మిగుల
పాచికలు జారి వ్యతిరేక పక్షమనగ
అశలివురంగ ఖిన్నత నవని పడుదు

ఇవియ కొక్కెముల్ వంచక ప్రవరు లివియె
పదను మీరి నన్ మండించు; బాల భావ
మేర్పడగ బహూకృతులిచ్చి ఎగసి లాగు
మాయపుందేనె తీపుల మదిని దోచు.

సత్యధర్మాల యాకృతి సవిత మాడ్కి
నూటయేబది రీతుల నొక్కియాడు
ఉగ్రకోపనుడైన తానోడకుండు
పార్థివుండైన వీనికై వంచు శిరము.

వ్రాలి దొరలును క్రిందికి, పైకి నెగయు
హస్త హీనయై తాగెల్చు హస్త యుతుల
దివ్య భాస్వదంగారమై తేజరిల్లి
అక్ష ఫలకాన వ్రాలుచు నతుల రీతి
చల్లగా కాల్చు గుండెల కల్లగాదు.

కితవుదయిత విస్మృతమూర్తి ఖిన్నయయ్యె;
కొమరుడెటకేగెనోయంచు గొంకులేక
ఇల్లిలు వెదకి జనని చరించు చుండె;
అప్పువడి భీతి జేరె ధనాశతోడ
పరుల కొంపల కితవుడా చరమ రాత్రి

ఒరుల భార్యల సుకృతంపు టొప్పుజూచి
తీర్చు గృహ సీమల సొగసు తీరుచూచి
భగ్గుమనె గుండె; తాను ప్రభాత వేళ
పూన్చు [2]బభ్రువర్ణాశ్వముల్; పొగులు మిగుల

సంజయగ్ని చెంత బడుచు స్వంబువోవ
నీ బృహద్గణ సేనాని; నిల్చె నెవడు
మొదటి యతిథిగ భూపాల ముఖ్యుడౌచు
వానికై మోడ్తు పదివేళ్లు; వాస్తవముగ
పణము కోల్పడి తినటంచు పల్కుచుందు

పాచికలయాట వలదోయి; పదిలముగను
సల్పుకృషి, విత్తార్జన జరిపి సుఖము
ననుభవింపుము, కొనియాడుమయ్య సిరుల
పశువు లర్ధాంగి సవితయు పరగు కితవ!
అదియ నాకు సచ్ఛ్రేయమటంచు దోచు

మైత్రి సల్పుము; దయతోడ మమ్ము చూడు
మింద్రజాలాన బంధింప కెలమి గనుము
నీదు రోషంబు శమియించు నీదు శత్రు
వర్గమెల్ల దొలగి శాంతి వరలు కితవ
బభ్రువుల జిక్కి మరొకండు వగచు గాక!

1. తాండ్రి చెట్టు. దీని కాయలు పాచికలుగా వాడబడేవి.
2. గోధుమరంగు పాచికలు

స్నేహం

శ్రీ దిలావర్

స్నేహం -
తేనె మనసుల్లో వెలసే నాకం!

మానవతా ధరణి జాతకు
ఆశ్రయ మిచ్చిన 'అశోకం !'

యీ నాకాన్ని నరక కూపంలో ముంచకు.
వినిర్మల హృదయ కాసారంలో
శంకా శైవలం పెంచకు.

చెలిమి కంబానికి పాకే
మెత్తని ఎద తీగను
ద్వేషమనే కొడవలితో తెంచకు,
మొగ్గను పురిటిలోనే తుంచకు.

ఆశయాల శిఖరం మీద వుదయించే
మైత్రీ సూర్యుడ్ని
స్వార్థం మేఘాలతో కప్పేయకు,
క్షణికోద్రేక తురంగాల బంధాలను విప్పేయకు.

త్యాగమనే వులులతో
సంకుచితత్వ పరస్థలాలు తొలగించి
హృదయాన్ని దివ్య సుందర స్నేహశిల్పంగా
మలుద్దాం !
మానవతా సంకేత కేతనమై నిలుద్దాం !

స్నేహం -
జీవిత కురుక్షేత్ర రణ రంగంలో 'విజయ' రథ
సారధి !
బాధా సంతప్త హృదయాగాథాలకు వారధి !

స్నేహం -
మంజుల మానస వీణా నిస్వనం !
మధుర హృదయాల సమైక్య వేదనం !

స్నేహం -
వేదనా గ్రీష్మంలో ఆశలు ఎండినపుడు
బ్రతుకు చైత్రంలో చిగురించే వసంతం !
మమతానురాగాల పక్షాలు విప్పుకొని
జీవితాకాశంలో విహరించే శకుంతం !

స్నేహం -
క్రౌంచ ద్వంద్వ వియోగోత్థ వాల్మీకి శ్లోకం !
గుండెల గూటిలో వెలిగే మమతా దీపం !
కృష్ణుడ్ని కుచేలుడ్ని కలిపే సమతారూపం !
శిశు నిర్మలాంతరంగ స్వరూపం !

స్నేహం -
అజేయం !
అజరామరం !!!

[స్నే హా ని కి ని ర్వ చ న మ యి న మా తి రు న గ రి కి....]


డా॥ ఘంటా జవహర్‌లాల్

సంగమయ్యకొండలో జైన గుహ

ప్రస్తుతం సంగమయ్య కొండ శ్రీకాకుళం జిల్లా, ఆముదాలవలస పట్టణమునకు 8 కి. మీ. దూరంలో హీరమండలము పోవు మార్గములో జి. కొల్లి వలస గ్రామమునకు దాపున వున్నది. ఈ కొండ పవిత్రమైన శైవక్షేత్రముగా నేటికీ పరిగణింపబడుచున్నది. శ్రీకాకుళం జిల్లాలో ఎవరిని అడిగినా 'సంగమయ్య కొండ' వునికి మనకు తెలియజేస్తారు. అనగా జిల్లాలో ఈ క్షేత్ర పేరు ప్రఖ్యాతులు ఎంతటివో మనం గ్రహించాలి.


పై సంగమయ్య కొండలో జైనగుహ (చిత్రము-1) నాచే 1982, జూలై మాసంలో కనుగొనబడినది. ఈ విషయం 1982, జూలై 21, 22, తేదీలలోని అన్ని ఆంగ్లాంధ్ర దినపత్రికలు విస్తృతంగా ప్రకటించి వున్నవి. కాని పూర్తి వివరాలతోను, చిత్రములతోను ప్రకటించుట ఇదే ప్రథమం జైనగుహను కనుగొనుట యాదృచ్ఛికంగా జరిగింది. నేను ముఖలింగంలో పనిచేసినప్పుడు నాదృష్టికి సంగమయ్య కొండను అప్పటి భారత ప్రభుత్వ పురావస్తు శాఖ అటెండరు తీసుకువచ్చాడు. సంగమయ్య కొండపై బౌద్ధ, శివమూర్తులు గూడా వున్నవని తెల్పెను. ఈ విషయం నా ముందు ఆఫీసర్లకు (వారిపేర్లు అనవసరం) తెలిపినా వారు సక్రమంగా పరిశోధించలేదని గూడా తెల్పెను. బౌద్ధ, శైవమూర్తులు ఒకచోట వుండుట అంటే అవి బౌద్ధ మూర్తులు కంటె జైన విగ్రహాలు కావచ్చునని వూహించి, నా బస ముఖలింగం నుండి నేరుగా ఆముదాల వలసకు మార్చితిని. సంగమయ్య కొండ ఎక్కి పరిశోధించగా నా వూహ నిజమైంది. అవి జైన విగ్రహాలే. నా ఆనందానికి అవధులు లేవు. ఇక పరిశోధనలో వెల్లడైన విషయములు, సంగమయ్య కొండ విషయం చూద్దాం.

పైన చెప్పినట్లు జి. కొల్లి వలసకు ఒక కిలోమీటరు దూరంలో సంగమయ్య కొండ గలదు. కొండకు సుమారు 80 మెట్లు గలవు. అది సాక్షాత్తూ శ్రీ సంగమేశ్వరస్వామి నిలయంగా, పవిత్ర శైవ క్షేత్రంగా చుట్టు ప్రక్కల గ్రామాలకే గాక, జిల్లా



1. క్రిందనుండి సంగమయ్య కొండ

లోని పుణ్యక్షేత్రాలలో నొకటిగా ఖ్యాతిగాంచి వున్నది. 80 మెట్లు దాటి పైకి చేరిన వెంటనే మనకు గుహ ముఖము (శిఖరంగా మలచుట) గోచరిస్తుంది (చిత్రము-2). ముఖద్వారం వద్ద నంది



2. గుహ ముఖ భాగము

విగ్రహం (చిత్రము-3), శివలింగము గూడా కనిపిస్తవి. అచ్చటనే 4, 5 గజముల దూరంలో రెండు జైన విగ్రహా లున్నవి. అందు ఒకటి అసంపూర్తిగాను, మరియొకటి పూర్తిగా నయనానందకరంగా చెక్కబడి వుంది (చిత్రము-4). రెండు విగ్రహాలు 'సింహ' లాంఛనాలు కల్గి వుండుట[1] చే వాటిని 'మహావీరుని' ప్రతిమలుగా గుర్తించితిని.

సంగమేశ్వరాలయము నిజానికి ఆలయముగాదు. అది ఒక గుహ. గుహ ముఖద్వారం శిఖరంగా మలిచి, ముఖమండపం కట్టి శివలింగాన్ని, నంది విగ్రహాన్ని అందు ప్రతిష్టించిరి. ఇక ముఖద్వారం దాటి లోపలికి 10 గజములు వెడితే అచ్చట సుమారు $5\frac{1}{2}$ అడుగుల ఎత్తుగల 'జినతీర్థంకర' విగ్రహం మనకు కనిపిస్తుంది (చిత్రము-5). చక్కటి నునుపైన నల్లని రాతిలో ఈ విగ్రహం మలచబడింది. ఇది 'కాయచ్ఛర్గ'[2] భంగిమలో దిగంబరంగా వుంది. ఇంత ఎత్తుగల విగ్రహం ముందు చిన్న శివలింగము గూడా వుంది. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ పరుసటి రెండు దినాలు, శివరాత్రి యీ ఆలయానికి పర్వదినాలు. అప్పుడు పెక్కుమంది వచ్చి సంగమేశ్వరునికి పూజలు, ముడుపులు, సమర్పిస్తూ వుంటారు. నేటికీ నిత్యమూ పూజ జరుగుచున్నది. సహజంగా మనం సంగమేశ్వరాలయాలను రెండు నదుల సంగమము దగ్గర చూస్తూ వుంటాము. ఇచ్చట అటువంటి సంగమము లేదు. అయినా సంగమయ్య కొండ సంగమేశ్వరాలయముగా నేటికీ ఖ్యాతిగాంచి వున్నది.

ఇక జైనగుహ కల్గివున్న కొండ సంగమేశ్వరాలయముగా మార్పు ఎప్పుడు ఎలా చెందివుండునో పరిశీలిద్దాం. జైన మతం ఉత్తర సర్కారు జిల్లాలలో క్రీ. శ. 12వ శతాబ్దములో వేంగీ చాళుక్యుల కాలమున తూర్పుగాంగుల కాలమున వుచ్ఛస్థితిలో నున్నట్లు చారిత్రక శాసనాలు తెల్పుచున్నవి. వేంగీ చాళుక్యుల ప్రభువగు మూడవ విష్ణువర్ధనుని కాలంలో జైన గురువగు సిద్ధాంతదేవుడు విజయనగరం పట్టణానికి దాపునగల రామతీర్థమును సందర్శించినట్లు అచ్చటనే లభ్యమైన జైనశాసనము వలన తెలియుచున్నది.[3] ఈ జైన సిద్ధాంతదేవుడు 'దేశీ' 'గణమునకుచెందిన వాడని, విమలాదిత్యునకు జిన గురువని గూడా పై శాసనం పేర్కొనుచున్నది. విమలాదిత్యుడు 12వ శతాబ్దమువాడు. అయిన, క్రీ. శ. 12 వ శతాబ్దములో రామ తీర్థము జైన క్షేత్రముగా ప్రఖ్యాతిగాంచి వుండును. అట్లే విజయనగరం జిల్లా



3. గుహ ముఖద్వారము వద్ద నంది విగ్రహము

లోని భోగాపురంలో దొరికిన జిన శాసనము బట్టి, క్రీ. శ. 1178 లో కన్నప నాయకుడను వర్తకుడు, తూర్పుగాంగుల ప్రభువగు అనంతవర్మదేవుని కాలమున రాజరాజ జినాలయమును భోగాపురంలో కట్టించినట్లు బోధపడుచున్నది.[4] పై శాసనముల బట్టి జైన మతము శ్రీకాకుళం ప్రక్కన వున్న విజయనగరం జిల్లాలో 12వ శతాబ్దములో పుష్పస్థితిలో నున్నట్లు బోధపడుచున్నది. శ్రీకాకుళం జిల్లాలో గల సింగుపురం, పొత్తంగి ప్రదేశాలలో నేటికీ మనకు జైన విగ్రహాలు కనపడుచున్నవి. ఈ శిథిలావశేషములను బట్టి శ్రీకాకుళం జిల్లా గూడా జైన మతానికి కేంద్రమై ఉండవచ్చును. సింగుపురం, పొత్తంగిలో గల జినావశేషములు పరిశీలించగా అవిగూడా 12 వ శతాబ్దం కాలము నాటివని తెలియుచున్నవి. ఆ ప్రాంతములో ప్రస్తుత సంగమయ్యకొండ గూడా జైన క్షేత్రముగా ప్రఖ్యాతిగాంచి వుండవచ్చును. సహజంగా జనులు జిన క్షేత్రాలలోనే తీర్థాంకరు (జినదేవుళ్ళ) లను ప్రతిష్ఠింతురు. ఇచ్చట నున్న నిలువెత్తు తీర్థంకర విగ్రహమును బట్టి సంగమయ్య కొండను ఒకనాటి జినక్షేత్రంగా గుర్తించుట అనౌచిత్యం గానేరదు.



4. సంపూర్ణంగా శిల్పించబడ్డ మహావీర విగ్రహము



5. గుహ లోపల నిలువెత్తు జైన తీర్థంకరుని విగ్రహము
(శివలింగమును కూడా చూడవచ్చు)

ఆఖరుగా, సంగమయ్య కొండ జినక్షేత్రమైతే నచ్చట శివలింగము, నంది విగ్రహాలుండుటకు గల కారణాలు తెలుసుకొందాము. సాహిత్య, చారిత్రికాధారాలు మూలంగా జైనమతము మన రాష్ట్రములో 12వ శతాబ్దము వరకు పుష్పస్థితిలో నున్ననూ దీనిపై వ్యతిరేకభావము 7, 8 శతాబ్దముల నుండి వ్యక్తమైనట్లు తెలియుచున్నది. ఈ విషయము కేతన, దశకుమార చరిత్రము[5], మారన 'కేయూరబాహు చరిత్రము[6]' చదివిన బోధపడును. జైన మతముపై వ్యతిరేకభావము ప్రజలలో కల్గుటచే ప్రఖ్యాత పంప కవి యొక్క తండ్రి భీమన కర్ణరాష్ట్రము వీడవలసి వచ్చినదని ప్రఖ్యాత చారిత్రిక వేత్త డా॥ నేలటూరి వెంకట రమణయ్యగారు తెల్పిరి.[7] జైన చరిత్ర పరికించిన మనకు శైవులు జైన మత ధ్వంసానికి మూలకారకులని బోధపడుతుంది. ముఖ్యంగా వీర శైవులు జైన మునులను బహిరంగంగా వధించినట్లు శైవ సాహిత్యము, శిలాశాసనాలు తెల్పుచున్నవి. త్రిలోచన పల్లవుడు[8] గుంటూరు జిల్లాలో పెక్కు జైన మునులను వధించినట్లు ఒక శాసనము తెల్పుచున్నది. ఓరుగల్లు శాసనము వలన పెక్కు జినులు

రాజమండ్రి నుండి ప్రాణరక్షణార్థమై ఓరుగల్లు చేరినట్లు తెల్పుచున్నది.[9] ఇక బసవపురాణము, పండితారాధ్య చరిత్రము చూచిన యిటువంటి సంఘటనలు మనకు కోకొల్లలుగా కనిపిస్తవి. 16వ శతాబ్దానికి చెందిన శిలాశాసనములో[10] శాంతన కుమారుడైన లింగన పెక్కు జినులను వధించినట్లు పేర్కొనబడింది. పై విషయాలు పరిశీలించిన మనరాష్ట్రములో 12వ శతాబ్దము దాటిన తదుపరి పూర్తిగా జైనమతము శైవమతస్తులచే నాశనము చేయబడినట్లు విదితమగుచున్నది. ఇక జినావశేషములు, జినాలయములు పరికించిన గూడా పై విషయము మనకు బోధపడగలదు. మొండెములేని జిన ప్రతిమలు మనకు మనరాష్ట్రములో పలుచోట్ల కనబడును. ఇక జినాలయములు శైవులాక్రమించి శివాలయములుగా మార్పులు చేసినట్లు చారిత్రికాధారములు రాయలసీమలో పెక్కుగలవు. ముఖ్యంగా రాయదుర్గంలోనున్న కోటలో 'రసశిద్దుల గుట్ట'పైనున్న జినాలయమును పూర్తిగా శివాలయముగా మార్చిరి. ఆ విషయమే మరల సంగమయ్య కొండ పరికించిన మనకు బోధపడగలదు. సంగమయ్య కొండ 12వ శతాబ్దము వఱకు జినక్షేత్రముగా నుండవచ్చును. ఆ తదుపరి జరిగిన మత కలహాలలో జైనమతము శైవులచే నాశనము చేయబడివుండును. తదుపరి సంగమయ్య కొండ శైవ క్షేత్రముగా శైవులచే 13, 14 శతాబ్దముల తదుపరి మార్పు చెంది వుండును. జినక్షేత్రములను శైవులాక్రమించిరనుటకు సంగమయ్య కొండ చక్కటి తార్కాణము. కావున రాష్ట్ర పురావస్తు శాఖవారు దీనిని సంరక్షించే బాధ్యత తీసుకొనుచున్నారు. ఇటువంటి విషయాలు పెక్కు పల్లెలలో మరుగున పడివుండును. వాటి వునికి పురావస్తు శాఖవారికి తెలుపు బాధ్యత మనపై వుంది.

వ్యాస రచనకు తోడ్పడిన గ్రంథాలు

1. ది జైన ఐకొనోగ్రఫీ ....పు. 64.
2. నిట్టనిలువుగా నిల్చుండి చేతులు క్రిందికి వుంచిన భంగిమ. జిన ప్రతిమలు రెండు భంగిమలలోనే (అనగా కాయచ్ఛర్గ, మరియు పద్మాసన భంగిమ.) చెక్కబడి వుండును.
3. స్టడీస్ ఇన్ సౌత్ ఇండియన్ జైనిజమ్, పార్టు. II, పు.20
4. నా సిద్ధాంతగ్రంథము (అముద్రితం), పు. 249
5. దశకుమార చరిత్రము, పార్టు I, పు. 59- 63.
6. కేయూరబాహు చరిత్రము, పార్టు II, ప. 102- 105
7. భారతి, 1967, మార్చి - పు. 171 మొదలు.
8. డా॥ నేలటూరి వెంకటరమణయ్య, త్రిలోచన పల్లవ మరియు కరికాల చోళ.
9. యల్. అర్.XI, పుటలు 113 మొదలు
10. ఎపిగ్రాఫియా ఇండికా, V, పుటలు 142 మొదలు.



రాజరాజు అభ్యర్థనము

శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి

తఱుకున బుట్టి యచ్చటనె ధర్మ విదుల్ నుతియింప జన్నముల్
బొనరిచి, మిమ్ము, మా కొలువు పూతము చేయగ నేను కోర, దా
నిని, మతినుంచి, నాయెడద నింపితి రీరలు మోదవార్ధి, యే
మని వచియింతు, నేరికిని నందని భాగ్యము నాకు నబ్బెగా !

2

గోదావరి మీరే, మఱి,
వేదత్రయి మీరు, సర్వవేత్తలు మీరే
భూదేవ వంశ సత్తమ !
నా దేవుడు, గురుడు, మీరె నన్నయ యజ్వా !

3

జనతతి కృష్ణద్వైపా
యనుడని మిమ్ముల నుతించి హారతులెత్తన్
వినియెద, కనగా కనగా
మనమున నట్టులనె తోచు, మఱి, లోకజ్ఞా !

4

తెనుగుం గన్నడ బాసలు న్నొకటిగా దీపించు వృంతమ్మునన్
గొనబై నిల్చిన రెండు మొగ్గలవి సోకుంజూపె, కర్ణాటమున్
ననయే, తెన్గుకు లేదు సాహితియు, విన్నాణంబునుం జూపి, మీ
యనుగుం బాసకు మొగ్గకున్ బరిమళం బందింపరాదో, గురూ !

5

సంస్కృతము ప్రాకృతంబయ్యె, సంస్కృతంపు
ప్రాకృతంపు వికారముం బఱగె తెనుగు
భాషయనగను - నీ దేశ భాష తెనుగు
కనగ చీకిరి బాకిరి గాగ నుండె.

6

శాసనమ్ములు నాదిని సంస్కృతములు
క్రమముగానయ్యె సంస్కృత ప్రాకృతముల
కాని, రేనాటి చోళులు పూని తెనుగు
నందె వ్రాసిరి 'కలమళ్ల' యందు, తొలిగ.

7

అందు ఛందంపు చాయలు నందు నందు
కానుపించును కాని, లెక్కకును రావు
రాను రానాంధ్రభాష కాలక్రమమున
తనదు నస్తిత్వమును నిల్పుకొనుచు నుండె.

8

వచన రచనమ్ము జేసెడి వఱకు వచ్చె
శాసనమ్ముల నొకనాటి సమయమందు
గుణగ విజయుని శాసనమ్మున గననగు
పద్యమది-తరువోజ ! సంబరము గొలుప !

9

పరిఢ విలు శాసనములు ధర్మవరమునందు
కందుకూరున గన్పడు నందు నందు
శాసనమ్ముల - బెజవాడ శాసనమున
నయిదు మధ్యాక్కఱలు గూడ నవతరించె

10

కానుపించును విరియాల కామసాని
సంతరించిన గూడూరి శాసనమున
మూడు చంపక మాలలు గూడ, రెండు
నుత్పలమ్ముల గూడుచు, నుల్లమలరు!

11

ఇమ్ముగ జూడ నీ వరుస, నెంతయు దోచును క్షైత దేశిమా
ర్గమ్ము నతిక్రమించి చనగా గమకించును మార్గగామియై

ఝుమ్మనిపాడు తేటివలె శ్రోతకు నింపులుగూర్చి, దేశదే
శమ్ముల సాగిపోయెడి ప్రశస్తి గడింపగ నాంధ్రజాతికిన్.

12

తొలుత 'వాతాపి' మొలచె మా కొలపు దుంప
తూర్పు చాళుక్యులనెడి నిస్తులపు కీర్తి
సేమముగ నుండె సాగర సీమ, నేను
వేగి దేశమ్ము నేలెడి విభుడనైతి.

13

ఆంధ్రుడను రాజు పేరిటి నాంధ్ర దేశ
మందు నుండిన తెనుగు నత్యాదరమున
వృద్ధి నొందింప కంకణ బద్ధుడైతి
పండితులు నైనవారి తోడ్పాటు వలయు

14


పదముల త్రోవలం గమిచి, పద్యపు బాటల సాగుతెన్ను నీ
యదనున కావ్యమొక్కటి, మహామహితాత్మ! రచింప
నొప్పదే!
ముదమును గూర్పుమా! మొదటి పొత్తము వ్రాయుక
పిట్టు మాసభా
సదనము నందు నుండెనను శాశ్వత కీర్తి చరిత్రకెక్కగన్

15

నాకుగా నొక్క కృతిని యొనర్తురేని
మీ యశము తోడ నిల్చును నాయశమ్ము
వసుధ పాలించు రాజు శాశ్వతుడు కాడు
సుకవి, తన కావ్యమున నిలుపకయె యున్న.

16

ఆంధ్రమున కాదికవి యనునట్టి యశము
మీకు దక్కగ, మీతోడ, నాకుదక్కు
తెనుగు కవితను పోషించు జనవిభుడను
యశము, నన్నయ భట్టారకా! నమోస్తు.



"మఱల మఱియొకసారి..."

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

అతడు బడి పంతులయ్యు సాహసము తోడ
పావుకేజి 'టమోట' రూపాయనిచ్చి
ఇంటికిని తెచ్చి గృహిణికి నిచ్చి రేపు
పప్పులో వైచి చక్కగా వండుమనియె !

అతడు బడిపంతులయ్యు కావ్యార్థ సరస
మధు రసాస్వాద జగతిని మాన్యతముడు !

రే పు,

శృంగార కావ్య పరిమళాను
భావుడై గదిలోన సంబరము నొందు
చుండగా,

గాధిసూనుని చూపునబడు
సత్తపోభంగకారి యప్సరస వోలె
అతని కావ్యాను శీలనానంద జనిత
మైన యుత్తమ స్థితికిఁ దా నడ్డమయ్యె

వంట యింట నిజ ధర్మపత్ని వండు
కమ్మతాలింపు ఘుమ ఘుమ గల 'టమోట
పప్పు' వాసన ఘ్రాణతర్పణము సేసి !!
పొత్తమటు బెట్టి తనయెద హత్తుకొనిన
పద్యమును పాడుచున్ లేచి వంట యింటి
లోని కేతెంచిగనె,

పనిలోన మునిగి
యున్న రమణిని—స్వేద బిందూదయమున
ఫాలభాగమ్ము ముత్యాల పట్టమట్లు
వెలుగుచుండెడి దాని-వివిక్త కేశ
బంధమైనట్టి దాని-తత్పాక కార్య
పరతఁగించి ద్విశీర్ణ మౌపయ్యెదగల
దాని-అలసాంగ భూత సౌందర్యముగల
దానిఁ - మెల్లగా జేరి తమినిఁ జొక్కి
కాంత నొక కొంత జబ్బుగాఁ గౌగలించె !!

ఆ హఠాత్
పరిరంభ కార్యంబు నందు
నామె బిత్తరియై, తరళాయతాక్షి
యై, ప్రణయ కోపరేఖా ముఖాంబుజ యయి
విక్లబాక్షర ప్రతిషేధ విధు ముఖియయి
నతని, వారించె—
బయటకు నంపెనతని!

వారి సరస శృంగార భావముల సాక్షి
యగు "టమోట పప్పు" నకు సిగ్గయ్యెనో-న
సూయఁగలెనో-యిర్వురఁ జూచి చితికి
ఎన్న లోలోన నుడికి పోయినది తాను!

నాటి భోజన వేళ 'టమోటపప్పు'
నతడు రుచిచూచె ప్రీతితో, నతుల విషమ
వేదనోద్భూత బంధ కవిత్వ కావ్య
బంధమున కట్టబడినట్లు బాధ నొందె!

చతురు దధులను నొక దివ్యశక్తి చేత
శోషణము చేసి తనుకొమ్ము! శేషమైన
లవణ మెంతుండు? నదియెల్ల లక్షణముగ
దిగినొ పప్పున యన్నట్లు తిరిగె రుచియు!
కారణమ్ము తాను గ్రహియించి కాంత, పిదప
అమిత పరిదీన వాక్సూచితాత్మయగుచు
నతని నోదార్చెనిట్లు — "నయ్యయ్యొ! అయ్యొ

నాదుమతి మండిపోను న్యాయముగను
తగులబెట్టితిఁ గూర సందడిని బడియు-
మఱచి యంతకుమున్ రెండు మారు లుప్పు
వైచితిని - తరువాత,
మీ బాహుబంధ
జనిత సుఖ మహానంద సంభ్రమమున
మఱల యొకసారి ...."

యతనికి మాటలేదు !!

డాక్టర్ ఆర్. ఎల్. ఎస్. శాస్త్రి

విజ్ఞానశాస్త్ర పురోగమనానికి అనువాదాల ఆవశ్యకత

వివిధ భాషలనుంచి అనువదించుకుని విజ్ఞాన సముపార్జన చేసుకోవడ మనేది ఈనాటి ఆచారంకాదు. ఎంతోకాలం నుంచి వస్తోంది. అయితే ప్రస్తుతకాలంలో దీని ప్రాముఖ్యం అంతకంతకు పెరుగుతోంది. సమాజం మొత్తంమీద పురోగమించడంతో పాటు అనువాదం అనివార్యం అయిపోయింది. జపాన్, రష్యా, చైనా, ఇంకా ఇతర అభివృద్ధి చెందిన దేశాల ప్రగతిలో శాస్త్ర, సాంకేతిక రచనల అనువాదం చాలాముఖ్యమైన పాత్ర వహించింది. భారతదేశంలోకూడా ఈ విశమైన అనువాదాల ప్రాముఖ్యాన్ని గుర్తించక పోలేదు. మనదేశంలో అనువాద కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలు రెండువందలకు పైనే ఉన్నాయనే సంగతి ఇందుకు నిదర్శనంగా పేర్కొనవచ్చు. అయితే అనువాద కార్యక్రమాల నిర్వహణ ఏమాత్రం సంతృప్తికరంగా లేదు. కొన్ని సంస్థలలో ప్రత్యేక అనువాద శాఖలున్నాయి. కాని కొన్నిసంస్థలు ఆర్థికకారణాలవల్ల సొంతఅనువాదకులను పూర్తి వేతనాలమీద నియమించుకోకుండా, అర్హతలేని. అనువాదదామీద ఆధారపడుతున్నారు. మనదేశంలో అనువాదకుల శిక్షణకు కావలసిన సౌకర్యాలు తగినంతగా లేవు. రష్యన్, జర్మన్, ఫ్రెంచ్ భాషలలో తగినంత పాండిత్యమున్నవారు అనేకమంది ఉన్నప్పటికీ వారికి అనువాద ప్రక్రియలో శిక్షణ లేకపోవడంవల్ల వారు సంతృప్తికరమైన అనువాదాలు చేయలేక పోతున్నారు. అది ఇలాఉండగా అరబిక్, పర్షియన్, పోలిష్, జెక్, స్వీడిష్, హంగేరియన్, రొమేనియన్, జపనీస్ వంటి అనేక విదేశీయ భాషల పరిజ్ఞానమున్నవారి కొరత తీవ్రంగాఉంది. అంతేకాకుండా మనదేశంలో ఇటీవల భారతీయ భాషల ప్రాముఖ్యం పెరుగుతోంది. దీనిదృష్ట్యా విదేశీయ భాషల నుంచి భారతీయ భాషలలోకి నరాసరి అనువదించగల సామర్థ్య మున్నవారుకూడా అవసరమవుతారు.

అనువాద కార్యక్రమాలలో ఆసక్తిగల సంస్థలు, సంఘాలు, గత రెండు దశాబ్దాలలో నిర్వహించిన సదస్సులలో, సమావేశాల్లో దేశంలో అనువాదాల అవసరాలను, అనువాదకుల శిక్షణను గురించి చర్చలు జరపడం జరిగింది. భారతీయ వైజ్ఞానికశాస్త్ర అనువాదకుల సంఘంవారి (ఇండియన్ సైంటిఫిక్ ట్రాన్స్‌లేటర్స్ అసోసియేషన్) పది సంవత్సరాల క్రితమే మనదేశంలో శాస్త్ర, సాంకేతిక అనువాదాలకు ఒక జాతీయసంస్థను నెలకొల్పాలని సూచన చేసినారు.

శాస్త్ర, సాంకేతిక అనువాదాల ప్రాముఖ్యాన్ని మనదేశంలో గుర్తించడం జరిగినప్పటికీ జాతీయస్థాయిలో అనువాద కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడానికి కావలసిన గణాంకాలను సేకరించడానికి ప్రయత్నమేదీ జరగలేదు అందువల్ల భారత ప్రభుత్వంలో శాస్త్ర, సాంకేతిక విభాగంవారు భారతశాస్త్ర అనువాదకుల సంఘంవారు సంయుక్తంగా ఇటీవల జాతీయస్థాయిలో ఒక సర్వే జరిపారు. ఈ సర్వే లక్ష్యాలు ఇవి: (1) శాస్త్ర, సాంకేతిక అనువాదాల ప్రస్తుత, భావి అవసరాలు, (2) అనువాదాలను ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి గల అవకాశాలు, (3) ప్రస్తుతం దేశంలోఉన్న అనువాద సామర్థ్యాలు, (4) అనువాదకుల శిక్షణాకార్యక్రమాలు - వీటిని అంచనావేయటం. ఇందుకుగాను ప్రత్యేకంగా అయిదురకాల ప్రశ్నావళిని తయారుచేసి వివిధ సంస్థలకు, కొంతమంది వ్యక్తులకు పంపారు. సంస్థలలో పేర్కొనవలసినవి ప్రభుత్వ శాఖలు, పబ్లిక్‌రంగ సంస్థలు, ప్రయివేటు పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు మొదలైనవి ఉన్నాయి.

అనువాద ప్రక్రియలో అనుభవం, ఆసక్తి, సామర్థ్యం ఉన్న వ్యక్తుల అర్హతలు, భాషలోను, శాస్త్రంలోను వారికున్న పరిజ్ఞానం, శిక్షణ, అనువాదంలో అనుభవం మొదలైన విషయాలను సేకరించడానికి ప్రత్యేకంగా ప్రశ్నావళిని రూపొందించి ఆయా వ్యక్తులకు పంపటం జరిగింది. ఈ ప్రశ్నావళు లన్నింటికీ ఆయా వ్యక్తులనుంచి, సంస్థలనుంచి సమాధానాలు వచ్చాక వాటన్ని

టినీ విశ్లేషించి, క్రోడీకరించి, కొన్ని నిర్ధారణలు చేసారు. వాటిని కింది విధంగా పేర్కొనవచ్చు.

1. విదేశీ భాషలలో ప్రచురితమవుతున్న శాస్త్ర, సాంకేతిక సాహిత్యాన్ని అనువదించవలసిన అవసరాన్ని శాస్త్రజ్ఞులు, సంస్థలు కూడా బాగా గుర్తించారు.

2. ముఖ్యంగా జర్మన్, రష్యన్, ఫ్రెంచ్, జపనీస్ భాషల నుంచి ఇంగ్లీష్ లోకి అనువదించడం అవశ్యకంగా కనిపించింది. అయితే అరబిక్ స్వీడిష్, స్పానిష్, ఇటాలియన్, పోలిష్, హంగేరియన్, డేనిష్, చైనీస్, నార్వీజియన్, జెక్, రొమేనియన్ డచ్, ఫినిష్, పోర్చుగీస్, బల్గేరియన్ భాషలనుంచి అనువదించ వలసిన అవసరం కూడా కొంతఉంది. విదేశీ భాషలనుంచి భారతీయ భాషలలోకి అనువదించ వలసిన అవసరం ప్రస్తుతం కొంచెం తక్కువగానే ఉందని చెప్పాలి. ఇంగ్లీషునుంచి అరబిక్, స్పానిష్, ఫ్రెంచ్, జర్మన్ భాషలలోకి అనువదించ వలసిన అవసరం కొంత కన్పిస్తోంది.

3. రాబోయే అయిదు సంవత్సరాలలో మనదేశ అనువాదా వసరాలు 50 % పెరిగే సూచనలున్నాయి.

4. ప్రస్తుత అనువాదావసరాలను తీర్చడానికి వివిధ సంస్థలు వివిధ మార్గాలను అవలంబిస్తున్నారు.చాలా ప్రభుత్వ శాఖలు, పబ్లిక్ రంగ సంస్థలు అనువాదకులను పూర్తి వేతనాలమీద నియ మించు కుంటున్నారు. కొన్ని సంస్థలు ఇండియన్ నేషనల్ సైంటిఫిక్ డాక్యు మెంటేషన్ సెంటర్ (ఇన్స్డాక్)వారి సేవలను వినియోగించు కుంటున్నారు.

5. సుమారు 50 శాతం సంస్థలు తమ అనువాద కార్యక్రమా లను నిర్వహించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అను వాదాలు చేయించుకోవడంలో జరిగే ఆలస్యాలవల్ల వారి కార్యక్రమాలు దెబ్బతింటున్నాయని 32.25 % సంస్థలు పేర్కొన్నాయి.

6. అనువాదానికి అయ్యే ఖర్చు గురించి అభిప్రాయ భేదా లున్నాయి. ఇన్స్డాక్ వారు చేసే రేట్లు చాలామందికి అమోద యోగ్యంగానే ఉన్నాయి. కాని కొంతమంది దృష్టిలో ఈ రేట్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. అయితే కొంతమంది నాణ్యమైన అనువాదాలు త్వరగా లభించే పక్షంలో ఇంకా ఎక్కువ వ్యయమైనా భరించడానికి సంసిద్ధత వ్యక్తం చేసారు.

7. శాస్త్ర, సాంకేతిక అనువాద కార్యక్రమాలు నిర్వహించ డానికి కేంద్రసంస్థ నొకదానిని నెలకొల్ప వలసిన అవశ్యకతను 80 శాతం సంస్థలు వ్యక్తంచేసారు.

8. రష్యన్, జర్మన్, ఫ్రెంచ్, జపనీస్ మొదలైన విదేశీ భాషలనుంచి ఇంగ్లీషులోకి చేసిన అనువాదాలను, భారతీయ భాషల నుంచి, ఇంగ్లీషునుంచి, విదేశీభాషలలోకి చేసిన అనువాదాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి.

9. రష్యన్ భాషలో తప్ప తక్కిన అన్నిభాషలలోను శాస్త్ర అనువాదాలు చేయగలవారి కొరత మనదేశంలో ఎక్కువగాఉంది. జపనీస్, ఇతర అరుదైన భాషలలో ఈకొరత ఇంకాతీవ్రంగా ఉంది.

10. తీరిక సమయంలో అనువాదాలు చేసేవారి సామర్థ్యాలు పూర్తిగా వినియోగించుకోవడం లేదు. పైగా వారికిచ్చే పారితోషికం కూడా చాల తక్కువగా ఉంది.

11. ఇప్పుడున్న అనువాదకులకొరతను తీర్చడానికి అనువాద శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థలు అభిప్రాయ పడినారు.

12. జాతీయ సాంకేతిక పదజాల బ్యాంకును నెలకొల్ప వలసిన అవశ్యకతను చాలామంది ఉద్ఘాటించారు. శాస్త్ర, సాంకేతిక అనువాదానికి కావలసిన నిఘంటువులను, పారిభాషిక పద కోశాలను సేకరించడం, ఇంకా నిఘంటువులలోను, పారిభాషిక పద కోశాల లోను చోటు చేసుకోని అధునాతన సాంకేతిక పదజాలాన్ని వివిధ భాషలలో సేకరించి, అందివ్వటం ఈ సంస్థ విధులుగా ఉంటాయి. ఇటువంటి కేంద్రాలు ప్రస్తుతం లక్సెంబర్, బెర్లిన్, మాస్కో, మాంట్రియల్ మొదలైన అనేక చోట్ల పనిచేస్తున్నాయి.

ఇంతవరకు చర్చించిన అంశాల దృష్ట్యా భారతదేశంలో శాస్త్ర, సాంకేతిక అనువాద కార్యక్రమాలను ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దడానికి కింది సిఫార్సులు చేసారు.

1. ప్రస్తుతం దేశంలో అనువాద కార్యక్రమాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్న దృష్ట్యా, శాస్త్ర అనువాద కార్యక్రమాలను రూపొందించి, నిర్వహించి, సమీకృతం చేయడానికి ఒక కేంద్రీయ సంస్థను నెలకొల్పడం అవసరం.

2. పైనపేర్కొన్న కేంద్రీయసంస్థలో విభాగంగా, విదేశీ భాషలలోని ప్రామాణిక వైజ్ఞానిక, సాంకేతిక గ్రంథాలను

ఇంగ్లీషులోకి భారతీయ భాషలలోకి అనువదించి, ప్రచురించి మన దేశంలోను, విదేశాలలోను, విక్రయించడానికి ఏర్పాట్లుచేయాలి.

3. అధునాతన వైజ్ఞానిక, సాంకేతిక పదాలను, వివిధ భాషలలో ప్రామాణీకరించినవాటి సమానార్థకాలను సేకరించి, వ్యాప్తి చేయడానికి ఒక జాతీయ సాంకేతిక పదజాల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఈ కేంద్రం వైజ్ఞానిక, సాంకేతిక ద్విభాషా నిఘంటువులను తయారుచేసి ప్రచురించాలి. ప్రపంచంలో వివిధప్రాంతాలలో అందుబాటులోఉన్న నిఘంటువులను, ఇతరపరికరాలను సేకరించాలి.

4. ముఖ్యమైన విదేశీభాషా పత్రికల నుంచి (వైజ్ఞానిక, సాంకేతిక) వ్యాసాలను ఎంపికచేసి వాటిని సంక్షిప్తరూపంలో ప్రచురించాలి.

5. మనదేశంలో బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, మద్రాసు, హైదరాబాదు, బెంగుళూరు, రాంచి వంటి ముఖ్య పారిశ్రామిక కేంద్రాలలో జర్మన్, ఫ్రెంచ్, జపనీస్, రష్యన్ భాషలలో వైజ్ఞానిక అనువాదాలకు శిక్షణకార్యక్రమాలను నిర్వహించాలి. అరుదైన ఇతరభాషల విషయంలో ఒకకేంద్ర ప్రదేశంలో శిక్షణ సౌకర్యాలను అభివృద్ధి చేయవచ్చు.

6. అనువాదకులుగా పనిచేస్తున్న వారిని కనీసం అయిదు సంవత్సరాలకొకసారి ఆయా భాషలు మాట్లాడే దేశాలకు పంపి శిక్షణపొందేటట్లు చేయాలి. ఇట్లా చేస్తే వారివారి అనువాద సామర్థ్యాలను, విధానాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకుందుకు వీలు కలుగుతుంది.

7. అనువాదకులకు చెల్లించే రేటును ప్రామాణీకరించడానికి ఒక సూత్రాన్ని రూపొందించాలి. ఇట్లా చేస్తే అటు అనువాదకులు, ఇటు అనువాదం చేయించుకునేవారు కూడా లాభం పొందుతారు.

8. వైజ్ఞానిక, సాంకేతిక అనువాదం, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యక్షంగా దోహదం చేస్తుంది. అందువల్ల ఇటువంటి అనువాదకులను ఆయాశాఖలలో ఉద్యోగులుగా స్వీకరించాలి.

అనువాదకుల శిక్షణ కార్యక్రమాలు

అనువాదకుల శిక్షణకు ప్రస్తుతం మనదేశంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను గురించి ఈ సర్వేలో బయటపడిన కొన్ని విషయాలు ప్రత్యేకించి ఈ సందర్భంలో వివరించడం అప్రస్తుతం కాకపోవచ్చు. కొన్ని విశ్వవిద్యాలయాలలో రష్యన్, జర్మన్, ఫ్రెంచ్, జపనీస్, అరబిక్ భాషలలో ఎమ్. ఎ. తరగతులు నిర్వహిస్తున్నారు. ఇవి కాకుండా కొన్ని సంస్థలలో డిప్లొమా కోర్సులు కూడానడుపుతున్నారు. జవహర్‌లాల్‌నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఎమ్. ఎ. తరగతిలో అనువాదం ఒక ప్రత్యేక అంశంగాఉంటుంది. బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సులో విదేశీ భాషలను నేర్పే కార్యక్రమంలో వైజ్ఞానిక సాంకేతిక అనువాదం కూడా ఒక భాగంగా ఉంటుంది.

హైదరాబాదులోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజస్‌లో అనువాదంలో పదినెలల డిప్లొమా కోర్సు ఒకటి నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఎమ్. ఎ. లోకూడా అనువాదం పాఠ్య ప్రణాళికలో భాగంగా ఉంది.

బరోడాలోని ఎమ్. ఎస్. యూనివర్సిటీలో జర్మన్ డిప్లొమా కోర్సులో అనువాదానికి మూడు పేపర్లున్నాయి.

ఇవికాక ఇంకా అనేక ఇతర విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు వివిధ విదేశీయ భాషలలో అనువాద శిక్షణ కార్యక్రమాలను ప్రవేశపెట్టాలని పథకాలు రూపొందిస్తున్నాయి. అయితే భారతీయ భాషలలో శాస్త్రీయ, సాంకేతిక అనువాదానికి, శిక్షణకి ఇంకా తగినన్ని సదుపాయాలు లేవనే చెప్పాలి.

ఆధార గ్రంథం: National Survey of Translation Needs of India. Published by Department of Science and Technology, National Information System for Science and Technology, Indian Scientfic Translators' Association, 1982.

అగ్నిపుత్రి

శ్రీ ఇంద్రగంటి భానుమూర్తి

ఆయమ్మ చిత్రకథ చెప్పేటి వేళా
అడవిలో వెన్నెల్లు అగ్గియై పోవూ-
అగ్గియై నిలువెల్ల బగ్గుమని పోవూ-

ఆమే, ఆమె చిత్రకథా ఎవరికి తెలును ?
విన్నవారికి కాదు; కళ్ళారా కన్నవారికి తెలును-

సూర్యసాక్షిగా చూసి చూసి
మూగైపోయిన మునిలి ఆకాశానికి తెలును-

ఆ పాద స్పర్శ కిప్పటికీ తియ్యగా చలిస్తూ,
ప్రవహిస్తూన్న గోదారి తల్లికి తెలును-

తన అణువణువూ మధుర మధురంగా చీల్చుకొంటూ మొల్చిన
ఆ పచ్చటి మరకత మొలకని గురించి,
తనలోనే లీనమైపోయిన
ఆ వెచ్చటి కన్నీటి కొమ్మని గురించి,
కన్నతల్లి భూదేవికి తెలును-

అప్పుడక్కడ స్తంభించిపోయిన గాలికీ,
అక్కడప్పుడు వేడెక్కిపోయిన వెలుగుకీ,
రాలిపోయిన పువ్వులికి తెలును-

◆ ◆

ఆ పసిడి పన్నీరుపువ్వు అధర దరస్మేర వీణ
ప్రియంగా అతడి కళ్ళల్లో
కాంతి సంగీతాల్ రచించినప్పుడే
అతడు పురుషుడయ్యేడు-
పురుషోత్తము డయ్యేడు-

అప్పుడే, విశ్వనాథుని విల్లూ విరిగిపోయింది-
సర్వ విశ్వతేజమూ వాని ముందొదిగి పోయింది-

ఆమె అతడికీ, అతడి యింటికీ వెలుగు తెచ్చింది-
ఆమె మా మహాలక్ష్మియని వీడు మెచ్చింది-

ఆమె అతడితో ఉన్నప్పుడు అడివికీ అందమొచ్చింది-
పక్షికీ పాట వొచ్చింది-
లేడికీ వన్నె వచ్చింది-
అరణ్యం వేదారణ్యమై పోయింది-
అడివి హరివిల్లై పోయింది-
హరి ఇల్లయి పోయింది-

ఆమె అతనితో లేనప్పుడు,
అతగాడి గుండెల్లోనే ఉన్నప్పుడు,
ఆమె ఇచ్ఛాదేవి,
ప్రతిభామతి,
క్రియాశక్తి, అయి
అతణ్ణి సాగరాలు దాటించింది-
అతనిచేత అద్భుతాలు చేయించింది-
అతని బాణానికి లక్ష్యం చూపించింది-
మహావీరు డనిపించింది-

◆ ◆

ఆమె ఒకరి పాలికి కాళి,
ఇంకొకరికి ఆలు, ప్రియురాలు,
కూతురు, కోడలు, వదిన, తల్లి-
అందరిలో అల్లుకుపోయే ఆనందవల్లి-

కాని, లోకం ముందు
ఆమెకే అగ్నిపరీక్ష, శీల శిక్ష-
అయితే ఆమె అగ్నిపుత్రి, విశ్వ సవిత్రి !
అన్నట్టు ఆమె పేరు సీత !
ఈ పృథ్విమీద ఎప్పటికీ చెరిగిపోని ఒక అమృతగీత !

శ్రీ ముదిగంటి సత్యనారాయణ రెడ్డి

భూ సంస్కరణలు దాని అమలుపై ఒక పరిశీలన

(గత సంచిక తరువాయి)

ఇతర సామాజిక, సాంఘిక, ఆర్థిక, రాజకీయ, ఆరోగ్య పూర్వ రంగములు :

సామాజిక - సాంఘిక పూర్వరంగము

ఒక గ్రామముయొక్క అభివృద్ధి ఆ గ్రామములో వాసిల్లు ప్రజలపై ఆధారపడియుండును. మరియు వారి వారి స్వాధీనములో నున్న భూములు మరియు వారు పండించే పంటలపైన ఉండునని చెప్పవచ్చును. కావున దీనికి పూర్వము రైతుల 'దుస్థితిని' క్షుణంగా అవగాహన చేసుకోవడానికి వారి సామాజిక సాంఘిక పూర్వరంగాన్ని ఈ అధ్యయనములో చర్చించడం జరిగింది.

ఒకవ్యక్తి సామాజిక, ఆర్థిక పూర్వ రంగము అతనికున్న విలువలను, ప్రవర్తనలను మరియు దుస్థితిని తెలుపుతుందనే ఉద్దేశ్యముతో ఈ విషయాలను పరిశీలించడము జరిగింది. అదే విధముగా ఒక వ్యక్తియొక్క దృక్పధము చాలవరకు అవ్యక్తి యొక్క పూర్వరంగముపై ఆధారపడి యుండును. ఎందుకనగా ఒకవ్యక్తియొక్క ఆలోచనా విధానము, విలువలు ఆ వ్యక్తియొక్క కులము, కుటుంబ వృత్తి, వయస్సు, విద్యాస్థాయి మరియు ఆయనకు ఆయా రంగాలలోనున్న అనుభవాలు మొదలైన పూర్వ రంగపు కారణాలపై ఆధారపడి యుండును.

పట్టిక - 1

సర్వేలో పాల్గొన్న గ్రామప్రజల వయస్సు వివరాలు :-

క్ర. సం.	వయస్సు వివరాలు సం॥	ప్రజల సంఖ్య	శాతము
1.	20 - 35	42	42%
2.	36 - 50	35	35%
3.	51 - 65	19	19%
4.	66 - ఆ పైన	4	4%

వీరిలో 20 - 35 సం॥ వయస్సుగల ప్రజలు 42 మంది (42%), 36 - 50 సం॥ వయస్సుగలవారు 35మంది (35%), 51-65 సం॥ వయస్సుగల వారు 19 మంది (19%) మరియు 66 ఆపైన సం॥ ల వయస్సుగలవారు నలుగురు [4%] వీరిలో అధిక శాతము యువకులు [42%] వృద్ధాప్యములో నున్నవారు నలుగురు [4%].

పట్టిక - 2

సర్వేలో పాల్గొన్న గ్రామ ప్రజల విద్య వివరాలు :-

క్రి. స.	విద్య వివరాలు సం॥	ప్రజల సంఖ్య	శాతము
1.	చదవడం, వ్రాయడం రాని వారు	70	70%
2.	ప్రైమరీస్కూలు విద్య(1-3 తరగతులు)	10	10%
3.	మాధ్యమిక స్థాయి విద్య (4-7 తరగతులు)	10	10%
4.	ఉన్నత పాఠశాల స్థాయి విద్య (8-10వ తరగతులు)	6	6%
5.	ఇంటర్మీడియట్ స్థాయి విద్య	4	4%
		110	100%

వీరిలో చదవడం, వ్రాయడం తెలియనివారు 70 మంది [70%], ప్రైమరీస్కూలు విద్య [1 - 3 తరగతులు] విద్య వరకు చదివిన వారి సంఖ్య 10 [10%] మాధ్యమిక స్కూలు [4 - 7 తరగతులు] విద్య వరకు చదివిన వారి సంఖ్య 10 [10%] ఉన్నత పాఠశాల విద్యను [8 - 10 వ, తరగతులు] అభ్యసించిన వారి సంఖ్య 6 [6%] మరియు ఇంటర్మీడియట్ [కళాశాల విద్య] స్థాయివరకు విద్యను అభ్యసించినవారు కేవలమునలుగురు. అయితే వీరిలో అధికశాతము ప్రజలు నిరక్షరాస్యులు [70%] ఇందులో అధికశాతము నిరక్షరాస్యులు గంటకు ఈసర్వేలో ఈ క్రింద నుదహరించబడిన కారణములు వెలికి వచ్చినవి.

1) ఆర్థికముగా లేకపోవడం వలన.

2) తల్లి దండ్రులు నిరక్షరాస్యులగుట వలన.

3) ఆ రోజుల్లో కనీసము ప్రైమరీ స్కూలు కూడా లేకపోవడం.

4) ప్రస్తుతము కూడా వయోజన విద్యా సౌకర్యాలు లేకపోవుట.

ఈ విధముగా అధిక శాతము ప్రజలు నిరక్షరాస్యులు అయినట్లు ఈ సర్వేలో వెల్లడి అయినది.

పట్టిక – 3

సర్వేలో పాల్గొన్న ప్రజల యొక్క భూమి వివరాలు:-

క్రి. సం.	భూమిని కల్గియున్న రేంజి/ అంతరము ఎకరాల్లో	ప్రజల సంఖ్య	శాతము
1.	భూమి లేనివారు	18	18%
2.	1 – 5 ఎకరాలు	78	78%
3.	6 – 20 ,,	4	4%
4.	21 – 35 ,, అ పైన	–	–
		100	100%

వీరిలో భూమిలేనివారు 18 మంది [18%], 1 – 5 ఎకరాల భూమి కల్గియున్నవారు 78 మంది [78%], 6 – 20 ఎకరాల భూమి ఉన్నవారు నలుగురు [4%] మరియు 21 ఎకరము నుండి అపైన భూమిని కల్గియున్నవారు ఏ ఒక్కరును లేరు. వీరిలో 18 మంది భూమిలేని వారిలో ఎక్కువ శాతము ఎస్.సి. లు మాత్రమే. 1 – 5 ఎకరాలు భూమి ఉన్నవారిలో వెనుకబడిన తరగతులవారు మరియు ఎస్.సి. లు ఉన్నారు. 6 – 20 ఎకరాల భూమినికల్గియున్న వారందరు అగ్రికులాలవారే.

పట్టిక – 4

సర్వేలో పాల్గొన్న ప్రజల కులము మరియు భూవివరాలు

క్ర. సం.	కులము	భూమి వివరాలు: భూమి లేనివారు	0.01 నుండి 1.00 ఎకరం	1—2 ఎకరాలు	2—5 ఎకరాలు	6—10 ఎకరాలు	11 అపైన ఎకరాలు	ప్రజల సంఖ్య	శాతము
1.	అగ్రికులాలు	–	3	3	4	1	2	13	13%
2.	వెనుకబడినతరగతులు	7	27	11	17	2	–	64	64%
3.	షెడ్యూల్డు కులాలు	12	7	4	–	–	–	23	23%
	టోటల్	19	37	18	21	3	2	100	100%

భూమి లేని వారైన 19 మందిలో వెనుకబడిన తరగతులకు చెందినవారు 7గురు [7%], షెడ్యూల్డు కులాలకు చెందినవారు 12 మంది [12%], ఒక గుంట భూమినుండి ఒక ఎకరము భూమి కల్గియున్న వారు 37 మంది. వీరిలో వెనుకబడిన తరగతులకు చెందినవారు 27 మంది [27%] మరియు షెడ్యూల్డు కులాల వారు 7 గురు [7%]. 1 ఎ. – 2ఎ. భూమి వరకు కల్గియున్న వారి సంఖ్య 18. వీరిలో 11 మంది వెనుకబడిన తరగతులకు చెందినవారు 4 గురు షెడ్యూల్డు కులాలవారై ఉన్నారు. 21 మంది 2 – 5 ఎకరాల భూమిని కల్గియున్నారు. అయితే వీరిలో నలుగురు అగ్రకులాలకు మరియు 17 మంది వెనుకబడిన తరగతులకు చెందినవారై యున్నారు. 6 – 10 ఎకరాల భూమి ఉన్నవారు ఈ సర్వేలో ముగ్గురు, అయితే వీరిలో ఒకరు అగ్రకులము వారు, మరిద్దరు వెనుకబడిన తరగతులకు చెందినవారు. ఈ పట్టికలో చూపించిన విధముగా షెడ్యూల్డు కులాలకు చెందినవారిలో ఏ ఒక్కరికి కూడా 2 – నుండి అపైన ఎకరాల భూమి లేదు. వీరిలో 11 ఎకరాలు అపైన భూమి ఉన్నవారు అగ్రకులాలవారే. మిగతా జాతుల వారు లేరు.

పట్టిక – 5

సర్వేలో పాల్గొన్న గ్రామప్రజలు కల్గియున్న పశువుల వివరాలు:-

క్రి సం.	పశువుల అంతర వివరాలు	ప్రజల సంఖ్య	శాతము
1.	పశువులు లేనివారు	33	33%
2.	1 – 5 పశువులు	48	48%
3.	6 – 15 ,,	12	12%
4.	16 – 30 ,,	6	6%
5.	31 – 45 ,,	1	1%
6.	46 – అ పైనపశువులు	–	–
	మొత్తం	100	100%

వీరిలో పశువులు లేనివారు 33 మంది (33%), 1-5 పశువులు కలవారు 48 మంది (48%), 6-15 పశుసంపద కలవారు 12 మంది (12%), 16-30 పశువులు కలవారు ఆరుగురు, 31-45 పశువులు కలవారు కేవలము ఒక్కరు మాత్రమే ఉన్నారు. పశువులు లేనివారైన 33 మందిలో ఎక్కువ శాతము మంది షెడ్యూల్డు కులాలకు చెందినవారై యున్నారని ఈ సర్వేలో తేలింది.

కుటుంబ వివరాలు

పట్టిక - 6

సర్వేలో పాల్గొన్న గ్రామ ప్రజల యొక్క కుటుంబ సభ్యుల వివరాలు:

క్ర. సం.	కుటుంబ సభ్యుల సంఖ్య		ప్రజల సంఖ్య	శాతము
1.	1 – 3	మంది	7	7%
2.	4 – 6	,,	64	64%
3.	7 – 10	,,	25	25%
4.	11 – 15	,,	3	3%
5.	16	,,	1	1%
			100	100%

వీరిలో 1 నుండి 3 గురు గల కుటుంబమును కల్గియున్న వారు 7 గురు [7%], 4-6 మంది సభ్యులున్న కుటుంబ భారమును మోయు గ్రామ ప్రజల సంఖ్య 64 మంది [64%], 7 నుండి 10 మంది సభ్యులున్న కుటుంబాలు 25 [25%], 11 నుండి 15 మంది కుటుంబ సభ్యులున్న కుటుంబాలు మూడు [3%] మరియు 16 మందికుటుంబ సభ్యుల్ని కల్గియున్న కుటుంబాలు ఒకటి మాత్రమే. ఇందులో 4-6 మందిని కల్గియున్న కుటుంబాలది అగ్రస్థానము [64%]మరియు రెండవ స్థానము 7 - 10 మంది కుటుంబ సభ్యులు కల్గిన కుటుంబాలకు చెందినది [25%].

ఈ కుటుంబ సభ్యుల సంఖ్య ఎక్కువగా యుండుట వలన వారి యొక్క పిల్లలకు విద్య, వైద్య ఆహార విషయాలలో మొదలగు వసతులు వారికి తమ తమ భూమినుండి వచ్చు ఆదాయములతో సమకూర్చలేక పోవుచున్నారు. ఎందుకనగా వారికి ఉండే భూమి పరిమితము మరియు ఉన్న భూమికి నీటి వసతి లేకపోవుట. భూసంస్కరణలు అమలు చేస్తే వీరి సమస్యలు కొంత మేరకు తీర్చవచ్చు. ఒకవేళ ప్రభుత్వము ఉచిత విద్యా భోజన వస్త్రముల వసతులను కల్పించినచో వారు వారి పిల్లలను చదివించగలమనే అభిప్రాయాన్ని ఈ పరిశోధనలో వెలిబుచ్చినారు.

పట్టిక - 7

సర్వేలో పాల్గొన్న గ్రామ ప్రజలకు ఉన్న పిల్లల వివరాలు:-

క్ర. సం.	పిల్లల సంఖ్య వివరాలు		ప్రజల సంఖ్య	శాతం
1.	పిల్లలు లేనివారు		4	4%
2.	ఒకరు పిల్లలున్న వారు		13	13%
3.	ఇద్దరు	,,	21	21%
4.	ముగ్గురు	,,	19	19%
5.	నల్గురు	,,	17	17%
6.	ఐదుగురు	,,	6	6%
7.	ఆరుగురు - ఆపైన పిల్లలున్నవారు		20	20%

వీరిలో 13% ప్రజలకు ఒకరు పిల్లలు (13 మంది) కల్గిన వారు, 4% పిల్లలు లేనివారు, 21% ఇద్దరు పిల్లలు కలవారు, 19% మందికి ముగ్గురు పిల్లలు, 17% ప్రజలకు నల్గురు పిల్లలు, 6% మంది 5 గురు పిల్లలు, 20% మందికి ఆరుగురు ఆపైన పిల్లలు కల్గియున్నారు. ఇందులో ఇద్దరు పిల్లలు కల్గియున్న వారిది అగ్రస్థానము. మరియు అధిక పిల్లలున్న వారి కుటుంబాలది ద్వితీయ స్థానము (20 మంది - 20%).

పై విధముగా పిల్లలు ఎక్కువగా కల్గి యుండుటకు కారణము కుటుంబ నియంత్రణ మార్గములను అవలంబించక పోవడమే అని సర్వేలో తేలినది. అయితే కుటుంబ నియంత్రణ చేయించుకొనుటకు ఎక్కువ శాతము వ్యవసాయదారులు మరియు వ్యవసాయ కార్మికులు సుముఖత తెలిపినట్లుగా లేదు. అందులకు కారణములను వారు ఈ క్రింద సువహరించిన కొన్నింటిని తెలిపినారు.

1) కుటుంబ నియంత్రణ చేయించుకున్న రోజులలో జీవన భృతి గడవడం కష్టమని [ప్రభుత్వం ఇచ్చే డబ్బు సరిపోదు].

2) భవిష్యత్‌లో బలమైన పని చేయలేమని.

3) ఈ కుటుంబ నియంత్రణ చేయించుకొనినచో అనారోగ్యము కల్గునని.

4) కొందరిలో మూఢనమ్మకాలతో [నారుపోసిన వాడు నీరు పోయక మానునా?].

5) కొందరిలో మొగ బిడ్డలు కల్గాలని మరియు వారే వంశోద్ధారకులని.

ఆర్థిక స్థితులను మెరుగు పరిచినచో వారు కుటుంబ నియంత్రణ చేయించు కొందురని ఈ సర్వేలో వెల్లడి చేసినారు.

పట్టిక – 8

సర్వేలో పాల్గొన్న గ్రామ ప్రజలకున్న పిల్లలవిద్య వివరాలు:–

క్ర.సంఖ్య	పిల్లల విద్య వివరాలు	ప్రజలసంఖ్య	శాతము
1.	చదవడం, వ్రాయడంరాని పిల్లలున్నవారు	83	83%
2.	ప్రైమరీ స్కూల్ విద్య	4	4%
3.	మాధ్యమిక స్కూల్ విద్య	2	2%
4.	మెట్రిక్ స్థాయివిద్య కల పిల్లలు ఉన్నవారు	6	6%
5.	ఇంటర్మీడియట్	4	4%
6.	గ్రాడ్యుయేటు కలపిల్లలు ఉన్నవారు	1	1%
		100	100%

వీరియొక్క పిల్లలలో 83 మంది పిల్లలకు చదవడం వ్రాయడం రానివారు, 4 గురు పిల్లలు ప్రైమరీ స్కూల్ విద్య వరకు చదివిన వారు, ఇద్దరు పిల్లలకు మాధ్యమిక స్కూల్ స్థాయి విద్య, 6 గురు పిల్లలకు మెట్రిక్ స్థాయి విద్య, నలుగురు పిల్లలకు ఇంటర్మీడియట్ స్థాయి విద్య మరియు ఒక్కరి పిల్లలకు గ్రాడ్యుయేషన్ స్థాయి విద్యను అభ్యసించే అవకాశాలు ఉన్నట్లుగా తెలియుచున్నది. దీనిని బట్టి అధిక శాతము ప్రజల పిల్లలు చదువురాని నిరక్షరాస్యత దేవతనే అరాధించుచున్నారని తెలియుచున్నది. వీరిలో అధికులు నిరక్షరాస్యులగుటకు కారణాలు వారికి తగు అవకాశాలు లేకపోవుట అనియు హైయ్యర్ ఎడ్యుకేషన్‌కు పోయిన వారు అగ్రికులాల వారే అని సర్వేలోతేలింది.

ఆర్థిక పూర్వ రంగము

1) వీరిలో 100 – 500 రూపాయల ఆదాయమును సంపాదించు వారు 6 గురు. ఇందులో అగ్రికులాల వారు ఎవరులేరు. కానీ షెడ్యూల్డు కులాలవారు 5 గురు ఉంటే ఒక్కరు వెనుకబడిన తరగతులకు చెందిన వారున్నారు. 2) ఈ గ్రామములో జరిగిన సర్వేలో 57 మంది 600 – 1000 రూపాయల వరకు ఆదాయాన్ని సంపాదించే వారైతే అందులో అధికశాతము [40 మంది] వెనుకబడిన కులాలకు చెందినవారే. ఈ ఆదాయ పరిమితిలో అగ్రికులాలవారు చాలతక్కువ అనగా కేవలము ముగ్గురు మాత్రమే. అయితే ఇదే ఆదాయ గ్రూప్‌లో 14 మంది షెడ్యూల్డు కులాలకు చెందినవారు. ఈ గ్రూప్‌లో అగ్రస్థానము వెనుకబడిన వారిదే. 3) 1100 – 1500 రూపాయల ఆదాయము సంపాదించు మొత్తము మంది 19. ఇందులో ముగ్గురు అగ్రికులాలవారు, 13 మంది వెనుకబడిన తరగతులవారు, మరి ముగ్గురు షెడ్యూల్డుకులాల వారైయున్నారు. వీరిలో ఎక్కువ శాతము వెనుకబడిన తరగతులవారే. 4) 1600–2000రూపాయలను ఆదాయాన్నిసంపాదించువారు15మంది అయితే 11మందివెనుకబడినతరగతులవారుముగ్గురుఅగ్రకులాలవారు మరియు షెడ్యూల్డు కులాలవారు ఒక్కరుగాయున్నారు. 5) 2000 3000 రూపాయల ఆదాయాన్ని సంపాదించువారు మొత్తములో ఒక్కరు ఉన్నారు. అయితే అతను అగ్రికులాలకు చెందినవాడే. అదే విధంగా 3600 – 4000 రూపాయల ఆదాయ గ్రూపులో కూడా ఇద్దరు ఉండి వారునూ అగ్రికులాలకు చెందినవారే.

దిగువ పట్టికను క్షుణ్ణంగా పరిశీలించినచో తెలియానది ఏమనగా ఆదాయ గ్రూపు పెరిగినకొలది వెనుకబడిన తరగతుల వారు మరియు షెడ్యూల్డు కులాలవారు తగ్గిపోవుచున్నట్లుగాను మరియు అగ్రికులాల వారిలో ఆర్థిక స్థోమత కొంత మెరుగుగానే యున్నట్లు విశదమగుచున్నది.

పట్టిక – 9

సర్వేలో పాల్గొన్న గ్రామ ప్రజల కులము – వారి ఆదాయ వివరాలు:

క్ర. సంఖ్య	కులము పేరు	ఆదాయ వివరాలు రూపాయలలో								మొత్తం సంఖ్య	శాతం
		100–500	600–1000	1100–1500	1600–2000	2100–2500	2600–3000	3100–3500	3600–4000		
1	2	3	4	5	6	7	8	9	10	11	12
1.	అగ్ర కులాలు	...	3	3	3	...	1	...	2	12	12%
2.	వెనుకబడిన తరగతులవారు	1	40	13	11	...	...	...	...	65	65%
3.	షెడ్యూల్డు కులాలవారు	5	14	3	1	...	...	...	...	23	23%
		6	57	19	15	...	1	...	2	100	100%

వీరికి ఈ ఆదాయాలు వారు చేయు వృత్తులైన వ్యవసాయము, ఉద్యోగము (అగ్రకులాల వారికి ఎక్కువ శాతము), వ్యవసాయము మాత్రమే, కూలీ చేయుట, మరియు ఇతర వారి వారి వృత్తుల వలన వచ్చుచున్నవని సర్వేలో వెల్లడి అయినది.

పట్టిక - 10

సర్వేలో పాల్గొన్న వారి పిల్లల ఆదాయ వివరాలు

క్రి. సంఖ్య	పిల్లల యొక్క ఆదాయము		సర్వేలో పాల్గొన్న వారి సంఖ్య	శాతము
1.	ఆదాయము సంపాదించే వారు లేనివారు		62	62%
2.	100-500 ఆదాయాన్ని సంపాదించే పిల్లలున్నవారు		17	17%
3.	600-1000 ఆదాయాన్ని సంపాదించే పిల్లలున్నవారు		20	20%
4.	1100-1500	,,	-	-
5.	1600-ఆపైన	,,	1	1%
			100	100%

పట్టిక 10ని పరిశీలించగా వీరిలో అధిక శాతము మందికి (62 శాతము) తమ పిల్లల నుండి ఆదాయము లేదు. 17 శాతము మందికి పిల్లల నుండి 100-500 రూపాయల ఆదాయాన్ని పొందుచున్నట్లుగాను 20 శాతము మంది 600-1000 1 శాతము మందికి 1000 ఆ పైన ఆదాయాన్ని తమ తమ పిల్లల నుండి పొందుచున్నట్లుగా ద్యోతకమవుచున్నది.

పట్టిక 11లో ఏ మాత్రము స్వంత భూమి లేనివారు 19 మంది. ఇందులో 7 గురు వెనుకబడిన తరగతులకు చెందినవారు మరియు 12 మంది షెడ్యూల్డు కులాలకు సంబంధించినవారు. ఈ 7 గురిలో ఒకరు 100 నుండి 500 రూపాయల వరకు పెట్టుబడి పెట్టిన వారైతే 6 గురు పెట్టుబడి పెట్టలేనివారని తెలియుచున్నది. అదే విధముగా షెడ్యూల్డు కులాలకు చెందిన 12 మందిలో 6గురు 100-500 రూపాయల పెట్టుబడి పెట్టిన వారుండగా ఒక్కరు 600-1000 రూ॥ మేరకు పెట్టుబడి పెట్టిన వారని మిగిలిన నలుగురు మాత్రము ఏ పెట్టుబడి పెట్టలేనిస్థితిలో నున్నట్లుగా తెలియుచున్నది. వీరందరు ఇతరుల భూములపై (పాలుకు) పెట్టుబడి పెట్టినట్లుగా తమ అభిప్రాయాలను వెలిబుచ్చినారు.

పట్టిక - 11

పెట్టుబడి వివరముల పట్టిక

భూమి వివరాలు	కులము	మొ. సంఖ్య	100to 500	600to 1000	1100to 1500	1600to 2000	2100to 2500	2600to 3000	పెట్టుబడి లేనివారు	మొ. సం.	శాతం
భూమిలేనివారు	అ.కు.	అందరికి భూమి కలదు									
	వె.కు.	7	1	...	...	...	...	...	6	7	7%
	షె.కు.	12	6	1	...	1	...	...	4	12	12%
గుంట నుండి	అ.కు.	3	...	1	...	...	...	...	2	3	3%
1 ఎకరము వరకు	వె.కు.	27	22	4	—	...	...	1	...	27	27%
	షె.కు.	7	7	...	...	...	...	...	...	7	7%
1 ఎకరము నుండి	అ.కు.	3	1	2	...	...	...	...	—	3	3%
2 ఎకరముల వరకు	వె.కు.	11	11	—	—	—	—	—	—	11	11%
	షె.కు.	4	3	1	—	—	—	—	—	4	4%
2 ఎకరముల నుండి	అ.కు.	4	2	1	—	1	—	1	—	4	4%
5 ఎకరముల వరకు	వె.కు.	17	9	7	—	—	—	—	—	17	17%
	షె.కు.	—	—	—	—	—	—	—	—	—	—
6 ఎకరముల నుండి	అ.కు.	1	1	—	—	—	—	—	—	1	1%
10 ఎకరముల వరకు	వె.కు.	2	1	1	—	—	—	—	—	2	2%
	షె.కు.	—	—	—		—	—	—	—	—	—
11 ఎకరములపై నుండి	అ.కు.	2	2	—	—	—	—	—	—	2	2%
	వె.కు.	—	—	—	—	—	—	—	—	—	—
	షె.కు.	—	...	...	...	...	...	...	...	—	...

ఒక గుంట భూమి నుండి 1-00 ఎకర భూమిని కల్గియున్న వారు 37 మంది. వీరిలో 3 గురు అగ్రికులాలవారు, 27 మంది వెనుకబడిన తరగతులవారు, 7గురు షెడ్యూల్డు కులాలకు చెందిన వారు ఉన్నారు. అగ్రికులాలకు చెందిన ముగ్గురిలో ఒకరు 600-1000 రూపాయలు పెట్టుబడి పెట్టితే ఇద్దరు ఎలాంటి పెట్టుబడి పెట్టలేదు. వెనుకబడిన తరగతికి చెందిన 27 మందిలో 22 మంది 100-500 రూపాయల పెట్టుబడి పెట్టిన వారుంటే నల్గురు 600-1000 రూపాయల వరకు పెట్టుబడి పెట్టినవారై ఉన్నారు. అయితే వీరిలో ఒక్కడుమాత్రము 2600-3000 పెట్టుబడి పెట్టినట్లుగాతెలియుచున్నది. షెడ్యూల్డు కులాలకు చెందిన 7 గురిలో అందరు 100 నుండి 500 రూపాయల పెట్టుబడి పెట్టిన వారే అనియు వేరే ఏ పెట్టుబడి గ్రూపులలో పెట్టుబడి పెట్టలేదని తెలియుచున్నది.

ఒక ఎకరము నుండి రెండు ఎకరాల భూమి కల్గియున్న వారు 18 మంది అయితే అందులో ముగ్గురు అగ్రి కులాలకు, 11 మంది వెనుకబడిన తరగతులకు మరియు నలుగురు షెడ్యూల్డు కులాలకు చెందినవారు. అగ్రి కులాలకు చెందిన ముగ్గురిలో ఒకరు 100 - 500 రూపాయల పెట్టుబడి పెట్టితే ఇద్దరు 600 — 1000 రూపాయల పెట్టుబడి పెట్టిన వారని తెలియుచున్నది. వెనుకబడిన తరగతికి చెందిన 11 మంది మొత్తం ఒకే మోస్తపు పెట్టుబడి 100 - 500 రూపాయల గ్రూపులోనే పెట్టినట్లుగా విశదమగుచున్నది. షెడ్యూల్డు కులాలకు చెందిన నలుగురిలో ముగ్గురు 100 - 500 రూపాయల పెట్టుబడి పెట్టినట్లుగా, ఒక్కరుమాత్రము 600-1000 రూపాయల పెట్టుబడి పెట్టినట్లుగా ద్యోతకమవుచున్నది.

2-5 ఎకరాల భూమి కల్గియున్న వారు 21 మంది అయితే అందులో నలుగురు అగ్రికులాలకు, 17మంది వెనుకబడిన తరగతులకు చెందినవారు. కానీ షెడ్యూల్డు కులాలకు చెందిన వారు ఎవరు లేరు. అగ్రికులాలకు చెందిన నలుగురిలో ఇద్దరు 100-500 రూపాయలు ఒక్కరు 600-1000 రూపాయల పెట్టుబడి పెట్టినట్లుగా, వెనుకబడిన తరగతులకు చెంది 17 మందిలో 9 మంది 100-500 రూపాయలు, 7 గురు 600-1000 రూపాయలు, ఒక్కరు 2600-3000 రూపాయల పెట్టుబడి పెట్టినట్లుగా విశదమగుచున్నది.

6 - 10 ఎకరాల భూమి ఉన్నవారు ముగ్గురు అయితే ఇందులో ఒక్కరు అగ్ర కులాలకు మరిద్దరు వెనుకబడిన తరగతులకుచెందిన వారుగానున్నారు. అగ్రికులానికి చెందినవారు 100-500 రూ॥ పెట్టుబడి పెట్టినట్లుగా వెనుకబడిన తరగతులకు చెందిన ఇద్దరిలో ఒక్కరు 100 - 500 రూపాయలు మరొక్కరు 600 - 1000 రూపాయల పెట్టుబడి పెట్టినట్లుగా తెలియుచున్నది. అయితే ఈ భూమి గ్రూపుకల్గిన వారిలో షెడ్యూల్డుకులాలకు చెందినవారు ఏ ఒక్కరు కూడా లేరు.

11 ఎకరాలు ఆ పైన భూమి ఉన్నవారు ఇద్దరు మాత్రమే. వారు అగ్రకులాలవారే వెనుకబడిన తరగతికి మరియు షెడ్యూల్డు కులాలకు చెందినవారు లేరు. ఈ ఇద్దరును రూపాయలు 100-500ల పెట్టుబడి పెట్టినవారే అని తెలియుచున్నది.

పై పట్టికను నిశితముగా పరిశీలించినచో తెలియునది ఏమనగా భూమిలేనివారు వెనుకబడిన తరగతికి, షెడ్యూల్డు కులాలకు చెందినవారే కలరు. వీరిలో పెట్టుబడి పెట్టలేనివారు ఉన్నారు. భూమి లేనివారుకూడా ఇతరుల భూమిపై పెట్టుబడి పెట్టినారు. అగ్రి కులాలలో కూడా పెట్టుబడి పెట్టలేనివారున్నారు. అట్టివారు తమ భూములను కౌలుకు ఇచ్చినారు. ఈ 100 మందిలో 66 మంది 100 - 500 రూపాయల పెట్టుబడిని పెట్టగా 18 మంది 600 - 1000 రూపాయల పెట్టుబడి పెట్టినారనియు ఇద్దరు 1600 - 2000 రూపాయల పెట్టుబడి పెట్టినారనియు ఇద్దరు 2600 - 3000 రూపాయలు మరియు 12 మంది ఏ పెట్టుబడి పెట్టని వారని తెలియుచున్నది.

పట్టిక 12లో ఏమాత్రము స్వంతభూమి లేని వారైన 19 మందిలో 7గురు వెనుకబడిన తరగతివారు మరియు 12 మంది షెడ్యూల్డు కులాలకు చెందినవారు. వెనుకబడిన తరగతికి చెందిన 7 గురులో ఇద్దరు 100 - 500 రూపాయలు, ముగ్గురు 600 - 1000 రూపాయల అప్పును కల్గియున్నారు. అయితే వీరిలో ఇద్దరు ఎలాంటి అప్పులేని వారని తెలియుచున్నది. షెడ్యూల్డు కులాలకు చెందిన 12 మందిలో 7గురు 100 - 500 రూపాయలు, ఇద్దరు 600 - 1000 రూపాయలు, ముగ్గురు 1600 — 2000 రూపాయల అప్పులు కల్గియున్నవారని తెలియుచున్నది.

ఒక గుంట భూమినుండి 1-10 ఎకర భూమిని కల్గియున్న వారు 37 మంది. వీరిలో ముగ్గురు అగ్రకులాలవారు, 27 మంది వెనుకబడిన తరగతులవారు, 7గురు షెడ్యూల్డు కులాలవారు ఉన్నారు. అగ్రకులాలకు చెందిన ముగ్గురిలో ఇద్దరు అప్పులు లేక మరొకరు 1600 - 2000 రూపాయల అప్పును కల్గియున్నారని విశదమగుచున్నది. వెనుకబడిన తరగతికి చెందిన 27 మందిలో ఇద్దరు 100 -500 రూపాయలు, 7 గురు 600 - 1000 రూపాయలు, ఇద్దరు 1100-1500 రూపాయలు, ఇద్దరు 1600-2000 రూపాయలు మరియు 8 మంది 2600 - 3000 రూపాయల అప్పును కల్గియున్న వారై ఉండగా 6 గురు మాత్రము అప్పులేని వారనితెలియుచున్నది. షెడ్యూల్డు కులాలకు చెందిన 7గురిలో ముగ్గురు 100 - 500

రూపాయలు ఇద్దరు 600 - 1000 రూపాయలు మరియు 1100 - 1500 రూపాయల అప్పుకల్గియున్న వారుంటే ఒక్కరు మాత్రము అప్పులేకుండా ఉన్నారని గోచరించుచున్నది.

ఒక ఎకరము నుండి 2 ఎకరాల భూమిని కల్గియున్నారు. ఈ సర్వేలో 18 మంది అయితే వీరిలో ముగ్గురు అగ్రకులాలకు, 11 మంది వెనుకబడిన తరగతికి మరియు నలుగురు షెడ్యూల్డు కులాలకు చెందినవారై ఉన్నారు. ఇందులో అగ్రకులాలకు చెందిన ముగ్గురిలో ఇద్దరు అప్పులేనివారని మరియు ఒకరు 1600-2000 రూపాయల అప్పుతో ఉన్నట్లుగా విశదమగుచున్నది.

వెనుకబడిన తరగతులకు చెందిన 11 మందిలో ఇద్దరు అప్పులేని వారుండగా ఇద్దరు 1600 - 2000 రూ॥ మరియు 7 గురు 2600 - 3000 రూ॥ ల అప్పులతో ఉన్నట్లుగా తెలుస్తుంది. షెడ్యూల్డు కులాలకు చెందినవారైన 4 గురులో అందరు అప్పు లున్నవారే. అయితే వారు 100 - 500 రూ॥ ల అప్పుతో ఇద్దరు, ఒక్కరు 600 - 1000 రూ॥ ల అప్పుతో ఒక్కరు 1600 - 2000 రూ॥ ల అప్పుతో ఉన్నట్లుగా విశదమగుచున్నది.

రెండు ఎకరాల నుంచి 5 ఎకరాల భూమిని కల్గియున్నవారు 21 మంది అయితే వీరిలో నలుగురు అగ్రకులాలకు, 17 మంది వెనుకబడిన తరగతులకు చెందిన వారైతే ఏ ఒక్కరు కూడా

పట్టిక - 12

అప్పుల వివరాల పట్టిక

భూమి వివరాలు	కులము పేరు	నెం.	100-500	600-1000	1100-1500	1600-2000	2100-2500	2600-3000	అప్పులేని వారు	ఉసం.	శాతం
భూమి లేనివారు	అ.కు.	అందరికి భూమి కలదు									
	వె.కు.	7	2	3	-	-	-	-	-	7	7%
	షె.కు.	12	7	2	-	3	-	-	-	12	12%
		19									
గుంట నుండి	అ.కు.	3	-	-	-	1	-	-	2	3	3%
1 ఎకరము వరకు	వె.కు.	27	2	7	2	2	-	8	6	27	27%
	షె.కు.	7	3	2	1	-	-	-	1	7	7%
		37									
1 ఎకరము నుండి	అ.కు.	3	-	-	-	4	-	-	2	3	3%
2 ఎకరము వరకు	వె.కు.	11	-	-	-	2	-	7	2	11	11%
	షెకు.	4	2	1	-	1	-	-	2	4	4%
		18									
2 ఎకరముల నుండి	అ.కు.	4	-	-	-	1	-	3	-	4	4%
5 ఎకరముల వరకు	వె.కు.	17	2	1	3	3	-	2	6	17	17%
	షె.కు.	–	–	–	–	–	–	–	–	–	–
		21									
6 ఎకరముల నుండి	అ.కు.	1	-	-	-	1	-	-	-	1	1%
10 ఎకరముల వరకు	వె.కు.	2	–	–	–	–	–	1	1	2	2%
	షె.కు.	–	–	–	–	–	–	-	–	–	–
		3									
11 ఎకరములుఅపైన	అ.కు.	2	-	1	-	–	–	–	1	2	2%
	వె.కు.	-		–	–	–	–	–	–	–	–
	షె.కు.	–	–	–	–	–	–	–	-	–	–
		2									

షెడ్యూల్డు కులాలకు చెందిన వారు లేరు. అగ్రకులాలకు చెందిన నలుగురిలో ఒక్కరు 1600-2000 రూపాయలు, ముగ్గురు 2600-3000 రూపాయల అప్పులతో నున్నవారే. వెనుకబడిన తరగతికి చెందిన 17 మందిలో ఇద్దరు 100-500 రూపాయలు, ఒక్కరు 600-1000, ముగ్గురు 1100-1500 రూపాయలు, ముగ్గురు 1600-2000 రూపాయలు ఇద్దరు 2600-3000 రూపాయలకు అప్పు పడి యున్నట్లుగా 6గురు అప్పులేనట్లుగా తెలియుచున్నది.

6-10 ఎకరాల భూమి కల్గియున్న వారు కేవలము ముగ్గురు మాత్రమే. ఇందులో ఒకరు అగ్రకులాల వారైతే మరిద్దరు వెనుకబడిన తరగతికి చెందినవారు. అప్పుల విషయంలో చూస్తే అగ్రకులాలకు చెందిన వారిలోని ఒక్కరు 1600-2000 రూపాయల అప్పుతోను వెనుకబడిన తరగతులకు చెందిన ఇద్దరిలో ఒకరు 2600-3000 రూపాయల అప్పుతో ఒకరు అప్పులేకుండా ఉన్నట్లుగా విశదమగుచున్నది.

11 ఎకరాలు ఆపైన భూమి ఉన్నవారు ఇద్దరు మాత్రమే. వారు అగ్రకులాలవారే, వెనుకబడిన తరగతి మరియు షెడ్యూల్డు కులాలకు చెందినవారు లేరు. ఈ ఇద్దరిలో ఒక్కరు 600-1000 రూపాయల అప్పులతోను మరొక్కరు ఏ అప్పు లేకున్నట్లుగా ద్యోతకమవుచున్నది.

పై పట్టికను నిశితముగా పరిశీలించినచో తెలియునది ఏ మనగా అగ్రకులాలకు చెందిన 13మందికి 7మందికి అప్పులున్నవి. వెనుకబడిన తరగతులకు చెందిన 64 మందికి 47 మందికి మరియు షెడ్యూల్డు కులాలకు చెందిన 23 మందికి 22 మంది అప్పులతో నున్నారు. దీని బట్టి ఎక్కువశాతము అప్పులున్నవారు షెడ్యూల్డు కులాలకు చెందిన వారే ఉన్నారు. వీరు తాము అప్పులు చేయుటకు కారణాలు ఈ క్రింది విధముగా వక్కాణించారు.

1) తిండికి సరిపోక
2) వ్యవసాయములో అతివృష్టి అనావృష్టి
3) ఇతర భూములను కౌలుకు తీసికొనుటవలన
4) శరీరములు బాగుగాలేక అనారోగ్య పీడితవలన
5) బిడ్డలు మరియు చెల్లెండ్ర పెండ్లిళ్ళకు
6) వ్యవసాయ పశువులు కొన్నందుకు
7) ఇండ్లు (గుడిసెలు) నిర్మించుకొన్నందులకు
8) భూమి కొన్నందులకు
9) వ్యవసాయ నీటి పంపులను కొన్నందులకు
10) వ్యాపార నష్టముల వలన

మొదలగు కారణాలను సర్వేలో వెల్లడించినారు.

13వ పట్టికలో 13 మంది అగ్రకులాలవారు వారిలో ఒక గుంట నుండి ఒక ఎకరము భూమి ఉన్నవారు ముగ్గురు, 1-2 ఎకరాల భూమి ఉన్నవారు ముగ్గురు 2-5 ఎకరాల భూమి ఉన్నవారు 4గురు, 6-10 ఎకరాల భూమి ఉన్నవారు ఒక్కరు మరియు 11 ఎకరాల పై భూమి ఉన్నవారు ఇద్దరు. వీరిలో అప్పులేని వారు 6గురు అప్పులున్నవారు 7గురు. అప్పు పొందిన ఏడుగురు బ్యాంకుల నుండి మరియు వడ్డీ వ్యాపారస్థులనుండి పొందినవారే.

వెనుకబడిన తరగతులకు చెందిన 64 మందిలో భూమి లేనివారు 7గురు, 1 గుంట - 1 ఎకరము భూమి ఉన్నవారు 27 మంది, 1-2 ఎకరాల భూమి ఉన్నవారు 11 మంది, 2-5 ఎకరాల భూమి ఉన్నవారు 17 మంది, 6-10 ఎకరాల భూమి ఉన్నవారు ఇద్దరు, 11 ఎకరాలపైన భూమి వెనుకబడిన తరగతులకు చెందిన వారిలో ఎవరూ లేరు. వెనుకబడిన తరగతులకు చెందిన 64 మందిలో 14 మందికి అప్పులు లేవు. మిగతా 50 మంది అప్పు ఉన్నవారు. వీరిలో 26 మంది బ్యాంకులు మరియు వడ్డీవ్యాపారస్థుల నుండి, మిగిలిన 24 మందిలో 6 గురు బ్యాంకునుండి, 18 మంది కేవలము వడ్డీ వ్యాపారస్థులనుండి అప్పులను పొందినారని తెలియు

పట్టిక - 13

అప్పులు పొందు రకాలు

క్ర. సం.	కులము	అప్పులేని వారు	బ్యాంకుల నుండి పొందిన వారు	వడ్డీ వ్యాపారస్తుల నుండి పొందువారు	భూమిలేని వారు	గు. 1ఎకరమునకు	1.2 ఎకరములు	2-5 ఎకరములు	6-10 ఎకరములు	11 ఎ. ఆపైన	ఉ. సం.	శాతం
1.	అ.కు.	6	7	7	అందరికి ఉన్నది	3	3	4	1	2	13	13%
2.	వె.కు.	14	32	44	7	27	11	17	2	-	64	64%
3.	షె.కు.	1	-	22	12	7	4	–	–	–	23	23%
		21	39	72	19	37	18	21	3	2	100	100%

చున్నది. వీరిలో ఎక్కువశాతము మంది వడ్డీ వ్యాపారస్తుల నుండే పొందినారు.

షెడ్యూల్డు కులాలకు చెందిన 23 మందిలో భూమిలేని వారు 12 మంది, 1 గుంట 1 ఎకరము వరకు భూమి కలవారు 7 గురు, 1 ఎకరము 2 ఎకరము వరకు భూమి కలవారు 4 గురు, 2-5 నుండి ఆపైన షెడ్యూల్డు కులాలకు చెందిన 23 మందిలో 22 మంది అప్పులున్నవారు, ఒక్కరు అప్పులేనివారు. ఈ అప్పు వడ్డీ వ్యాపారస్థుల నుంచియే పొందినారు. ఎందుకనగా వీరు బ్యాంకులలో పొందలేదు. వీరు బ్యాంకులలో ఋణాలను పొంద పోవుటకు కారణాలను ఈ సర్వేలో ఈ క్రింది విధముగా తెలిపినారు.

1) బ్యాంకులలో అప్పులుపొందు పద్ధతులు తెలియకపోవుట

2) తెలిసినవారు తిరిగిన ఖర్చులకని ఎక్కువ డబ్బును తీసికొనుట వలన

3) బ్యాంకర్లకు లంచాలు ఇస్తున్నామని డబ్బు వసూలు చేయుట వలన

4) ఇచ్చే కొద్ది పైసలకు బ్యాంకుల చుట్టు అనేక సార్లు తిరుగటము కాలయాపన జరుగుటవలన-మరియు తత్ఫలితముగా పనికి నష్టము వాటిల్లడము

5) బ్యాంకులు అనేకము అర్బన్ ఏరియాలో కేంద్రీకరించబడుట వానికై రావడానికి బస్సు చార్జీలు అవుటవలన

6) డిపాజిటు సొమ్ము లేకపోవుట మరియు పూచీదారులు లేకపోవుట.

ఈ కారణముల వలన బ్యాంకుల నుండి వారు ఋణాన్ని పొందలేక గ్రామీణ వడ్డీ వ్యాపారస్థుల నుండి ఋణాన్ని పొందు చున్నారని తెలిపినారు. గ్రామీణ వడ్డీ వ్యాపారస్థులలో ముఖ్యముగా కోమటి, గౌండ్ల, పద్మశాలి, కాపు, రెడ్డి కులాలవారై ఉన్నట్లుగా సర్వేలో వెలికి వచ్చినది. వీరిచ్చే వడ్డీ రేటు కూడా ఎక్కువగా నున్నదని, ఈ ఋణభారానికి సతమతమవుచున్నారని తెలిపినారు.

(ఇంకా ఉంది)

మట్టి తనలో వున్న గుట్టు విప్పేసింది

జనజ్వాల

కొమ్మల మధ్య లోంచి
ఎగిరిపోయిన
సువాసన కోలి పోమ్మంటూ
పూలు -
రెక్కలొచ్చి
చెప్పకుండానే చెట్లను విడిచి వెళ్ళితే
చెట్లు బాధ
అంతింత కాదని,
అది .... అనంత ఘోష అని
అంటే !
అది ఏలా అవుతుంది ?
అని ప్రశ్నిస్తుంది
చెట్లును పెంచుతున్న మట్టి -

◆ ◆

మ్యావ్....మ్యావ్....అనేపిల్లే
తూరుపు వాకిట్లో పులిని చంపినప్పుడు
మట్టి నవ్వింది
మాట్లాడింది,
మళ్ళీ ఇప్పుడు
ఎగిరిపోయిన పూల ప్రస్తావన వచ్చినప్పుడు
దిగులు చెందే మౌనలతో ....
పూల వెనకా
పూచిన ఉదయాన్ని, ఎగిరిన పూల త్యాగాన్ని
ఆకాశానికి వినిపిచ్చేటట్లు చెప్తుంది -

చెట్ల బాధ
అనంత ఘోషకాదని
అది అబద్ధమని
బట్టభూతమని
మట్టి -
అసలు నిజాన్ని చెప్పేస్తుంది!

అసలు పూలకు త్యాగాలు బోధించింది
చెట్లేనని -
తనమీదబడ్డ సూర్యున్ని నెత్తురుచుక్కలతో....
ఎగిరి పొమ్మని పూలకు
చెట్లే గీతోపదేశం చేశాయనీ
ఆకాశానికి వినిపిచ్చేటట్లు
మట్టి,
తనలోవున్న గుట్టు విప్పేసింది-

◆ ◆

అంతా విన్న ఆకాశం
సానుభూతి అంటూ, రెండు కన్నీటి బొట్లు
దానం చేస్తానంటే
దౌడ విరగ్గొడతానంటూ
మట్టి -
ఆకాశంపై తుప్పున ఉమ్మేసి
విరుచుక పడింది —

◆ ◆

జాలి, దుఃఖం ఎగిరిపోయిన
ఆకాశం -
అందుకో నేస్తం అంటూ
మట్టికి,
షేక్ హాండ్ ఇవ్వబోతుందో ?
కురుక్షేత్రం ప్రకటిస్తుందో ?
రెండు ప్రశ్నల మధ్య
చెట్లు -
బుగులు బుగులు అమ్మిన మనసును
విప్పుకుంటున్నాయి
గుట్టలతో .... !

శ్రీ కొల్లూరు సూర్యనారాయణ

విరియాల వల్లని గూడూరు శాసనము నందలి బొట్టు బేత కాకతి బేత కాడు

తెలుగు సాహిత్యాభిమానులకు, చరిత్రకారులకు చిరపరిచితమై వివిధములగు చర్చలలో నూతనాంశములను ప్రభవించిన గూడూరు శాసనపు తెలుగు భాగమును పునః ప్రస్తావింపవలసిన ఆవశ్యకత యేర్పడినది. ఈ శాసనపు అర్థము రూపేర్పరుప పలువురు విద్వాంసులు సుమారుగా అర్ధ శతాబ్ది ముందునుండి అప్పుడప్పుడు లభించు శాసనాధారములతో కృషి చేయుచున్నను పరిష్కారము కానరాలేదన్నచో నిది యెంతటి క్లిష్టమో తెలియగలదు. శ్రీ పుట్టపర్తి శ్రీనివాసాచారిగారు,[1] శ్రీ కొల్లూరు హర్షవర్ధన శర్మగారు,[2] శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు,[3] శ్రీ టేకుమళ్ళ కామేశ్వరరావుగారు,[4] శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారు,[5] శ్రీ భాగవతుల లక్ష్మీనారాయణగారు,[6] శ్రీ పుచ్చా పరబ్రహ్మశాస్త్రిగారు,[7] శ్రీ చెళ్ళపిళ్ళ సోమసుందరరావుగారు,[8] మున్నగు పండితులు పై అంశమై గతములో విపులమైన చర్చ గావించినారు. కాని ఎవ్వరెంత పరిశోధనలు జరిపినను శాసనపు అర్థము పూర్తిగా నేటికీ బయల్పడలేదు. శాసన పద్య రచయిత ప్రామాణికుడైన విద్వాంసుడు కాకపోవుట, చారిత్రకాంశములే కాకుండ, శబ్దార్థములే అస్పష్టములై సందిగ్ధముగ పడుట, శాసన భాగములోని అక్షరము లచ్చటచ్చట పగిలిపోవుట, లేఖక దోషములు, అన్నింటికన్న అధికముగా పరిపూర్ణత సిద్ధింపని భాషాప్రయోగము శాసన క్లిష్టతకు యథాశక్తిని తోడ్పడిన అంశములు. కనుక ఎవరి కంగీకారమైన విధముగా వారు దీని చారిత్రకాంశములను వెల్లడించుట జరిగినది తప్ప యథాతథా శాసనార్థమును తెలుసుకొనుట సాధ్యముగుటలేదు. అది అట్లుండ శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు 1982, ఆగస్టు, భారతి లో (పు. 45) దీనిని మరల 'విరియాలవల్లని గూడూరు సానుబంధ శాసనము' అను పేరిట ప్రకటించిరి. లేఖక దోషబహుళమైన శాసనమున తెలుగు పద్యములకు సరియైన పరిష్కరణములేదు కనుక తామాబాధ్యతను స్వీకరించినట్లు వీరందు పేర్కొన్నారు. కొద్దినెలల క్రిందట ముదిగొండ చాళుక్యుల కాలనిర్ణయ విషయమై శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారును, మేమును భారతి లో చర్చజరిపిన సందర్భమున[9] యిది పునర్విమర్శకు వచ్చుటనుబట్టి దీని పరిష్కరణను ప్రస్తుతము వారు చేపట్టి యుందురని భావింపవచ్చును. కాని వారి పరిష్కరణమున శాసనపు భాషాప్రయోగ సంస్కరణలెట్లు జరిగినను చారిత్రక విషయములు కొన్ని నిష్కారణముగా బలియై పోవుటనుబట్టి, వారందు ప్రకటించిన అభిప్రాయములను కొన్నింటిని వెంటనే సవరించుకొనుమని కోరుటయే యీ వ్యాసపు ముఖ్యోద్దేశము. శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారు, శ్రీ సోమసుందరరావుగారలలో నెవరుగాని, మరిజిజ్ఞాసువులైన యితరులుగాని, వీరు చారిత్రకాంశముల నుపేక్షించుట నిరసింతురని వేచియుంటిని. కాని నేటివరకట్టి ప్రయత్నము కానరాలేదు. శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు శాసనమును పరిష్కరించి, అర్థము చెప్పినతీరు చరిత్రను మరుగుపరచినది. వారే తమ వ్యాసమున సెలవిచ్చినట్లు శాసన పద్యార్థము చరిత్ర అగునుగాని, ఊహాగానము శాసన పద్యార్థము కాదుకదా! కనుకనే శాసన పద్యార్థము నూహింపవలదని, సమకాలీన చారిత్రక విశేషములను గుర్తింపవలెనని మనవి చేసుకొను చున్నాము. ముదిగొండ చాళుక్య, కాకతీయ, విరియాల వంశీయుల చరిత్రలో నీ శాసనమున కెంతేని ప్రాధాన్యత కలదని మరువరాదు.

శాసనపు వివరములు నూతనములు కాకపోవుటచే అన్నింటిని సవిస్తరముగా పేర్కొనుట విస్తర భీతిచే మానుకొనుచుంటిని. జిజ్ఞాసువులు పై పండితులందరి వాదములను కూలంకషముగా పరిశీలింతురుగాక! ప్రస్తుత పరిశీలన కావశ్యకమైన శాసనపు తెలుగు భాగమును మాత్రము దిగువ నిచ్చుచున్నాను, గమనింపుడు.

1. అనుపమ దుర్జయాన్వయ సుధాబ్ధి ననేకులు రాజనందనులు
   ననిన బొఱంటి వెన్నడను సంభ(వు)డయ్యె నతి ప్రసిద్ధుడై

వినుత విరోధి మణ్డళిక వెన్నడు వెన్నుడై వోలెవానికిని
ఘనుడగు నెఱభూపతి జగద్వినుతుండు(ద)యించె గీర్తితోను॥

2. భావిత కీర్తి నాథ (ని-) పాండవ మధ్యమ భీముడో యనం
గా (వి) రియాల భీమ ద్రివిపఘస్మరుడై(యు)ది యించె వానికిను
భూవినుతుణ్డు మండళిక భూషనుదెఱ నరేంద్రుడు (త్ర) ప
శ్రీ వినుతుండు బందుజన సేవ్యుండు దానుదయించె నున్నతిని॥

3. అతణ్డని బొట్టు బేత వసుధాధిపు జేకొని వానిపై (రి) ను
ద్వృతమున జంపి (యా) కొరవిదేశమున(ం)దు ప్రతిష్ఠ జేసిత
త్తనెయురు పేరు పోడగల దాయను బిట్టఱ గద్యనంబున
పృతిముడు వ్రా(చే) మొగడుకల్లియు పండ్రడు నేలునప్పుడే॥

4. అరుదగునట్టి ఎఱ్ఱనిపు (న) ంగన గామవసాని యొక మే
(ల్గ) రుడని బేత భూవిభుని గాకతి వల్లభు బింన్నవానిదా
బరగంగ జేతబట్టి ఘను బల్లవరాయని యోగి జొచ్చి భా
స్కర విభుచక్రవర్తి గని కాకతి నిల్పుట గోటి సేయదే॥

5. కారక కాలుడై పడసె గాడయ నాయకు జంపి సూరడ
వ్వేలుపు గొండ రవ్వన్రిపు వేలుపు గొండన నిల్పి వానిచే
మేలుగ మూడ ముప్పయిని మేలుగ సేరెడు బోటి పాడు నుం
మేలుగ బే(డు?) కు మావిడ్లు మేలు గరెండయరాజు సంగడ్లు॥

పై పద్యములలో నున్న దోషముల నన్నింటిని శ్రీ కొర్ల పాటి శ్రీరామమూర్తిగారు లేఖకునికొక్కనికే అంటగట్టిరి. శాసన రచయిత పైనున్న గౌరవముచే నాతనికి దోషము లాపాదింప నిచ్చ గించక వారిట్లు గావించి యుందురు. కాని ఒక్క విషయము. దీనికి అనుబంధముగా నుండిన కన్నడ శాసనమునకును దీనికి నిలిపి ఒకే పద్ధతిలో నుండుటయేగాక, వీనిని మలచిన లేఖకుడు కూడ 'కొమ్మోజు' అను నాతడొక్కడే. కన్నడ భాగమున దోషములు లేకపోవుటనుబట్టి లేఖకుని లేఖన పాండిత్యమును అంతగా శంకింప పనిలేదు. ఎక్కడ లేని దోషములును తెలుగు భాగముననే వచ్చి పడినవి. తెలుగు భాషలో అంతగా పరిచయములేని లేఖకుని ద్వారా కొన్ని చిక్కులు వచ్చియుండిన వచ్చి యుండవచ్చును. కాని మొత్తమన్నింటికి నాతడే బాధ్యుడనుట అసమంజసము. కొన్ని పద్యములలో కల పద ప్రయోగమునుబట్టి (తనయుడు అనుటకు తనెయును. కాలకకాలుడనుటకు కారకకాలుడు మున్నగునవి) కన్నడ శాసనమును వ్రాసిన రచయితయే, తనకున్న పరిమిత పాండిత్య ముతో నీ తెలుగు భాగమును కూడ వ్రాసి యుండెనని అనుమానిం చుటకు అవకాశమున్నది. తెలుగులో విద్వాంసుడు కానందువలననే భావమును స్పష్టపరుపలేక తప్పుల ననేకము దొర్లించెను. కనుక లేఖకునితోబాటు శాసన రచయితకూడా యిందలి దోషములకు బాధ్యుడే. ఇరువురును కన్నడిగులగుటయు, తత్కాలమున ఆ ప్రాంతమున నస్పష్టముగా నుండిన తెలుగులో వీరికి ప్రావీణ్యత లేకపోవుటయు దీనికి కారణము కానోపును.

పై శాసనపు మొదటి పద్యమున శ్రీరామమూర్తిగారు పెద్ద మార్పులేమియు సూచింపలేదు. రెండవపంక్తిలోని "పొఱంటి వెన్నడను సంభవుడయ్యె" అను దానిని అన్వయమునకై 'పొఱంటి వెన్నడన సంభవుడయ్యె' అని మాత్రము సంస్కరించినారు. దుర్జయ వంశమున పొఱంటి వెన్నడు, ఆతనికి ఎఱ్ఱభూపతి ఉద యించినపైనమిందు వర్ణింపబడినది. అయితే, దీనిలోని దుర్జయుడు, వెన్నడు, ఎఱ్ఱడు అను ముగ్గురు కాకతీయులలో కూడ నుండుటను బట్టి దీనిని ఎవ్వరిదిగా నన్వయించు కొనవలెనో సందేహమే.

రెండవ పద్యము నుండి వీరి సంస్కరణ మొదలైనది. ఇచ్చట నుండియే చారిత్రకాంశములను విస్మరించుట కూడా జరిగినదనవచ్చును. "భావిత కీర్తినాథ (ని-) పాండవ మధ్యమ భీముడో యనంగా (వి) రియాల భీమ ద్రివిపఘస్మరుడై (యు) ది యించె" అని శాసనవాక్యము. దీనిలోని "భావితకీర్తినాథ (ని-)" అను దానిని "భావితకీర్తి నాతనికి" అని యుండవలెనని శ్రీరామ మూర్తిగారు సవరించిరి. అసలట్లు సరిదిద్దుట ఎన్నడో జరిగినది.10 అచట శాసనభాగము పగిలిపోవుటచే యీ విధముగా మన మూహించి చేర్చుకొనవలసినదే. అట్లు చేర్చుటవలన 'భావితకీర్తి' అనుదానిని 'భావితకీర్తి కలుగునట్లుగా' అని క్రియావిశేషణముగా చేసుకొనుట, 'నికి' అనునష్టమైన అక్షరములు రెండింటిని షష్ఠ్యంత ములుగా పూరించుకొనుట వలన యీ పద్యమునకు మొదటి పద్యముతో సంబంధమేర్పడుచున్నది. ఈ షష్ఠ్యంత పూరణము జరుగనిచో దీనికి మొదటి పద్యముతో సంబంధముండదు. పరస్పర సంబంధము లేని పద్యము లిందుండుట బదవ పద్యమును గమనించిన తెలియగలదు. అందువలన మనమూహించు రెండక్షర ములు బట్టియే దీనికి పై పద్యముతో సంబంధమేర్పడును. లోగడ శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారు "భావితకీర్తినాథ [డిటు]" మున్నగు విధముల యోజించిరి.11 కాని చివరకు "భావితకీర్తినాథ [నికి]" అనియే పరిగణించి దీనికర్థముగా విరియాల భీముడు పైపద్యము నందలి యెఱ్ఱని కుదయించినట్లు చెప్పక, పై పద్యమును కాకతీయులదిగా భావించి కాకతీయ యెఱ్ఱనికి శత్రునృపఘస్మరుడైన విరియాల భీముడు ఉప సామంతుడుగా సహాయపడుచుండినట్లు చెప్పిరి. అట్లుచెప్పి శాసన రచయితకు శబ్దజ్ఞానము లేదని ఆపాదిం చుట కిష్టపడని శ్రీరామమూర్తిగారు నామవాచకమైన 'విరియాలు'ను విడదీసి ఆతనిని "భీమనృపఘస్మరుని" గా పేర్కొనిరి.

అటువంటి యితర ప్రయోగముల నుదాహరించుచు కటుకూరు శాసనము[12] నందలి "వీరనరేంద్ర ఘస్మరే" అను దానిని చూపిరి. కాని కటుకూరు శాసన మీయబడిన కాలము పదమూడవ శతాబ్ది ఆరంభము. వారే పేర్కొనినట్లు యీ శాసనపు తొలి నాలుగు పద్యములు కాకతీయ వంశప్రతిష్ఠాపన కాలమునాటివని అంగీకరించినచో, సుమారు నాటికి రెండుశతాబ్దుల క్రిందటివగును. కనుక రెండు శతాబ్దుల తరువాతి ప్రయోగములను బట్టి యిప్పటి పదచ్ఛేదము జరుపుట పద్ధతికాదు. అట్లు జరుపుటయే వారికభీష్టమైనచో సమకాలీనుడై, తత్ప్రాంతమున విరియాలుతో కలహించి నశించిన "భీమనృపు" నొక్కనిని శాసన ప్రమాణముతో చూపవలసి యున్నది. అదియును జరుగలేదు. అసలు శాసనమున వర్ణితుడైన మల్లని పూర్వికుడు "పాండవ మధ్యమ భీముడో" అనునట్లుండవలెను. శ్రీరామమూర్తిగారు చెప్పినట్లు "భీమరాజు" నొకనిని "విరియాలు" సంహరించి యుండినట్లైన నిచ్చటి "భీమ" శబ్ద ప్రయోగమున కౌచిత్యముండదు. శాసనమున "విరియాలు" అని కూడాలేదు; 'విరియాల' అని యున్నది. తన సంస్కరణమునకు వ్యతిరేకముగానున్నది. కనుక శ్రీరామమూర్తిగారు దానిని కవి పాఠము కాదని "విరియాలు" అను శబ్దము లోకసహజము కనుక దానిని గ్రహించినట్లున్నది. వారు చెప్పిన వివరణనుబట్టి దీనికర్థము "భీమరాజును సంహరించిన విరియాలు ఉద్భవమందుట;" విరియాలు శాసనమున లేదు, భీమరాజెవరో తెలియదు. కనుక వీరి అర్థము విచారింపదగినది. 'విరియాల' పదము 'మల్యాల' పదమువలె ఊరిపేరో, మరియితరమో సందేహమే. శాసనమును బట్టి 'పాండవ మధ్యమభీముని పోలిన విరియాల భీముడ'ని చెప్పవలెను. "భీముడు" అని తత్సమముగా ఆ పదము లేకపోవచ్చును; 'విరియాలుడ'ని కూడలేదు. కనుక 'విరియాల భీమ' అనునది పృథమైక వచనములో తత్సమరూపమని అంగీకరించవలెను.

కనుక యీ పద్యము పై పద్యమునకు సంబంధించినదే అని భావించుచో అందలి యెఱ్ఱనకు శత్రునృప సంహారకుడై, పాండవ మధ్యమ భీముని తలపించు విరియాల భీముడును, అతనికి ఎఱ్ఱ నరేంద్రుడును జన్మించుట శాసన పద్యార్థము.

ఇక 'బహుదోష బంధురమైన' మూడవ పద్యము. దీనిలోని మూడవ పంక్తి ఒక్కదానికే సరియగు అర్థము తెలియుటలేదు. కాని మిగిలిన మూడు పంక్తులుకూడా శ్రీరామమూర్తిగారి సంస్కరణమునబడి అర్థము మారిపోయినది. ఫలితముగా కాకతీయ-ముదిగొండ చాళుక్య చరిత్రలో ముఖ్యమనదగు ఘట్టము నిష్కారణముగా బలియై పోయినది.

పై రెండవ పద్యము నందలి ఎఱ్ఱనరేంద్రుడు 'బొట్టుబేత' వసుధాధిపుని చేకొని వాని శత్రువును పరిమార్చి' 'బొట్టుబేత' ని కొరవి దేశమున ప్రతిష్ఠితునిచేయుట, అతని వలన కొన్ని ఫలితము లను పొందుట పద్యము నందలి భావము. కాని యీ పద్యము నందలి "తత్తనెయురు పేరు పొడగల దాయము బిట్టబి గద్యనంబు" సరిగా అర్థము కానిది. శ్రీరామమూర్తిగారు శాసన పద్యార్థము 'ఊహింప' నొల్లక, కవి పాఠము యథాతథముగా గ్రహించు ప్రయత్నమున విపుల చర్చ జరిపిరి. 'తత్తనెయురు' అను శాసన పదము 'తత్తతనయు' అని యుండవలెనని వీరి సంస్కరణ. వారి వాదమును గమనింపుడు — "తత్తతనయసమాసార్థము తెలియని లేఖకుడు అన్ని తకారములు కవిదోషమని తలచి ఒక 'త' కారమునకు స్వస్తి చెప్పవచ్చును. అథవా, అన్నితకారములు చెక్కినట్లు అనుకొనవచ్చును. మొదటి పక్షమున ఒక అక్షరము తక్కువైనదని చివర 'రు' వర్ణమును చేర్పవచ్చును. వాపక్షమున తరువాతి 'పేరు' చెక్కబోయి 'పే' మరచిపోయి 'రు' చెక్కి, మరల 'పేరు' చెక్కవచ్చును. 'న' కారమును 'నె' వర్ణముగ చెక్కవచ్చును." ఇన్ని విధముల 'ఊహించి', చివరకు కవిపాఠము 'తత్తతనయు' అని ఉండవలయుననిరి. తత్తతనయుడన "ఆ విస్తృత ధర్ముడని' అర్థము. పై పద్ధతిలోనే 'పొడగల' అను దానిని 'పొడ్మగల' అనియు, 'గద్యనంబు' అనుదానిని 'గద్యనమ్మ' గను ఊహించిరి. గద్య + నమ్మ అని చెప్పనుంకించుటచే, యిచ్చటి 'గద్య' ను సంస్కృత శబ్దముగా గ్రహింపక 'గద్దియ' శబ్దమునకు రూపాంతరమై యుండనోపుననిరి. తరువాతి పదమైన 'అప్రతిముడు' ను 'గద్యనంబు' నకు కలిపి "సింహాసనమును నమ్మినట్టి సాటిలేని వాడని అర్థముచెప్పి, దోషక్లేశ రహితమైన కవి పాఠమును సాక్షాత్కరింప జేసిరి. కాని వీరు పూర్వపు పండితాభిప్రాయములను మన్నించుటగాని, ఖండించుటగాని, జరుగలేదు. ఇది వరలో యీ వాక్యపుటర్థమును శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారు మరియొక విధముగా చెప్పిరి.[13] విరియాల ఎఱ్ఱడు బొట్టుబేతని వైరిని చంపి, బొట్టుబేతని కొరవి దేశమున ప్రతిష్ఠించి, దానికి ఫలముగా ఆతనిచే వాని 'పేరు' గుర్తుకల పేరు, తన 'దాయము' నకు పెట్టుకొనే అనుమతిని, కొంతధనమును [గద్యనంబు= బంగారునాణెము], పన్నెండు గ్రామముల 'మొగడుపల్లి' ప్రభుత్వమును పొందినట్లు వారి అభిప్రాయము. సేవకులు తమ ప్రభువుల పేర్లు తమ సంతానమునకు పెట్టుకొనుట కనుమతిని బడయుట సమకాలీన సంప్రదాయము. అట్లే సంఖ్యావాచక పాలనా విభాగములు కూడ క్రొత్తవికావు. కనుక "మొగడుపల్లియు పండ్రడు" అనుదానిని మొగడుపల్లి పండ్రెండు [మొగడుపల్లిల 12] గా ఊహించుటలో పొరపాటులేదు. మరి యీఅభిప్రాయము-

యోగ్యతా యోగ్యతలను పరిగణింపక శ్రీరామమూర్తిగారు విడిచి పెట్టిరి. ఇంతవరకూ యీ అంశమై జరిగిన పరిశోధనను పరిగణింపక పోవుట పాడిగాదు. దానిని వారంగీకరింపనిచో, కారణము చెప్పి విడిచిపెట్టవచ్చును.

వారు పై పద్యమునకు చెప్పిన అర్థము సక్రమమైనదని భావించి, "తత్తనెయురు పేరుపోడగల దాయము బిట్టబగద్యనంబున పత్రిముకు" అనుదానికి, 'ఆ విస్తృతధర్ముడు బొట్టుబేతనికి పొడమగల ఆపద పూర్తిగా నశింపగా గద్దియను కొలుచు సాటిలేని ఎఱ్ఱిన' అను అర్థముచెప్పిన, మధ్యలోనున్న 'పేరు' కు అన్వయము కుదరక పోవుట గమనింపదగినది. శ్రీరామమూర్తిగారు 'తత్తనెయురు' పదమునకు ముందున్న 'ప్రతిష్ఠసేసి' అను పదమును 'పేరు' కు ముడిపెట్టి, పేరుప్రతిష్ఠచేసి అని అన్వయించి, 'నిలబెట్టి' అను అర్థము చెప్పుట జరిగినది. కాని పద్యమున 'ప్రతిష్ఠసేసి అనునది కొరవిదేశమున 'ప్రతిష్ఠింప' బడిన బొట్టు బేతనికి సంబంధించినట్టిది. కనుక శ్రీరామమూర్తిగారు సవరించిన సవరణలు యథాతథా కవిపాఠమును వెల్లడించున వనుకొనుట ప్రమాదము. ఇందలి ముఖ్య విషయమైన బొట్టు బేత కొరవిదేశమునందు ప్రతిష్ఠింపబడుటను గూర్చి నాల్గవ పద్యము తరువాత చర్చింతము.

ఇక నాల్గవ పద్యము. దీనికిని మూడవ పద్యమునకు ఆంతరిక సంబంధము కలదు. దీనికిని రెండవ పంక్తిలో తొలి భాగము కొద్దిగా పగిలిపోయినది. ఇచ్చటి పదము 'మేల్గరుడని' అని యుండుట సాధురూపమని శ్రీరామమూర్తిగారు పేర్కొనిరి. శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారు గతములో నొక సందర్భమున యీ పదమును 'మెయ్గరుడని' చదువుట యుక్తమేమోనని సందేహింపగా,14 శ్రీరామమూర్తిగారు అట్టిసవరణను 'కృతకము,అధికప్రయత్నము' అని నిరసించిరి. అది 'మెయ్గరుడని' అగుచో కవి ఎట్లు వ్రాసి యుండెడివాడో, లేఖకుడు ఎట్టి పొరపాట్లు చేయుటకు సావకాశముండెడిదో కూడి 'ఊహించి' చెప్పి, తుదకు యిచ్చట పేర్కొనబడిన వారు 'గరుడ బేతరాజే' అని నిర్ధారించినారు. వారి వాదాన్ని గమనించండి—"గరుడని బేతరాజు అనగా గరుడని కొడుకు బేతరాజు అని ఒక అర్థము వచ్చును. గరుడనికి సంబంధించిన బేతరాజు అని మరొక అర్థము వచ్చును. గరుడ లాంఛనము కల బేతరాజు అని కూడ అర్థము వచ్చును. గరుడ లాంఛనము కల బేతరాజు గరుడ బేతరాజు అగును. గరుడని బేతరాజు కూడ అగును." వీరు చెప్పటానికి ముందే శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారు యీతనిని గరుడ బేతరాజుగా పేర్కొనటం జరిగింది.15 ఆ విషయం శ్రీరామమూర్తిగారు గుర్తించే వుండాలి మరి. కాని శాసన పద్యమున నున్నదేమి? వీరు వ్యాఖ్యానించుచున్నదేమి? సందిగ్ధములైన సవరణలను యథాతథా కవి పాఠములుగా భ్రమింప జేయుటకు చేయుచున్న ప్రయత్నమిది; నిరసింపదగినది. అసలు శాసన శిలలో అచ్చటి అక్షరము పగిలిపోయినది. చేర్చబడిన అక్షరములతోనే సమన్వయము సాధింపబడుచున్నవి. శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారు కూడ యిచ్చట "గరుడ" అను ప్రాతిపదికపై "అని" అను తెలుగు అవ్యయముతో సంధి చేయబడి, "గరుడని" రూపము వాడబడియుండునని పేర్కొన్నారు.16 బయ్యారం చెఱువు శాసనమున కాకతి మొదటి బేతరాజు 'గరుడ బేతరాజు'గా పేర్కొనబడుటవలన వీరిట్లూహించి వుండవచ్చును. కాని యిచ్చటనున్న అక్షరము వారు పేర్కొన్నదే వుండి యుండునని భావించినను "మేల్గరుడని బేతభూవిభుని కాకతి వల్లభుబిన్నవాని" అనుదానికి పై గుర్తింపు ఎంతవరకు సమర్థనీయము? గరుడని బేతభూవిభుని, కాకతివల్లభు, బిన్నవాని అని పదచ్ఛేదము చేసిన యెడల దీనిముందున్న 'మేల్'నకు ఏమి అర్థము చెప్పవలసి యుండును? ఐదవపద్యమున నపయోగింపబడిన పడికట్టు పదమైన 'మేలుగ' వంటిదే అందురేమో! అయినను యిన్ని ప్రశ్నలుండి యీ మేలును కామవసాని యొక్క మేలుగా చెప్పి, దీనిని గరుడ బేతగా చిత్రింపవలసిన ఆవశ్యకత ఏమి వచ్చిపడినది? బేతడు, కాకతివల్లభుడు, బిన్నవాడు మరొకడు తత్కాలమున లేని పక్షమునను, విరియాల ఎఱ్ఱనకును ఆతనికిని కాలమున వ్యత్యాసమున్నను యిట్టి సందేహాస్పద విషయములను పరిశీలింపవచ్చును. కాని కాకతి వంశీయుడైన రెండవ బేతనితో యీ చారిత్రకాంశము సమయానుకూలమై ఒప్పుచుండ, యింత నిష్కారణ, నిరర్థక ప్రయత్నము దేనికో! శ్రీరామమూర్తిగారు విస్మరించినను శ్రీ శాస్త్రిగారు మరింత పరిశీలనజేసి అయిదవ పద్యమున పేర్కొనబడిన 'గరెండయరాజు' కూడ నీ మొదటి బేతరాజే అని పేర్కొనిరి.17 అంతటితో నాగక మరింత ముందునకుపోయి, శ్రీ కొల్లూరు హర్షవర్ధన శర్మగారితో నేకీభవించి ఆపద్యమున పేర్కొనబడిన 'రవ్వనృపు' డీతడేఅని గ్రహింపవలసి యున్నట్లు చెప్పిరి.18 ఫలితముగా గరుడబేత, గరెండయరాజు, రవ్వనృపు లొక్కరే అనియు ఆతడే విరియాల ఎఱ్ఱ, కామవసాని, సూరలచే సహాయమందెననియు భావింపవలసి వచ్చును. కాని యీ అభిప్రాయము నిలుచుటకు విరియాల, కాకతీయ, ముదిగొండ చాళుక్యుల కాల నిర్ణయము లెంతమాత్రము సరిపడవు. అయినను గతమున యీ కాల నిర్ణయ విషయమై మిక్కిలి విమర్శించిన శ్రీ శాస్త్రిగారి చర్చకు 19 మేమింకను సమాధానమీయవలసి యున్నది; కనుక ప్రస్తుతమున కది విషయముకాదు.

కనుక, శాసనపు అర్థము కాకపోయినను, నేనేకీభవింపక పోయినను, యిందు పేర్కొనబడినది ప్రస్తుతమునకు 'గరుడ

బేతడ' నియే భావింతము. ఇచ్చట 'అరుదగునట్టి' అను పదము ఎఱ్ఱనృపునంగన కామవసానికి సంబంధించినది. అసామాన్యురాలైన కామవసాని అని భావం. కాని శ్రీరామమూర్తిగారు దీనిని కామవసాని యొక్క 'మేలు' కు ముడిపెట్టిరి ; ఆ 'మేలు' పైన పేర్కొనబడిన 'మేల్గరుడని' నుండి విడగొట్టబడినది ; ఆ అసామాన్యమైన కామవసాని, కాకతి వల్లభుడు చిన్నవాడు అయిన బేతరాజును చేతబట్టి ఘనుడైన పల్లవరాయని యోగిని ఆశ్రయించి, చక్రవర్తియైన భాస్కర విభుని దర్శించి కాకతిని నిలుపుట కోటి సేయునని తాత్పర్యము. 'పల్లవరాయనియోగి' అను పదము చరిత్రానుకూలము కాదని భావించి, శ్రీరామమూర్తిగారు దానిని 'బల్లహరాయనియోగి' గా సంస్కరించిరి. అసలిట్లు సవరించుటకూడ ఎన్నడో జరిగినది.[20] ఈ సవరణవి ఆమోదించటం చాల తొందరపాటుచర్య అవుతుంది. ఇదేప్రాంతాల్లో సమకాలీన కన్నడ శాసనాల్లో ఒక 'పల్లవరాయుడు' కానవస్తున్నాడు.[21] కుమార సోమేశ్వరుడంతటివాడుకూడ లేముల వాడలోని అరికేసరిదేవునికి దానము సమర్పించడానికి, యీ పల్లవ రాయుని అనుమతిని పొందటము జరిగింది.[22] కనుక 'పల్లవ రాయు' ని గూర్చి చెప్పేముందు యింకా విపులమైన పరిశీలన చాల అవసరము. శ్రీరామమూర్తిగారు వారి వాదము చెప్పుచు 'బల్లహ రాయనియోగిని ఆశ్రయించునది, చక్రవర్తియైన భాస్కరవిభుని దర్శించునది, ఆ కాలమునందు స్త్రీ కాద'ని పేర్కొన్నారు ; వారి అభిప్రాయమున యీ ఘనకార్యములన్నియు ఎఱ్ఱనివే ; ఈనిర్ణయ ములనువారెట్లు గావించిరో అంతుబట్టదు. కాకతీయరాజ్య చరిత్రలో స్త్రీలునిర్వహించిన పాత్రను గుర్తించిన ఎవ్వరునూ పై వాక్యము నంగీకరింపరు. 'సిద్ధేశ్వరచరిత్ర'ది కథనములుకూడ పై చారిత్రక సంఘటనలను తలపింపజేయుట గమనింపదగినది. కనుక శ్రీరామ మూర్తిగారి వాదన ఆధారరహితము. మీదుమిక్కిలి కామవసాని యీ ఘనకార్యమును ఎఱ్ఱనికి ముడిపెట్టినారు. అది మరింత అసందర్భమైనది. కాకతిబేతనట్టి నిస్సహాయ స్థితికిచేరుటకు మూల కారణమే ఆ విరియాలఎఱ్ఱడు. పై పద్యమున చెప్పబడినట్లు అతడు కొరవిదేశమున కాకతీయులకు స్థానములేకుండ చేయుటవలననే యీస్థితి యేర్పడినది; తమ బాంధవ్యమును పురస్కరించుకొని కామవసాని నడుముకట్టి కాకతి రాజ్యపునర్వ్యవస్థీకరణ కుద్య మింపవలసి వచ్చినది.

శ్రీరామమూర్తిగారు పైమూడు, నాలుగు పద్యములనొక్క ప్రకరణముగా చెప్పి, రెంటింటిలో వర్ణితములైన ఘనకార్యములను ఎఱ్ఱనరేంద్రునివిగా వివరించినారు. కానిఅది అంగీకారయోగ్యమైన వివరణ కాదు. మూడవ పద్యమున ఎఱ్ఱనరేంద్రుడు బాధ్యత వహించిన కార్యమును, నాల్గవ పద్యమున కామవసాని చేబూని సాధించిన దుర్ఘట రాజకీయ బాధ్యతను వర్ణించుచున్నవి. ఎఱ్ఱనరేంద్రుడు బొట్టు బేతరాజును చేతబట్టి, అతని శత్రువును చంపి, అతనిని కొరవిదేశమున ప్రతిష్ఠించి, అతని మన్ననలు బడసెనను నది మూడవ పద్యార్థముకాగా, అసామాన్యమైన కామవసాని (తన బంధువైన) కాకతి వల్లభుడు, చిన్నవాడు అయిన బేతరాజును చేకొని, పల్లవ రాయుని ద్వారా భాస్కర చక్రవర్తిని దర్శించి, అతని సహకారముతో కాకతి వంశమును నిలబెట్టెననుట నాలుగవ పద్యార్థము. ఇందు ప్రస్తావింపబడినవి యిరువురు శత్రువుల రాజకీయమునకు సంబంధించిన భిన్న విషయములు. ఈ రెండు ప్రక్కల రాజకీయములను వివిధ దశలలో వేర్వేరుగా నడిపినది విరియాల దంపతులైన ఎఱ్ఱనయు, కామవసానియును. ఈ విషయ మును గతములో శ్రీ లక్ష్మీనారాయణగారు[23], శ్రీ పరబ్రహ్మశాస్త్రి గారు[24], శ్రీ సోమసుందరరావుగారు[25] సక్రమముగా సమన్వ యించిరి. వానిని పరిగణింపని కారణముననో, క్రొత్త వివరణ కల్పించుయత్నముననో, శ్రీరామమూర్తిగారు పై రెండు పద్యము లందలి రాజకీయాంశములను ఎఱ్ఱనృపునికే అన్వయించిరి. ముందు పద్యమున శత్రుసంహారము జరుగగా, తరువాతి పద్యమున అన్య సహకారము లభించినదట; ఎందులకో? పైగా రెండు పద్యము లందును కార్యసిద్ధుడైనది ఒకే బొట్టుబేతడట ; బొట్టుబేతనికి 'గరు డని' విశేషణ ముండుట అసంభవము కూడ కాదట; కనుక ఆ కాకతి వల్లభుడు, బొట్టు ఉరపు గరుడని బేతరాజట ;;

పైన పేర్కొనినది శ్రీరామమూర్తిగారు ఊహాగానము చేయక, యథాతథముగా శాసన పద్యార్థమున కనిపెట్టి వివరించిన చారిత్రక విశేషము. ఇది పూర్తిగా నిరాదరణీయము. పై మూడవ పద్యమున పేర్కొనబడిన 'బొట్టుబేత' ముదిగొండ చాళుక్య వంశీయుడు. అతడే ఎఱ్ఱనృపునిచే సహాయ మందినవాడు. నాలుగవ పద్యమున కామవసాని ద్వారా సహాయము బడసినవాడు 'కాకతి బేత'. ఈ అంశమిదివరలో గుంటూరులో జరిగిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెసు ఐదవ వార్షిక సమావేశమున చర్చింపబడినది.[26] ముదిగొండ చాళుక్య, కాకతీయ వంశములలో నొకే సమయమున 'బేత' నామధారులైన యిరువురు రాజులు కొరవి రాజ్యమున తల పడుటయే, యీ శాసన పద్యమందలి చారిత్రక విషయమున తిక మకకు కారణమైనది. శ్రీరామమూర్తిగారు దానిని గుర్తింపలేదు. ఈ విషయమై వీరి అభిప్రాయాన్ని గమనించండి — "కాకతీయ రాజైన మొదటి బేతరాజునకు గరుడ బేతరాజు అను వ్యవహారము కలదనుటకు శాసనాంతర ప్రమాణము కలదు. బొట్టు బేతరాజు అను వ్యవహారమును కలదనుటకు శాసనాంతర ప్రమాణము కానరాదు. కలదనుటకు మాత్రమేకాదు, లేదనుటకు కూడ శాసనాంతర ప్రమా

ణము కానరాదు (?). అంతేకాదు. మొదటి బేతరాజునకు సమకాలము నందుగాని, సమీప పూర్వకాలమునందుగాని మరొక బొట్టు బేత కల డనుటకునైన శాసనాంతర ప్రమాణము కానరాదు. కానవచ్చిన ముదిగొండ చాళుక్య రాజులలోని బొట్టు బేతరాజును బట్టి, కాకతీయ రాజైన మొదటి బేతరాజునకు సమకాలము నందు మరొక ముది గొండ చాళుక్యుడైన బొట్టుబేత ఉండునని ఊహామాత్ర శర ణ్యము." దీనిబట్టి ముదిగొండ చాళుక్య వంశములోని బొట్టుబేత లెందరో వారి వివరములేవియు శ్రీరామమూర్తిగారు పరిశీలింప లేదనుట స్పష్టము. గతములో శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారు,[27] వారి ననుసరించి సందిగ్ధ పరిస్థితులలో మేము,[28] ముదిగొండ చాళుక్య వంశమున తత్కాలమున ఒక బొట్టు బేతని కానక యీ అవసరము గడుపుటకై ఒకనిని క్రీ॥శ॥ 985-1000 ప్రాంతమున కల్పించితిమి. కాని తర్వాత, యిందలి విషయములన్నియు శాసనములందు కాన వచ్చుచున్న తర్వాతి బొట్టు బేతరాజునకు సరిపడుటచే, మేము ముందే సందేహించిన శ్రీ శాస్త్రిగారి అభిప్రాయము విడిచిపెట్టి, పైనన్నివేశమును క్రీ॥ శ॥ 1075-1100 ప్రాంతముననున్న బొట్టు బేతరాజునకు సరిచేసితిమి.[29] ఈ వివరణలన్నింటికి మూలాధారము ముదిగొండ చాళుక్య, విరియాలవంశీయుల కాలనిర్ణయ వివరములు మాత్రమే. గూడూరు[30], కటుకూరు[31], కొండిపర్తి[32] శాసనాంశముల నన్నింటినీ పరిశీలించియే విరియాలవారి కాలనిర్ణయము చేయుట జరిగినది. దానిని బహుశః శ్రీరామమూర్తిగారు పరిశీలించివుందరు. మేమిచ్చిన కాలనిర్ణయాన్ని గమనించండి.

దుర్జయ
|
పొటంటి వెన్న
|
ఎఱ్ఱ
|
విరియాల భీమ
|
ఎఱ్ఱ+కామవసాని (క్రీ. శ. 1050-1075)
|
సూర (1075-1100)

పోలి | మల్ల | బేత+బెజ్జమాంబ (1100-1124)

సూర | మల్ల | పోలి | కొమ్మ
(1124 - 1150)
|
అన్నయ+ఐతమ (1150-1175)
|
మైలమాంబ+మల్యాల చౌండ
(1175-1202) 1203, 1205

ఎఱ్ఱ నృపతి, కామవసానులు బొట్టుబేత, కాకతి బేతలకు సహాయపడుట క్రీ॥ శ॥ 1050 - 1075 ప్రాంతముననూ, సూరడు బేతనికి సహాయపడిన కాలము క్రీ॥ శ॥ 1075 - 1100 ప్రాంతము ననూ, ప్రస్తుత శాసన మిచ్చిన విరియాల మల్లడు క్రీ॥ శ॥ 1124 - 1150 ప్రాంతమున నుండుటయు జరిగినవని పై కాల నిర్ణయమున సూచింపబడినది. శ్రీరామమూర్తిగారు, శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారి వలెనే యిందలి కాకతి బేతని, గరుడ బేతడని గుర్తించుటవలన ఎఱ్ఱ, కామవసానుల కాలమును 1005 ప్రాంతమునకు కుదించవలసి వచ్చినది. ఫలితముగా 1124 - 1005 = 119 సంవత్సరముల కాలమును మూడు తరముల కాలముగా చెప్పి, తరమునకు 40 సం॥ పరిగణింపవలసి వచ్చినది. చరిత్రలో కాల నిర్ణయ పరిగణనకు యీ సంఖ్య అసాధారణమైనది. కనుక పరిహరింపదగినది.

శ్రీరామమూర్తి గారు ముదిగొండ చాళుక్య వంశమున తత్కాలముననున్న బొట్టుబేత రాజునుగూర్చి శాసనాంతర ప్రమాణమును సందేహించినారు. కాని ఆ సంశయమక్కరలేదు. శాసన ప్రమాణమున్నది. శ్రీ లక్ష్మీనారాయణగారు 'కుసుమాదిత్యుని కుకనూరు తామ్రపట్టికల'ను పేర ప్రకటించిన శాసనమును[33] విపులముగా శ్రీ పరబ్రహ్మ శాస్త్రిగారు మరల 'క్రివ్వక శాసనము' ను పేరిట 'భారతి' లో ప్రకటించిరి.[34] అందిరువురు బేతరాజులు కలరు. మా కాలనిర్ణయము ననుసరించి మొదటి బేతరాజు క్రీ॥శ॥ 1075 - 1100 ప్రాంతమువాడగును. రెండవ బేతరాజు క్రీ॥ శ॥ 1125 - 1150 ప్రాంతమువాడగును. అందువలన మొదటివానితోడనే పై అంశమునకు సంబంధమున్నదని భావించుచున్నాము. అయితే వీరు 'కొరవిపురవల్లభులు' గా తెలియుచున్నను, ప్రత్యేకముగా నాతనికి బొట్టు' శబ్దముపేరు ముందులేదు. కాని తరువాత వారు నత్తరామేశ్వర,[35] శ్రీకాకుళ శాసనములలో[36] 'బొట్టు'లే తమ నామములముందుంచుకొనుటను బట్టి, బొట్టు బేత, బొట్టు నాగతిరాజు, బొట్టు శ్రీరామభద్ర మున్నగువారివలెనే వీరి సమీప పూర్వీకుడైన పై బేతనివాడ బొట్టు బేతగ పరిగణించుట జరిగినది. కనుక ఆకాలమునకు సరిపడునట్లు ముదిగొండ చాళుక్య వంశములోని బొట్టుబేతని గూర్చిన శాసన ప్రమాణమున్నది. మీదుమిక్కిలి తత్కాలమున కొరవిపాలకులువీరే. "కొరవియన్నది ముదిగొండ చల్కులకులసంత" అని కొరవి శాసనవాక్యము.[37] ఇచ్చటి 'బొట్టు' అనునది స్థలనామము. పాల్వంచ తాలూకాలోని అడవిలోనేదో ప్రాంతము కావచ్చును. 'బొట్టున వానిప్రధానులు' అని క్రివ్వక శాసనవాక్యము.[38]

గతమున ముదిగొండ చాళుక్యుల వివరములేవియు తెల్లియని కారణమున శ్రీ హర్షవర్ధన శర్మగారు,[39] శ్రీ వేంకటరాయశాస్త్రి

గారు 40 కూడ యిందలి 'బొట్టుబేత' ను కాకతి వంశీయులైన మొదటి బేతగను, రెండవబేతగను అభిప్రాయపడిరి. వారట్లు అభిప్రాయపడుటకు కారణము మొగలుచెఱువుల శాసనము41 న నున్న ముదిగొండ చాళుక్య వంశీయులు నాలుగవకుసుమాదిత్యునితో నంతమైనట్లు భావించుటయే కాదగును. కానిముదిగొండ చాళుక్యుల విషయము క్రివ్వక శాసనమునుబట్టి తెలిసిన పిమ్మట అది అసమంజసమని నమ్మి, శ్రీ లక్ష్మీనారాయణగారు,42 శ్రీ పరబ్రహ్మ శాస్త్రిగారు,43 శ్రీ సోమసుందరరావుగారు44 యీ శాసనమందలి 'బేత' ల నిరువురిగా గుర్తించిరి. సమకాలీన సన్నివేశమునుబట్టి వారి నిర్ణయము యథార్థమేనని తేటతెల్లమగుచున్నది.

ఈ గూడూరు శాసనములోని మూడు, నాలుగు పద్యముల వెనుకనున్న చారిత్రకాంశమిది- ఒక పరిస్థితిలో కొరవిపాలకుడైన బొట్టుబేత తనరాజ్యమును కోల్పోగా విరియాల ఎఱ్ఱడాతనికి కొరవిని తిరిగి సాధించుకొనుటలో తోడ్పడి, ఆతనిచే బహుమతులు బడసెను. ఆ శత్రువు కాకతీయుడు కావచ్చును, కాకపోవచ్చును. కాకతీయుడనియే శ్రీ పరబ్రహ్మ శాస్త్రిగారి అభిప్రాయము. అది యింకనూ పరిశీలింపదగినది. అదిఅట్లుండ కామవసాని చిన్నవాడైన కాకతిబేతని తోడ్కొని పల్లవరాయుని తోడ్పాటుతో చాళుక్య చక్రవర్తి ద్వారా కాకతి రాజ్యమును నిలుపుట సంభవించినది.

కనుక విరియాల ఎఱ్ఱని ద్వారా లబ్ది పొందిన బొట్టుబేత ముదిగొండ చాళుక్యుడు. కాకతి బేతకాడు. కాని శ్రీరామమూర్తిగారు పొరపాటున ఎఱ్ఱడు చంపిన కొరవి యందలి శత్రువే ముదిగొండ చాళుక్య రాజు కావలెనని పేర్కొనిరి. ఇచ్చటనే చారిత్రకాంశము దారుణముగా తారుమారైనది. మనము గుర్తింపవలసినది యీ శాసన పద్యములందలి బొట్టుబేత, కాకతి బేతలు భిన్నవ్యక్తులను చారిత్రక విషయము.

ఇక మిగిలిన ఐదవ పద్యము ప్రస్తుత చర్చ కనవసరము. ఇందు 'మేలుగ' అనునది పడికట్టు మాటగా శ్రీరామమూర్తిగారు పేర్కొనిరి. కావచ్చును. కాని పద్యమునందలి ఆఖరి పంక్తికి వీరిచ్చిన వివరణ పరిశీలింపదగియున్నది. 'రెండయరాజు సంగడు'లన రెండయరాజు దోనెలనియు, ఏరు దాటుటకు సంగడులు కావలెను కనుక రవ్వనృపతిద్వారా సూరడు గ్రామములతోపాటుగా రెండయరాజు సంగడులు బడసెనని చెప్పినారు. ఇచ్చట అస్పష్టత యేర్పడినది. దీనిని శ్రీ శాస్త్రిగారు 'గ రెండయరాజు' అను కన్నడ ప్రయోగముగా పేర్కొన్నారు.46 'సంగడి' శబ్దమునకు మైత్రి అనునర్థము చెప్పబడి, సూరనికి 33 గ్రామముల ఆధిపత్యము, నేరెడు, బోటిపాడు, బేకుమావిడ్లు, గరెండయరాజు యొక్క మైత్రి చేకూరినట్లు సూచించిరి. 'నేరెడు' అనునది 'నేలెడు' అని కాదగునని కొందరి సూచన.47 'బేకుమావిడ్లు' అనుదానిని 'పేకుమావిడ్లు'గా చదువవలెనేమో। నేరెడు, బోటిపాడు, బేకుమావిడ్లు అనునవి స్థలనామములుగా భావింపవలెనేమో యోచింప వలసియున్నది. వానిని శ్రీరామమూర్తిగారు 'మామిడిచెట్లు, నేరెడుచెట్లు' అని చెప్పిరి. అదే ప్రాంతపు శాసనములో ఒకచోట 'పేకుంబెడ్ల' అని చెప్పబడినది.48 అది 'పేకుమావిడ్ల' కానోపును. కనుక యిందలి స్థలనామములు గుర్తించు ప్రయత్నమింకనూ జరుగవలసియున్నది.

అధోజ్ఞాపికలు

1. సి. టి. ఐ. భాగము I, పుట 15
2. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, వాల్యూం 51 (1962-63) పే. 57
3. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, వాల్యూం 51 (1962-63) పే. 73
4. భారతి, మే, 1975, పే. 48
5. ఆంధ్రప్రతిక, (ఉగాది సంచిక), 1970-71, పే. 6
6. ఎపిగ్రాఫియా ఆంధ్రికా, వాల్యూం II, పే. 39
7. భారతి, మే, 1972, పే. 45, ది కాకతీయాస్ ఆఫ్ వరంగల్ పే. 147
8. ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెసు ప్రొసీడింగ్స్, వాల్యూం, 1980, పే. 35
9. భారతి, డిసెంబరు, 1981. పే. 10
10. భారతి, డిసెంబరు, 1981, పే. 10
11. భారతి, డిసెంబరు, 1981, పే. 10
12. ఎ. ఆర్. ఇ. నెం. 86 ఆఫ్ 1958-59
13. 'తెలుగు శాసనాలు', పే. 81

14. భారతి, డిసెంబరు, 1981, పే. 10
15. 'ది కాకతీయాస్ ఆఫ్ వరంగల్'. పే. 147
16. భారతి, డిసెంబరు, 1981, పే. 10
17. ,, ,,
18. ,, ,,
19. ,, ,,
20. 'ఇన్‌స్క్రిప్షన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' వరంగల్లు, నెం. 27
21. 'కన్నడ ఇన్‌స్క్రిప్షన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' నెం. 11, ఎ. ఆర్. ఇ. నెం. 161 ఆఫ్ 1946_47
22. 'కన్నడ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' నెం. 11 ఎ. ఆర్. ఇ. నెం. 161 ఆఫ్ 1946_77
23. ఎపిగ్రాఫియా ఆంధ్రికా, వాల్యూం II, పే. 39
24. భారతి, జనవరి, 1980, పే, 33, భారతి, డిసెంబరు, 1981, పే. 10
25. ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెసు ప్రొసీడింగ్స్ వాల్యూం, 1980, పే. 35
26. ,, ,, ,,
27. భారతి, జనవరి, 1980, పే. 33
28. భారతి, జనవరి, 1981, పే. 57
29. ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెసు 'ప్రొసీడింగ్స్‌వాల్యూం, (1980) పే. 35
30. ఎ. ఆర్. ఇ. నెం. 108 ఆఫ్ 1960 _ 61
31. ఎ. ఆర్. ఇ. నెం. 86 ఆఫ్ 1958_59
32. ఎ కేటలాగ్ ఆఫ్ ఇన్‌స్క్రిప్షన్ కాపీడ్ అప్ టు 1964, నెం. 244
33. ఎపిగ్రాఫియా ఆంధ్రికా, వాల్యూం II, పే. 39
34. భారతి, నవంబరు, 1979, పే. 32
35. ఎ. ఆర్. ఇ. 723 ఆఫ్ 1930; ఎస్. ఐ. ఐ. వాల్యూం X, నెం. 262
36. ఎస్. ఐ. ఐ. వాల్యూమ్ IV, నెం. 961
37. ఎపిగ్రాఫియా ఆంధ్రికా, వాల్యూం I, పే. 142
38. భారతి, 1979, నవంబరు, పే. 32
39. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక, వాల్యూం 51, (1962_63) పే. 57
40. ఆంధ్రపత్రిక, ఉగాదిసంచిక, 1970_71, పే. 6
41. ఇండియన్ ఏంటిక్వెరీ, వాల్యూం XXXII, పే. 282
42. ఎపిగ్రాఫియా ఆంధ్రికా, వాల్యూం II, పే. 39
43. భారతి,జనవరి,1980, పే. 33,భారతి, డిసెంబరు, 1981 పే.1
44. ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెసు ప్రొసీడింగ్స్ వాల్యూం 1980, పే. 35
45. భారతి, డిసెంబరు, 1981, పే. 10, భారతి, జనవరి, 1980 పే. 33
46. భారతి, డిసెంబరు, 1981, పే. 10
47. తెలుగు శాసనాలు, పే. 81
48. సి. టి. ఐ. వాల్యూమ్ II, నెం. 54

కలగూరగంప

"మాల పున్నమ" పద వివరణ

ఫిబ్రవరి 1983 భారతిలో శ్రీ జానగాని కాటమయ్యగారి "అనంతపురం జిల్లాలో మాలపున్నం పండగ" వ్యాసం చదివి, అందులోని లోటుపాట్లు సవరించడానికి ఈ క్రింది వివరణ వ్రాస్తున్నాను.

1. మాలపున్నమ రాయలసీమలో చాలా చోట్ల జరుపుతారు. నేను కర్నూలు జిల్లా వాడను. కాబట్టి ఈ మాట అంటున్నాను.

2. మాలపున్నమ భాద్రపద పూర్ణిమ. శ్రీ కాటమయ్యగారు ఆశ్వయుజ మాసంలో వస్తుందన్నారు. అది సరిగాదు.

3. ఈ పండుగ మాలమాదిగవారు ఎక్కువ ఆసక్తితో జరుపుకుంటారనేది నిజం. వీరు భాద్రపద పూర్ణిమనాడు పొద్దుననే గంపలలో పూలు వేసికొని ఇంటింటి ముంగిట్లలో వెదజల్లిపోతారు. మధ్యాహ్నం విందు భోజనం పెట్టండని వస్తారు. నేను గత 40 ఏండ్లనుంచీ అనంతపురం పట్టణంలో తోటివాండ్లు ఇట్లు చేస్తూవుండడం చూస్తున్నాను. మాలమాదిగలే ఎక్కువగా ఎందుకు పాటిస్తారు. పూలెందుకు చల్లుతారు. అనే విషయాలు నేను పరిశీలించియున్నాను. ఇక్కడ ఒక ఆసక్తికర విషయంవుంది. అది ఇది.

4. భాద్రపద పూర్ణిమ మాలాపూర్ణిమ. మాల అంటే పూలహారం. తెలుగు మాలపున్నమ సంస్కృత 'మాల' శబ్దం తెలుగులో ఒకకులం అర్థం ఇచ్చేదిగా ఆ కులంవారు భావించి అది తమ, పున్నమ అని ప్రత్యేకశ్రద్ధతో పూలను వెదజల్లుతూ పాటిస్తున్నారు. నిజానికి మాలపున్నమ సర్వకులాలవారి పండుగ.

5. భాద్రపద పూర్ణిమ నుండి యావద్భారత దేశంలోనూ ఫ్లవర్ షోలు (పుష్ప ప్రదర్శనలు) బెంగుళూరు, ఢిల్లీ, లక్నో, శ్రీనగరు లాంటినగరాలలో విస్తృతంగాజరుగుతాయి. ఈ ఉత్సవాలు ప్రతి సంవత్సరమూ చూడవచ్చు. ఇది యావద్భారత పర్వదినం అనేది దీనినుండి స్పష్టం.

6. శ్రీ కాటమయ్యగారు పండుగను పండు + అగు అని అనుకొని పండువు → పండుగు → పండుగ అని ఇచ్చినారు. అది సరికాదు. సరియైన రూపాంతర మిస్తున్నాను.

పర్వ → పడ్వ (ర,డలకు భేదం లేదు అనే సూత్రం ప్రకారం) → పడువ → పండువ → పండుగ (పండువ, పండుగలు రూపాంతరాలు). మరాటీ భాషలోని "గుడి పడువా" (గుడి పండుగ) అంటే మన ఉగాది. అంటే పండుగ అనేది పర్వశబ్ద వికృతి అని అర్థం.

7. "పబ్బ" (పండుగ) అనే పదమూ 'పర్వ' నుంచి వచ్చిందే. పర్వ → పర్బ → పబ్బ. (నిర్భరము → నిబ్బరము → అర్పణము - అప్పణము అయినట్లుర్బ-బ్బ అయినది)

"త్రి"

జిన శబ్దం బుద్ధుని రూఢిపదం కాదు?

'జినుడు' అనగా బుద్ధుడని తెలుగు నిఘంటువులు పేర్కొనుచున్నవి. అమరసింహుడుకూడా బుద్ధుని 18 నామములలో 'జినః' అని బుద్ధ పర్యాయ పదంగా వ్రాశాడు.

"సర్వజ్ఞ స్సుగతో బుద్ధో
ధర్మరాజ స్తథాగతః ।
సమంత భద్రో భగవా న్మారజిల్లోక జిజ్జినః ।
షడభిజ్ఞో దశబలో ద్వయవాదీ వినాయకః ।
మునీంద్ర శ్శ్రీఘనశ్శాస్తా మునిః.... ।

ఈ 18 పేర్ల తరువాత 7 శాక్య బుద్ధుని పేర్లు పేర్కొన్నాడు.

" .... శాక్యముని స్తుయః ।
సశాక్య సింహ సర్వార్థ సిద్ధశ్శౌద్ధోద నిశ్చసః ।
గౌతమశ్చార్క బంధుశ్చ మాయాదేవీ సుతశ్చసః ॥

బుద్ధుడు, శాక్య బుద్ధుడు, గా కాక మొదటి 18 పేర్లలోనూ తరువాతి 7 పేర్లలోనూ కలిపి కొన్ని పేర్లు బుద్ధునికి పర్యాయ పదములుగా వాడబడుచున్నవి. మొత్తంగా 18 + 7 = 25 పేర్లు ఒకే బుద్ధునిగా పేర్కొనుటకు వీలులేదని అమరసింహుడు గ్రంథాది యందే శాసించి యున్నాడు. "త్వం శాథాదిన పూర్వ భాక్ 'తు,' శబ్దము అంతమందును 'అథ' శబ్దము అది యందునుగల శబ్దము పూర్వపదముతో సంబంధించదు అని అర్థం.

" — — — — — — — — శాక్యమునిస్తు యః " అనుచోటు నుండి పదములు శాక్యబుద్ధునికి మాత్రమే చెందును. గురుబాల ప్రబోధికా కారుడుకూడా అట్లే వేరు వేరుగా వ్రాసియున్నాడు.

జైనమత మూలపురుషుడైన జినుడు మాత్రమే "జిన" శబ్ద వాచ్యుడుగా లోకమున తెలియబడుచున్నాడు. జిన శబ్దము ఇట్లేర్పడినది. జి = జయే ధాతువు. జయతి భవం జినః, అనగా సంసారమును జయించినవాడని అర్థము. ఈ అర్థము జితేంద్రియు లందరికీ (బుద్ధాదులందరికీ) సామాన్యంగా వర్తిస్తుంది. అయితే బుద్ధునికి రూఢిపదముగా నిఘంటుకారుడు పేర్కొన్న మాత్రమున నిర్ధారించుట, పొసగుటలేదు. ఎందుకనగా 1) జిన శబ్దము జైనమత పరముగా లోకమున గ్రహింపబడుచున్నది. 2) నిఘంటుకారుడు పేర్కొన్న మరియొక బుద్ధపర్యాయపదము "ధర్మరాజః" అనునది లోకమున అసలే ప్రయోగింపబడుటలేదు (బుద్ధ పర్యాయ పదముగా వ్యవహరింప బడుటలేదుకదా)

అమృత చంద్రసూరి, నేమి చంద్రుడు, హేమ చంద్రుడు, కుంద కుందాచార్యుడు మొ॥ గా గల జైనగ్రంథ రచయితలు, తత్త్వవేత్తలు జిన శబ్దమును బుద్ధునిగూర్చి గాక వర్ధమానుడు, తీర్థంకరులను గూర్చి ప్రయోగించిరి. బౌద్ధులయిన నాగార్జునుడు, ధర్మకీర్తి నాగసేనుడు, జిన శబ్దమును బుద్ధ పర్యాయ పదముగా ప్రయోగించలేదు. సూర్యరాయాంధ్ర నిఘంటువునందు కూడా విశేషమేమియూ తెలుపలేదు. ఇందలి గమకమును విజ్ఞులు గమనిస్తారనే భావిస్తాను.

శ్రీ మేడవరపు సంపత్‌కుమార్

కామశిల్ప కళ - ఒక వివరణ

జనవరి, 1983 "భారతి" లో డాక్టర్ ఘంటా జవహర్ లాల్ గారి "దేవాలయాల్లో కామశిల్పం" చదివాక రాయాలనిపించి రాస్తున్న దిది.

ఏ ప్రక్రియను ప్రవేశపెట్టినా మానవ ప్రయోజనాన్ని ఆశించే. అయితే ఆ ప్రక్రియ ముసుగులో మానవునికి హాని కలిగించే ప్రయత్నంకూడా జరగవచ్చు. విచిత్రమేమిటంటే ఈ రెండుపన్లూ చేస్తున్నవాడు మానవుడే.

మానవభావం సుతిమెత్తనిది. అతి సున్నితమైనది. చెడు వైపుకు ఎక్కువగా ప్రలోభ పడుతుంది. ఇది విశ్వజనీన మానవ భావనైజం. ఇందులో అతిశయోక్తి అవగింజంతైనాలేదు. విడ్డూరం కాని, విపరీతం కాని అసలులేదు. ఇది నగ్నసత్యం:

ఎందరో మనుష్యులు. అందులో ఎందరో పశుతుల్యులు. కొందరు మాత్రమే మనీషులు. ఏ కొందరో మహర్షులు. లోక కల్యాణార్థం ప్రవేశ పెట్టబడే ప్రతి ప్రక్రియా మహర్షి రూపొందించేదే: దానిని గ్రహించి ఆదరించేది మనీషులు. అయితే ఆచరణలో చూపవలసినది ఎక్కువశాతం మనుష్యులు. ఎదగని మనస్తత్వాలు ఒక మంచి ప్రక్రియనుకూడ చెడుకు ఉపయోగించు కొంటాయి.

"న్యూక్లియర్ ఎనర్జీ" ఉంది. ఒకరకంగా అది అమృతం: మరో రకంగా కాలకూట విషం: ఎప్పుడు అమృతమౌతుంది, ఎప్పుడు విషమౌతుంది - అన్నది మనిషిపైనే ఆధారపడి ఉంటుంది.

కవిత్వం ఉన్నది. మనిషిని లోకశ్రేయోక్రియాపరునిగా తీర్చి దిద్దాలన్న తపనతో అది మొదలైంది. స్వార్థంకోసం, స్వప్రయోజనంకోసం అది అశ్లీలమై, అసభ్యమై, క్షుద్రమై, వ్యాధిగ్రస్తమై అలమటిస్తున్నది. మరోపైపు నిత్యమానవ భావిభాగోదయ భావ ప్రేరేపమై విలసిల్లుతున్నది.

ఏదేశ చరిత్ర చూచినా ఒకటిమాత్రం పచ్చినిజం: ప్రబోధాత్మకమైన సుశిక్షణకు ఆదరణ తక్కువ. అది చేదుగుళిక లాంటిది. శిక్షణపేరిట మానవభావాన్ని ఉద్రేకపరచే క్షుద్రగుణానికే ఎక్కువ ఆదరణ. అది తియ్యటి తినుబండారం. ఎప్పటికైనా స్వస్థతను చేకూర్చేది చేదు మాత్రే కాని, తియ్యటి తిండి కాదు. ఆ తిండివల్ల మధుమేహం వస్తుంది. అది వాస్తవ విరుద్ధంకాదు.

అలాగే శిల్పకళ కూడ: అది గోడలెక్కినా, గోపురాలెక్కినా, కొండలెక్కినా, కోటలెక్కినా దాని లక్ష్యం మానవ ప్రయోజనమే: సుసంపన్నమైన మానవ ప్రగతిని మరింత విస్తృతంగా పదిల పరచటమే: విశ్వగతమైన ఆ కళకు లక్ష్యశుద్ధి ఉండవచ్చు, లక్ష్యాన్నీ సాధించవచ్చు: అయితే కళాకారునికి ఉండక పోవచ్చు. అతడు ఏదో ఒకవిధమైన ప్రలోభానికి లొంగిపోవచ్చు. అటువంటప్పుడు లక్ష్యసిద్ధి లభ్యంకాదు.

ఇదీసంగతి. కాబట్టి కామశిల్పకళలోని విపరీతపు పోకడలను విమర్శించడం అనేది ఎంతవరకూ సమర్థించదగిందో ఎవరికి వారే నిర్ణయించుకోవచ్చు. విమర్శించ వలసిందే: చుట్టూ చీకటున్నదని

తెలియజెప్ప వలసిందే; అయితే మినుకు మినుకు మంటున్న నక్షత్రాలను వెలికి తీసుకొని రావడంలోనే ఎక్కువ శ్రద్ధను కనపరచాలి. అదే విశ్వమానవ ధర్మంగా పరిఢవిల్లాలి;

ఒక్క సంగతిచెప్పి ముగిస్తాను. శ్రీ జవహర్‌లాల్ ఉదహరించని కామశిల్ప కళనిగురించి ఒకమాట. పాశ్చాత్యదేశాల్లో సయితం సరిగ్గా అర్థంచేసుకోక విస్మరించబడిన స్త్రీజననాంగంలోని "క్లైటోరిస్" కు ఉన్న విశిష్టతను ఉగ్గడింప జేస్తూ, దాన్ని "స్టిములేట్" చేసి స్త్రీని రతిలో ఎలా తృప్తిపరచవచ్చునన్న అంశాన్ని ప్రస్ఫుటీకరింప జేస్తూ తీర్చి దిద్దబడిన ఎన్నో శిల్పాలున్నాయి. అలాంటి వాటిలో ఒకదాన్ని తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామి ఆలయంలో గాలి గోపురంపైన నేను గమనించాను.

మన శాస్త్రజ్ఞానాన్ని ఈ కామశిల్పాలు తెలియజేయడం లేదా?

డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

ఆర్థర్ కోస్ట్లర్

"ఏమిటి, దేవుడు సెప్టెంబరుకి వెడుతున్నాడా?" అని అడిగాడు నవ్వుతూ ఒక స్నేహితుడు నేను "ది గాడ్ దట్ ఫెయిల్‌డ్ చదవటం చూసి. మేమంతా ఆ మార్చి/ఏప్రిల్ లో పరీక్షలకి వెళ్ళిపోతున్నాము. వాటిని తలుచుకుని అతను చమత్కారంగా ఆ ప్రశ్న వేశాడు. ఆర్థర్ కోస్ట్లర్ కూడా 'వరమీయని వేలుపు' పుస్తకానికి రాసినవాడే. అంతదాకా అతన్ని గురించి కూడా నేను వినలేదు ....

అక్కరకిరాని దైవంమీద కోపం వస్తుందా? గట్టి నమ్మకాలూ, పెద్ద ఆశలూ లేనివారికి ఈ రకం లోపం అర్థంకాక పోవచ్చు. ఆర్థర్ కోస్ట్లర్ నమ్మకం ఎంత లోతయినది? అతని ఆశ ఎంత పెద్దది? 'ది గాడ్ దట్ ఫెయిల్‌డ్' లో కోస్ట్లర్ వ్యాసం చదివిన కొన్ని సంవత్సరాల తర్వాత కాని అతని స్వీయ చరిత్ర చదవలేదు నేను. అంతదాకా అతను ఇంగ్లీషులో రాసి పేరు పొందిన రచయిత అనికూడా నేను అనుకోలేదు. [అసలు ఇంగ్లీషులో రాసి పేరుపొందిన 'విదేశాలవారు' ఎందరున్నారు? ఆర్.కె. నారాయణ్, వి. ఎస్. నైపాల్ లు కొనార్డ్, నబకోవ్ లంత ప్రసిద్ధులయ్యారా?] స్వీయచరిత్ర పుస్తకాలు 'ఆరో ఇన్ ది బ్లూ, ఇన్‌విసిబల్ రయిటింగ్' తో పాటు అతని 'డార్క్‌నెస్ ఎట్‌నూన్, ఎరయివల్ ఎండ్ డిపార్చర్, ది స్కమ్ ఆఫ్ ది ఎర్త్, ది ఏజ్ ఆఫ్ లాంగింగ్, డయలాగ్ విత్ డెత్, ది ట్రెయిల్ ఆఫ్ ది డినోసార్, ది ఘోస్ట్ ఇన్ ది మెషీన్, ది స్లీప్ వాకర్స్, జానస్, ది కేస్ ఆఫ్ ది మిడ్ వయిఫ్ టోడ్, ది లోటస్ ఎండ్ ది రోబట్, ది యోగి ఎండ్ ది కమిస్సార్' ఇంగ్లీషులో చదివాను. ది ఆక్ట్ ఆఫ్ క్రియేషన్ చదువుతూఉంటే పుస్తకం పోయింది. 'స్పార్టకస్' ఫ్రాన్సు భాషలో దొరికితే కొంతదాకా చదివి విసుగుపుట్టి ఆపేశాను. ది కాల్‌గరల్‌స్ చదివేందుకు వీలు కుదరలేదు. 'ది తర్టీన్‌త్ ట్రయిబ్' చదివాను కాని అది అంతగా తలకి ఎక్కలేదు. 'కోస్ట్లర్ ఎట్ సెవెంటీ' అనే వ్యాసాల సంకలనం చదివాను.

పాతిక సంవత్సరాలకి పయిగా ఒక రచయితని చదువుతూ ఉంటే అతని ప్రభావం ఎంతో కొంత ఉండక తప్పదు, కొన్ని భావాలు ఏర్పడక మానవు. ముందు జర్మనీ భాషలో తర్వాత ఇంగ్లీషులో రాసి ప్రఖ్యాతి పొందిన కోస్ట్లర్ తల్లి చెక్ అవిడ, తండ్రి హంగేరీవాడు. మధ్య యూరోపులో వియన్నాకన్నా ప్రసిద్ధ మయిన నగరం ఉండదేమో? ఈ నగరంతో కోస్ట్లర్‌కి ఎక్కువ సంబంధమే ఉండేది. అప్పటి వియన్నా వాతావరణంయొక్క ప్రభావం అతనిమీద ఉండటంలో ఆశ్చర్యంలేదు. కోస్ట్లర్ ఇంచుమించు మధ్య వయస్సులో ఇంగ్లీషుకి మారిపోయి నప్పటికీ అతను అసలయిన 'మధ్యయూరోపువాడు' గానే గుర్తింపబడేవాడు. అతను బ్రిటన్ ద్వీపంలో స్థిరపడిపోయి యూరోపు ఖండానికి దూరమయిపోయిన వాడని ఎవరూ అనుకోలేదు. [కోస్ట్లర్ తన రచనలలో హింస ఉనికిని స్వీకరించటాన్ని కింగ్‌స్‌లీ మార్టిన్ ఒకసందర్భంలో విమర్శించాడు. ఈ విమర్శకి సమాధానంగా మధ్య యూరోపులో హింస అన్నది అపరిచితం ఏమీకాదని కోస్ట్లర్ వివరించాడు.] కోస్ట్లర్ ఇంజనీరు విద్య అభ్యసించి చివరికి ఒకపెద్ద జర్మనీ భాష పత్రికలో విదేశ వ్యవహారాలు చూసుకునే ఉద్యోగం సంపాదించుకున్నాడు. వామ పక్షపు వాదాలమీద అభిమానం ఎవరికయినా కలుగవచ్చు. బూర్జువా జీవితాన్ని కొనసాగిస్తూనే సోషలిస్టుగా చెలామణి కావచ్చు. కోస్ట్లర్ తను ఇలాగే కొంతకాలం జీవించాననీ, ఒకరోజు హటాత్తుగా తను జీవన విధానంమీద వెగటు పుట్టి పూర్తిగా కమ్యూనిజమ్ లోకి దూకటానికి నిశ్చయించుకున్నాననీ తన స్వీయ చరిత్రలో రాసుకున్నాడు. సోవియెట్ యూనియన్‌లో ట్రాక్టరు నడిపే ఉద్యోగం చేద్దామనుకున్నాడుటకాని 'పయివారు' ఆమోదించలేదుట ....

స్పెయిన్‌లో జరుగుతున్న అంతర్యుద్ధంలో కోస్ట్లర్ రిపబ్లికన్ల వయిపు చేరాడు. శత్రుపక్షంవారిచేత పట్టుబడ్డాడు. అతనికి మరణశిక్ష వేశారు. చావుకోసం ఎదురు చూడటం ఎలాగ ఉంటుందో 'డయలాగ్ విత్‌డెత్' లో వర్ణించాడు అతను. అతని అప్పటి భార్య డోరోతీ చేసిన ప్రయత్నాలు ఫలించి కోస్ట్లర్

విడుదల అయ్యాడు. ఆ తరువాత ఇంగ్లాండుకి మారిపోయాడు. అప్పటినుంచే పూర్తిగా ఇంగ్లీషుకి మారిపోయినట్లు తోస్తుంది.

రెండు భాషలలో రచయితగా ప్రపంచఖ్యాతి పొందిన ఆర్థర్ కోస్ట్లర్ ప్రతిభని అంచనా వేసే శక్తి నాకు లేదు. ఒక సామాన్య పాఠకుడిగా మాత్రమే కొన్ని అభిప్రాయాలని వెల్లడించటానికి ప్రయత్నిస్తాను.

కోస్ట్లర్ ఏవిధంగా చూసినా బాగా చదువుకున్నవాడు, మేధావి. అంతేకాకుండా, తాను నమ్మిన ఉద్యమంలోకి అన్నీవదులుకుని దిగినవాడు. [భారతీయులకి ఇదేమీ విశేషంకాదు. లోకమాన్యుడు బాలగంగాధర తిలక్, మహాత్ముడు గాంధీ, యోగి అరవిందుడు, విప్లవకారుడు ఎమ్. ఎన్. రాయి మొదలయినవారి పేరుల జాబితా తయారు చెయ్యటం చాలాతేలిక.] అతని నవలలు కొంచెం 'పొడి' గా ఉన్నట్లు అనిపించినా అవి 'ఎండి' పోయినవి మాత్రంకావు. కథ బాగా నడుస్తుంది, విసుగు పుట్టించే చర్చలు వుండవు, వాస్తవికతగా పిలువబడేది అధికంగానే ఉంటుంది. నీతి కథలలాగ ఉండవు. 'డార్క్‌నెస్ ఎట్ నూన్' లో ప్రధానపాత్ర తన 'నేరా' న్ని ఒప్పుకోవటానికి కారణం విప్లవం తీసుకువచ్చే తన ఆదర్శాలకి ద్రోహం చేశానన్న భావం అతనిలో కలుగటమే. [కోస్ట్లర్ చెప్పిన కారణంకన్నా లూయీ ఫిషర్ చెప్పిన కారణమే ఎక్కువ నమ్మేట్లుగా ఉంటుంది. స్టాలిన్ కొందరిని క్షమించగలనని ఆశపెట్టి, వాళ్లచేత నేరం చేసినట్లు ఒప్పించి చివరికి వారిని చంపించి వేశాడని ఫిషర్ అభిప్రాయం.]

"నేను జూడియో- హెబ్రాయిక్ మతాలలోని నైతిక విలువలని స్వీకరిస్తాను కాని వాటిలోని పిడివాదపు సిద్ధాంతాలని తిరస్కరిస్తాను" అని కోస్ట్లర్ అన్నాడు. అతను ఒక యూదుల కుటుంబంలో పుట్టాడనీ, కొంతకాలం ఇస్రాయిల్‌లో ఉన్నాడనీ, ఈ సందర్భంలో జ్ఞాపకం చేసుకోవచ్చు: కాని, కోస్ట్లర్ 'జియోనిస్టు' కాడు. యూదులు ఏ సమాజంలోఉంటే ఆ సమాజంలో ఇమిడి పోవాలని అతనివాదం: ఈవాదం యూదులలో 'అతివాదు' లకి నచ్చేదికాదు. [రష్యాలో ఇంకా యూదులుహింసింపబడుతున్నారు.] కమ్యూనిజమ్ యూదుల, మహమ్మదీయుల, క్రయిస్తవుల మతాల సంప్రదాయానికి చెందినదే అని ఎందరో అంటూనే ఉంటారు. బెర్ట్రాండ్ రస్సెల్ ఒకసారి క్రయిస్తవుల పవిత్ర- త్రయం- సిద్ధాంతంలోని అంశాల వంటివి కమ్యూనిస్టుల సిద్ధాంతాలలోకూడా కనిపిస్తాయని చమత్కారంగా రాశారు. కోస్ట్లర్ కమ్యూనిజమ్‌చేత ఆకర్షింపబడ్డాడంటే దానికి కారణం కొంతదాకా అతనికి జూడియో- హెబ్రాయిక్ నైతిక విలువలమీద ఉండే నమ్మకమే అనుకోవచ్చు.

అయితే, ఆర్థర్ కోస్ట్లర్ ఒక అసలయిన పశ్చిమ-యూరోపు- మనిషికూడా. ఏ సిద్ధాంతాన్నయినా సరే పరిశీలించి అవసరమనిపిస్తే దానిని సవాలు చెయ్యటం పశ్చిమ యూరోపులో అభివృద్ధి చెందిన సంప్రదాయాలలో ముఖ్యమయినదని ఎందరో అంటూనే ఉంటారు. విజ్ఞానశాస్త్రంగా పిలువబడే దాని పెరుగుదలకి ఈ సంప్రదాయం అత్యధికంగా తోడుపడిందని కూడా ఇటువంటి వారి అభిప్రాయం. ప్రజాస్వామ్య వ్యవస్థకి ఇదిచాలా అవసరం అంటే కూడా అతిశయోక్తి కాదేమో.

రాజకీయాలని గురించి రాయటం మానివేస్తానన్న ఆర్థర్ కోస్ట్లర్ ఒక 'ఫిలాసఫర్' గా మారిపోయాడని నేను అనుకుంటూ ఉంటాను. తక్కినవాటి సంగతి ఎలాగ ఉన్నప్పటికీ ఒక మేధావిగా అతను విజ్ఞానశాస్త్రం పేర ప్రచారం అయ్యే పిడివాదాలని కొన్నిటిని నిశితంగా పరిశీలించటం ప్రారంభించాడు. ఇంగ్లీషులో 'బిహేవియరిజమ్' గా పిలువబడే దానినీ, డార్విన్ పరిణామవాదం తరపున జరిగే ప్రచారాన్నీ అతను సవాలు చేశాడు. [బిహేవియరిస్టుల ఆలోచనలు నయితం రామలింగడి పిల్లి ప్రవర్తన వంటిదే అయితే అది నిజమో కాదో తేల్చేది ఎవరు? ఇంగ్లీషు ప్రధాన భాషగా లేని దేశాలలో డార్విన్- వాలాస్ సిద్ధాంతాన్ని అంతగా పట్టించుకోరని కీ. శే. ప్రొఫెసర్ బి. జి. ఎల్. స్వామి నాతో అన్నారు.] చివరి రోజులలో కోస్ట్లర్ 'ఎన్‌కౌంటర్' (ఇంగ్లీషు) మాసపత్రికలో 'ఆంటెన్నా' అనే శీర్షికకింద కొన్ని అద్భుతమయిన విషయాల మీద కొందరిచేత వ్యాసాలు రాయించి వేయించాడు.

విజ్ఞాన శాస్త్రాన్ని గురించి ఇంత రాసిన, రాయించిన కోస్ట్లర్ 'వైజ్ఞానిక సృష్టి' ఎలాగ జరుగుతుందో తెలుసుకుందామని ప్రయత్నించటం సహజం. 'లోపల ఎక్కడో' ఏదో ఊహాకల్పన జరిగిన తర్వాత ఇంద్రియాలద్వారా గమనించిన బాహ్య విషయాలని కొన్నిటిమధ్య అన్వయం కుదర్చటానికి శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తారని కోస్ట్లర్ నమ్మినట్లు అని తోస్తుంది. ఒక విధంగా చూస్తే 'కళాసృష్టి' కీ 'వైజ్ఞానిక సృష్టి' కీ పెద్ద తేడా లేదేమో కాని కళాసృష్టి నిలిచి పోతుంది, వైజ్ఞానిక సృష్టి పరిణామం చెందుతూనే ఉంటుంది. [కాళిదాసు కవిత్వం బదులు రఘువంశం అనువాదం చదివితే తృప్తిగా ఉండదు; న్యూటన్ సిద్ధాంతాలని పాఠం పుస్తకాలలో చదివినా చదవచ్చు. ఆయన రాసినదంతా ఇప్పుడు చదవక్కరలేదు.] కర్మేంద్రియాలకీ, బుద్ధిబలానికీ అతీతమయిన వాస్తవం ఏదో ఉంటుందని తాను నమ్ముతున్నట్లు కోస్ట్లర్ రాశాడు.

'కోస్ట్లర్ ఎట్ సెవెంటీ' అనే పుస్తకం చదివి జయప్రకాశ నారాయణ ఇతనికి స్నేహితుడని తెలుసుకున్నాను. చాలా

సంతోషం కలిగింది. జయప్రకాశ నారాయణగొప్పతనాన్ని కోస్ట్లర్ అర్థం చేసుకున్నందుకు ఎందుకో గర్వం వేసింది. అప్పుడే కోస్ట్లర్ రాసిన 'ది లోటస్ ఎండ్ ది రోబట్' జ్ఞాపకం వచ్చింది. అది చదివినప్పుడు నేను చాలా చిరాకుపడ్డాను. భారతదేశంలో ఏవో అద్భుతాలు చూద్దామని అతను ఎందుకు రావాలి? వచ్చి ఎందుకు అంతగా నిరాశ చెందాలి? అతనికి కంచి కామకోటి ఆచార్యులవారు చాలా గొప్పవారుగా కనిపించారు. [ఆడమ్, ఈవ్ అనే మాటలు ఆత్మ, జీవలకి దగ్గిరగా ఉన్నాయని స్వాములవారు కోస్ట్లర్‌తో అన్నారు.] కాని, ఇక్కడ కొన్ని అద్భుతాలు వగయిరా ఆయనకి గొప్పగా కనిపించలేదు. అసలు అటువంటి అద్భుతాలని చూసి ఇక్కడివారే ఎందరో అంతగా చలించరు కదా? కోస్ట్లర్ మదరాసువచ్చి [మైలాపూరులోని రానడేహాలులో] ఒక ఉపన్యాసం ఇచ్చాడు. యూరోపు సంస్కృతి మార్పులో అవిచ్ఛేదం, వైవిధ్యంలో ఏకత్వం ప్రదర్శిస్తుందని అన్నాడు. అదివిని భారతీయ సంస్కృతి కూడా అంతే అనుకున్న వారిలో నేనొకడిని.

ఈమధ్యనే కోస్ట్లర్, అతని భార్య చనిపోయారు. ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నట్లు తోస్తుంది కాని సరిగ్గా తెలియటంలేదు. అతనిది ఒక నిండు జీవితం.

శ్రీ రామలింగం

ప్రాచీన కవులకు ప్రాంతీయ తత్వమా!

డాక్టరు కోర్లపాటి శ్రీరామమూర్తిగారి "వేములవాడ భీమకవి కాల నిర్ణయా" ది వ్యాసాలలోని అంశాలపై తమకు వివాదము కలిగి శ్రీ సూర్యదేవర రవికుమార్ గారు కొన్ని అంశాల్ని ఖండిస్తూ. 1983 జనవరి, భారతి, కలగూరగంప, పే. 61 లో వారి అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

అయితే ఎవరి అభిప్రాయాలు వారు నిరాఘాటంగా వెలిబుచ్చుకొనే హక్కుందేమోగాని ఆ 'వేడి' లో సాహిత్యాన్ని, చరిత్రకి కూడ మసి పూయటం, కించపరచటం విజ్ఞత అన్పించుకోదు. ఒక వ్యాసంలోను, దానిపై జరిగే చర్చలోను నూతనాంశాలు లభించకపోతే పోయె, కనీసం ఆ పాత విషయాల్నే కొత్త కోణాల్లో ప్రదర్శించకపోతే ఆ కృషి వ్యర్థం, ఆ పరిశ్రమా నిరర్థకం; వారివారి వాదనలకి బలంకూర్చుకునే ధోరణుల్లో 'చరిత్రను 'కవులను' కూడా కలుషితం చేయబూనటం హర్షించదగిన పరిణామంకాదు.

నిజమే, శ్రీ శ్రీరామమూర్తిగారు పేర్కొనినట్టు వేములవాడలోని రాజేశ్వరాలయము భీమేశ్వరాలయము కాదు. కాని అచటి బద్దెగేశ్వరాలయము భీమేశ్వరునిది. అది క్రీ॥శ॥ 850 ప్రాంతమున రెండవ అరికేసరి పూర్వీకుడైన బద్దెగునిచే నిర్మితమైనట్టిది. ఆ ప్రాంతమునకూడ స్థల పురాణముతోపాటు భీమకవి విషయము ముడిపడియున్నది. కనుక భీమకవి అచ్చటివాడు కాదనుటకు కూడ సరియైన కారణాల్ని శ్రీ శ్రీరామమూర్తిగారు చెప్పాలి. చెప్పలేకపోతే విషయాన్ని పాక్షికంగా ముగించినట్లు పాఠకులు భావించుకొనే ప్రమాదం వుంది. మనకి కావల్సింది నిష్పాక్షికమైన పరిశోధన. కాకపోతే ఎందుకీ చర్విత చర్వణం?

శ్రీ రవికుమార్‌గారు శ్రీ శ్రీరామమూర్తిగారి వాదాన్ని ఖండిస్తూ తమ అభిప్రాయాన్ని స్పష్టంగా పేర్కొని దానికి తమకున్న ఆధారమేదో వివరంగా చెప్తే సరిపోయేది. భీమకవి కరీంనగర్ ప్రాంతంవాడే అనటాన్కి ఆయనకి ఒకే ఒక మార్గం గోచరించినట్లుంది. అది 'తెలంగాణా కవి' కొఱవి గోపరాజుకి ప్రాంతీయతత్వం అంటగట్టడం! ఒక కంద పద్యంలో భీమకవినిపొగడటం, మరో పద్యంలో ఆయన్ని యథా తథా అనుకరించడం-యివి గోపరాజులో ప్రాతీయ తత్వ ధోరణులుగా శ్రీ రవికుమార్ గారికి కన్పడినవి; అది క్రీ॥శ॥ 15 వ శతాబ్దిలో, పూర్వ కవుల్ని గురించి మాట్లాడేటప్పుడు కించిత్ విచక్షణ చూపకపోతే చారిత్రక దృక్పథమేకాదు, సాహిత్య వారసత్వమే తీవ్ర ధోరణులలో ప్రకోపిస్తుంది. 'భీమకవిపై గోపరాజింత అభిమానమును (?) ప్రదర్శించుటకు (?) గల కారణము ఇరువురు ఒకే ప్రాంతీయులు (?) కావటమే అనగలగటం, దుస్సాహసం. నేడు మనమధ్య చోటుచేసుకొనే ప్రాంతీయ, కుల, మత తత్వాల్ని ఐదు వందల సంవత్సరాల క్రితమే ఆంధ్రదేశంలో దర్శింపబూనటం నిజంగా 'సెంటుపెర్సంటు' దురదృష్టము. తన "సింహాసన ద్వాత్రింశిక"లో నొకసందర్భమున ఆంధ్రమండలం బందలి

కోనసీమ ప్రాంతమున వాడుకలో నున్న తెలుగు కవితలో ప్రాసవళ్ళుండు ప్రత్యేకతకు మురియుచు—

" .... సంస్కృతాది భాషలునేర్చి
కవిత యెఱిగి యెల్లకడలఁదిరిగి
తెలిసినాడ నిచటుగల లక్షణముకంటె
నూతనంబులేదు భూతలేంద్ర! "

అని ఘనముగా పొగిడిన మన ప్రాచీనకవి గోపరాజులో 'ప్రాంతీయతత్వం' ఏస్థాయిలో ద్యోతకమౌతుంది ఎవరికైనా, దృష్టిదోషం వుంటేతప్ప. మనం మనవాళ్ళకి కొత్త కీర్తి సంపాదించి పెట్టనక్కర్లేదు, ఉన్నదానిపై 'యింకు' జల్లకుండావుంటే అదే పదివేలు.

మరొక్క విషయం-

శ్రీ రవికుమార్ గారు తమ వాదనలో "భీమకవి చాటువులలో పేర్కొనబడిన చాళుక్య చొక్కనృపాలాదులు రామగిరి దుర్గముతో సంబంధము కలవారు" అని వ్రాసినారు. వ్యాసాంతమున "భీమకవి 12 వ శతాబ్ది మధ్య భాగమువాడని గట్టిగా చెప్పవచ్చున"ని పేర్కొన్నారు. అయితే, కరీంనగర్ జిల్లాలో 12 వ శతాబ్దంలో తెలుగు పద్యాలల్లించుకొనే చాళుక్య వంశాలున్నాయా?! క్రీ॥శ॥ 966 లో ఆహవమల్ల రెండవ తైలపుడు ధ్వజమెత్తటంతో వేములవాడ చాళుక్యవంశం అంతరించింది. కొద్దిలో అటు, ఇటుగా ఆ ప్రాంతపు పరిసరాల్నే పాలించిన ముదిగొండ చాళుక్యవంశంకూడా క్రీ॥శ॥ 12వ శతాబ్ద్యాంతానికి నిర్వీర్యమై తీరాంధ్రదేశానికి వలసపోయింది. ఇవికాకయిక తెలంగాణా ప్రాంతంలో ఆ కాలంలో కల్యాణి చాళుక్యులు తప్ప మరే యితర చాళుక్య వంశాలూలేవు. ఇక్కడా, అక్కడా కొద్దిపాటిమంది చాళుక్యులమని చెప్పుకుంటున్నట్టు శాసనాలున్నా, వారెవరికీ 'చొక్కరాజు' అనేపేరు లేదు. తరువాతి కాలంలో, అంటే 14 వ శతాబ్దంలో నిడదవోలు చాళుక్యుల వారసులై, తెలంగాణాన్కి తరలి వచ్చిన చాళుక్య కుటుంబాలు వెలమ ప్రభువులతో కలిస్తూ 'జల్లిపల్లి' ప్రాంతాల్ని ఆక్రమించివున్నా, ఆ అనేక కుటుంబాల్లో 'చొక్కరాజు' విషయం అస్పష్టం. అథవా తీవ్ర పరిశీలనలో ఓ 'చొక్కరాజు' లభించినా, శ్రీ రవికుమార్గారి భీమకవి కాలనిర్ణయాన్నిబట్టి ఆ ప్రయత్నమే అనవసరం. కనుక రామగిరి ప్రాంతాల్ని 12 వ శతాబ్దిలో పాలించి, భీమకవిచే తెలుగు పద్యాలల్లించుకొన్న చాళుక్య వంశమేదో, ఆ 'చొక్కనామనృప కుంజరుడె' వ్వరో తెలియజేయవల్సిన బాధ్యత శ్రీ రవికుమార్ గారిపై వుంది.

శ్రీ కొల్లూరు సూర్యనారాయణ

దేవాలయాల్లో కామ శిల్పం

డాక్టరు ఘంటా జవహర్లాల్గారు రచించిన పై వ్యాసానికి తెలుగు అనువాదము (జనవరి 1983, భారతి) లో చదివినాను. దానిలో కామానికి మిగతా మూడు పురుషార్థములతో సరి సమానమైన హోదా కల్పించలేక పోతున్నాము అన్నారువారు. బాగా పరుగెత్తే గుఱ్ఱానికి వున్న నాలుగుకాళ్లూ ముఖ్యమైనవే. వానిలో ఏకాలు గాయపడ్డా, మిగతా మూడుకాళ్లతో మాత్రమే అది పరుగెత్తలేనట్లే భౌతికంగా- ఇహపరాల్లో జీవించి ఉన్నంతవరకు మనిషికి కామం (యౌవనదశ) లో ముఖ్యంగా అవసరమైన పురుషార్థం. కామం లైంగికము కావచ్చు. దానికి మరోఅర్థం కోరికలు అనికూడా చెప్పుకోవచ్చు. ఏ వయస్సులోనైనా కోరికలు లేకుండా మనిషి బ్రతికే అవకాశం లేదు. సన్యాసికి తప్ప—

దేవాలయాలలో కామశిల్పాలు- ఏరాజు- ఏ శిల్పులు ఎందుకు చిత్రింపజేసినారన్నది ఎక్కువగా ఆధారాలు కనిపించవు. రచయిత చెప్పిన డా॥ దేవాంగ దేశాయి వ్రాసిన పరిశోధనా గ్రంథము నేను చూడలేదు.

కీ॥ శే॥ తాపీ ధర్మారావుగారు వ్రాసిన రీతి —

సమంజసముగా లేద తెలిపారు రచయిత. పూర్వులైన శిల్పులు ఎందుకు వేశారో- వేసినారు. అసంగతముంచి- మనం పూజిస్తున్న శివలింగ రహస్యం యేమిటి? హరవిలాసం అన్న శివ కావ్యంలో శ్రీనాధుడు పరమేశ్వరుని లింగమే! అన్న విషయం స్పష్టంగా చెప్పాడు. అవసరమైతే ఆ సమాచారం (పద్యములు) ఉదహరింపగలను. శివ పదమణి మాలలో ఆదిశంకరాచార్యులు పానవట్టం పార్వతి, శివుడు లింగస్వరూపి అన్నారు. పానవట్టం విష్ణువు అనికూడా అన్నారు. విస్తరభీతివల్ల ఆ శ్లోకం వ్రాయలేదు. శచీదేవి విష్ణువుతో సంభోగింపగోరి వచ్చిందట వైకుంఠందాకా అయితే విష్ణువు- కృష్ణావతార మెత్తినప్పుడు ఆమె రాధగా పుట్టిందట! వీళ్ల లీలల తాలూకు ఒక కవి వ్రాసిన పద్యం చూడండి. రాధ బాలకృష్ణునితో అంటున్నది.

ఎటునన్ తుల్య వయస్థితిన్ దన్పెదో
యీ కృష్ణు యన్ రాధ నా
తృటిలో బాల్యము వీడి యౌవనమునన్
దృప్తాత్మ గావించు, న
చ్చటి కష్టామె మగండు జేర, శిశుతా
సంధాతృ మంత్రమ్ము రా
నటు తత్సోదరిపైతె చింతిలుచు
కృష్ణా దేవకీనందనా!

ఇంద్రుడు వ్యభిచారి- తార (బృహస్పతి భార్య) చంద్రునితో కామ కలాపం సాగించింది. గుర్వంగనా సంగమం పాపం కాదు!

"లోకములోన కొంద రబలుల్ సతులన్ దనియింపలేక న
స్తోకమనీష! నన్యపురుషుల్ తమ కాంతల గూడకుండ తా
టాకులలోన వ్రాసిరి పరాంగన గూడిన పాపమంచు...."

అని వ్యభిచారం పసందైన క్రియ అని వర్ణించినట్లు చెప్తున్నాడు పై పద్య రచయిత.

ఇంద్రుడు, సూర్యుడూ కలిసి గౌతముని భార్య అయిన అహల్యను కామించారు, ఫలితంగా వాలి సుగ్రీవులు, పుట్టినారు. అది అంజనాదేవి చూచినట్లు చెపుతుందేమో! అన్న భయంకొద్దీ ఆమెకు ఒకకోతి పుట్టాలని శపించిందీ అహల్య.

పై రాధాదేవి వృత్తాంతం పద్మ పురాణంలోనిది. పార్వతీ పరమేశ్వరులు లక్ష్మీనారాయణులు- వాణీబ్రహ్మలు అంతా రతి ప్రియులు- రతి ప్రియుడు కానివాడు- ఎవడు? దేవాలయం పవిత్రమైంది. దేవతలు పవిత్రులా? మనుషులు పవిత్రులా! శిల్పులకు అవకాశం లభించింది వారు చిత్రించారు! ఈనాడు ప్రేమకథలకి గిరాకీ వున్నట్లు భక్తి కథలకు లేదు. ఆ శిల్పాలు చూడడానికయినా భక్తులు దేవాలయానికి వస్తారు. రక్తి భుక్తి ముక్తి మూడు సంపాదించుకోవడానికి కళారంగం- దేవతాసంబంధ కథలుగల పురాణాలు స్వైరవిహారం చేశాయి. శాసనాలు ఎన్నాళ్లమల్లో వుంటవి? క్రియా శూన్యులకేపీ పట్టవు- ముగిస్తాను.

శ్రీ దేశపతి గోపాలకృష్ణ

గురుత్వ తరంగాలు

గురుత్వాకర్షణ శక్తికి, విద్యుచ్ఛక్తికి, అయస్కాంత శక్తికి మధ్యగల సంబంధం తెలుసుకునేందుకు ఎంతో ప్రయత్నించాడు మైకేల్ ఫారడే. అయితే అప్పటినుండి ఇప్పటివరకూ ఇదొక పరిష్కారంకాని సమస్యగానే ఉండిపోయింది.

ఐన్‌స్టయిన్‌తో సహా పెక్కుమంది శాస్త్రవేత్తలు గురుత్వాకర్షణ (గ్రావిటీ) కు మాక్సువెల్ విద్యుత్‌గతి శాస్త్రానికి సంబంధము రూపొందించడానికి ప్రయత్నించారు. కాని సఫలీకృతం కాలేదు.

ఒకేకాలంలో ఐన్‌స్టయిన్ సాపేక్షతా సిద్ధాంతాన్ని, ప్లాంకు క్వాంటమ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అయితే ఈ సిద్ధాంతాల పెరుగుదలల్లో చాలా తేడా వచ్చింది. నీల్సుబోర్, లూయీస్ డీ బ్రోగ్లీ, ఎర్విన్ స్క్రోడింజరు, వెర్నర్ హైజన్ బర్గ వంటి ప్రఖ్యాత శాస్త్రవేత్తలు చేసిన కృషి క్వాంటమ్ సిద్ధాంతాన్ని ఎంతగానో సమర్థించడం వల్ల ఆ సిద్ధాంతం ఎంతో అభివృద్ధి చెందింది.

దాదాపు డెబ్బయి సంవత్సరాల క్రితం ఐన్‌స్టయిన్ ప్రతిపాదించిన గురుత్వాకర్షణ సిద్ధాంతం ఎలాఉందో ఈనాడూ అలాగే ఉంది. ఐన్‌స్టయిన్ గురుత్వాకర్షణ సమస్యను అంతరాళము (స్పేస్), కాలములకు సంబంధించినదిగా నిర్ణయించాడు. ఈవిధమయిన రేఖాత్మక భావన విద్యుదయస్కాంత క్షేత్రానికికూడా యివ్వడం సాధ్యమవుతుందని నమ్మాడు. ఈ నమ్మికతోనే ఐన్‌స్టయిన్ ఐక్యక్షేత్ర సిద్ధాంతం ప్రతిపాదించాడు. అయితే ఈవిభాగంలో గణనీయమైన కృషి చేయకుండానే ఐన్‌స్టయిన్ పరమపదించాడు.

న్యూటన్ విశ్వగురుత్వాకర్షణ సిద్ధాంతం అనుసరించి రెండు ద్రవ్యరాశుల మధ్య ఆకర్షణబలం ఆ ద్రవ్యరాశుల లబ్ధానికి అనులోమాను పాతంలోను వాటి మధ్య దూరం వర్గానికి విలోమాను పాతంలోనూ ఉంటుంది. ఇది అచ్చం కులూమ్ విద్యుదావేశ సిద్ధాంతాన్ని పోలి ఉంది. ఐన్‌స్టయిన్ గురుత్వ క్షేత్ర సిద్ధాంతం ఇదేవిధంగా మాక్సువెల్ విద్యుదయస్కాంత సిద్ధాంతాన్ని పోలిఉంది.

కదలుచున్న విద్యుదావేశం (ఉదాహరణకు ఎలక్ట్రాను) విద్యుదయస్కాంత తరంగాలను విడుదల చేస్తుంది. అదేవిధంగా కదలుచున్న ద్రవ్యరాశి గురుత్వ తరంగాలను (గ్రావిటేషనల్ వేవ్సు) విడుదల చెయ్యాలి. ఈ గురుత్వ తరంగాలు విద్యు

దయస్కాంత తరంగాలను పోలి ఉంటాయి. ఇవి కాంతివేగంతో ప్రసారం అవుతూ శక్తిని మోసుకుపోతూ ఉంటాయి. ఈవిషయా లన్నీ 1916 వ సంవత్సరంలోనే ఐన్‌స్టయిన్ ప్రతిపాదించాడు. ఈ ప్రతిపాదన న్యూటన్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఉంది. న్యూటన్ సిద్ధాంతం ప్రకారం గురుత్వాకర్షణ బలం వెనువెంటనే ప్రవర్తిస్తుందని చెబుతుంది.

గురుత్వ తరంగాల ఉనికిని గుర్తించడంలో ఎన్నో ఇబ్బందు లున్నాయని ముందుగానే ఐన్‌స్టయిన్ ఊహించాడు. గురుత్వ తరంగాలు విడుదలచేసే సందర్భాలన్నిటిలోను విడుదలకాబడే తరంగాల వికిరణ సామర్థ్యం గుర్తుకు దొరకనంత తక్కువగా ఉంటాయని ఐన్‌స్టయిన్ చెప్పాడు.

విద్యుదయస్కాంత తరంగాలు విద్యుదావేశాలు, విద్యుత్ ప్రవాహాలతో మాత్రమే చర్యకు పాల్పడతాయి. కాని గురుత్వ తరంగాలు అన్నిరకాల పదార్థాలతోను మరియు శక్తులతోను చర్యకు పాల్పడతాయి. గురుత్వ తరంగాలు మోసుకుపోయే శక్తి ప్రమాణం చాలా తక్కువగా ఉంటుంది.

సూర్యుని చుట్టూ భూమి భ్రమణం చెందడం వలన (కదలు చున్న భూమి ద్రవ్యరాశి) 0.001 వాట్టుల శక్తి విడుదల అవు తోంది. అంటే బిలియను సంవత్సరాలకు సూర్యుని వైపు భూమి సెంటీమీటర్లో మిలియనో భాగం కదలుచున్నట్లు లెక్క.

గురుత్వ తరంగాలు శక్తి ప్యాకెట్లుగా విభజింపబడి ఉంటాయా? లేక క్వాంటాలుగా ఉంటాయా? లేక విద్యుదయ స్కాంత తరంగాలు మాదిరి ఉంటాయా? డిరాక్ అనే గణిత శాస్త్రవేత్త గురుత్వ తరంగాలుశక్తి ప్యాకెట్లుగా విభజింపబడి ఉంటాయని ఊహించి వాటికి "గ్రావిటాన్స్" అని పేరుపెట్టాడు.

గ్రావిటాన్ శక్తి ప్లాంకు స్థిరాంకం మరియు తరంగ పౌనః పున్యముల లబ్ధానికి సమానంగా ఉంటుందని చూపాడు.

అంటే కాంతి శక్తిని తెలియజేసే ఫోటానుల శక్తి సమీ కరణమే గ్రావిటాన్ల శక్తి సమీకరణం అవుతుందని నిరూపించాడు అంతేగాక గ్రావిటాన్ ఆత్మభ్రమణ వేగం ఫోటాను ఆత్మభ్రమణ వేగానికి రెట్టింపు ఉంటుందని ప్రతిపాదించాడు.

చాలా బలహీనంగా ఉండే ఈ గురుత్వ తరంగాలు బహుశ ఖగోళ యాత్రిక పెద్దశాస్త్రంలో ప్రాముఖ్యత కల్గియుండక పోవచ్చు. కాని ఈ గురుత్వ తరంగాల ప్రాముఖ్యత తగినంతగా ప్రాథమిక కణాల భౌతిక శాస్త్రంలో ఉండవచ్చు.

అసలు గురుత్వ తరంగాలను గుర్తించడం జరిగిందా అనే విషయానికి వద్దాము. రేడియో తరంగాలు, మైక్రో తరంగాలు ఎక్సు కిరణాలు వంటివి ప్రయోగశాల స్థాయిలో ఏర్పరచడం వీలవుతుంది. ఈ తరంగాల ఉనికిని గుర్తించగల పరికరాల నిర్మాణం సాధ్యమయింది. కాని గురుత్వ తరంగాలను ప్రయోగ, శాల స్థాయిలో ఏర్పరచే పద్ధతి ఇంతవరకూ తయారు కాలేదు.

అమెరికాలోని మేరీలాండు విశ్వవిద్యాలయానికి చెందిన జోసఫ్ వెబర్ 1969 వ సంవత్సరంలో మన పాలపుంతనుండి విడుదల గాబడ్డ గురుత్వ తరంగాల ఉనికిని గుర్తించినట్లుగా మొట్ట మొదటి సారిగా తెలిసింది. ఆనాటినుండి ఎంతోమంది శాస్త్రవేత్తలు ఈ గురుత్వ తరంగాల ఉనికిని గుర్తించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాని వారి ప్రయత్నాలు ఫలించలేదు ఇంతవరకూ.

అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు జె.హెచ్. టెయిలర్ యల్. ఎఫ్. ఫౌలరు మరియు ఎమ్. సి. కులాల్ పరోక్ష పద్ధతిలో గురుత్వ తరంగాల ఉనికిని గుర్తించారు.

జంట న్యూట్రాన్ నక్షత్రాలు ఒకదానిచుట్టూ మరొకటి తిరుగుతూ ఉంటాయి. న్యూట్రాన్ నక్షత్రం బరువు దాదాపు మన సూర్యుని బరువుతో సమానంగా ఉంటుంది. కాని వాటి పరిమాణం కొన్ని కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. సెకను కాలంలో ఈ న్యూట్రాన్ నక్షత్రాలు తమచుట్టూ తామెన్నోసార్లు తిరుగుతాయి. అందుచేత న్యూట్రాన్ నక్షత్రం క్రమబద్ధమైన నియమితానుసారం రేడియో తరంగాలను విడుదల చేస్తాయి. సాధారణంగా నక్షత్రాల నుండి విడుదల కాబడే రేడియో తరంగాలు నిర్ణీత కాలంలోనే వస్తూ వుంటాయి. ఎన్ని సంవత్సరాల కాలం గడిచినా వాటి నిర్ణీత కాలాల్లో మార్పు ఉండదు.

కాని జంట న్యూట్రాన్ నక్షత్రాల విషయంలో నిర్ణీత కక్ష్యల్లో అవి ఒకదాని వెంబడి మరొకటి తిరుగుతూండడంవల్ల గురుత్వ తరంగాలు విడుదల కావడం తత్ఫలితంగా శక్తిని కోల్పోవడం జరుగుతోంది. ఈ విధంగా శక్తిని కోల్పోవడంవల్ల న్యూట్రాన్ నక్షత్రాల భ్రమణవేగం తగ్గుతున్నట్లుగా ముగ్గురు శాస్త్రవేత్తలు నిర్ణయించారు. గణితం ప్రకారం కట్టిన లెక్కకు పరిశీలనలు సరిపడ్డాయి.

మూడువందల అయిదు మీటర్ల వ్యాసంగల రేడియో టెలి స్కోపు నుపయోగించి దాదాపు వెయ్యి పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనల వల్ల నక్షత్రాల భ్రమణవేగం ఏడాదికి బిలియనో వంతు తగ్గుతోందని కనుగొన్నారు. సాపేక్షతా సిద్ధాంతం ఆధా

రంగా చేసిన గణితానికి ఇది సరిపడింది. గురుత్వ తరంగాలు ఏర్పడి కక్ష్య వ్యవస్థనుండి శక్తిని కొనిపోతున్నట్లుగా భావించి గణితం చేశారు.

ఈ ప్రయోగ ఫలితం ఐన్‌స్టయిన్ సాపేక్షతా సిద్ధాంత ప్రాముఖ్యతను చాటి చెప్పేదిగాఉంది. విశ్వరహస్యాన్వేషణలో ఈ ప్రయోగాల ఫలితాలు మరికొన్ని రహస్యాలను బట్టబయలు చేయవచ్చు.

శ్రీ సి. వి. సర్వేశ్వర శర్మ

"అసనపురము" రాజమహేంద్రవరమా!?

చాళుక్య జయసింహుని శాసనాలారింటిలో, రెండవ విష్ణువర్ధనుని శాసనం ఒక్క దానిలో పేర్కొనబడ్డ అసనపురపు గుర్తింపు విషయాన్ని పునఃప్రస్తావించటం చాలా అవసరం. అసనపుర నిరూపణ విషయంలో గతంలో పండితులు వేర్వేరు అభిప్రాయాలు వెలిబుచ్చటం జరిగింది. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తూర్పు గోదావరి జిల్లాలోని పెద్దాపురపు పరిసరాల్లో నది యుండినట్లనుమానించుట కవకాశమున్నదని చెప్పిరి.[1] కందేరువాటి విషయమైన గుంటూరుజిల్లాలో యుండియుండునని శ్రీ భావరాజు వెంకట కృష్ణారావుగారి యూహ.[2] దాక్షారామప్రాంతమున దీనిని కనుగొన వచ్చునని శ్రీ రాళ్ళబండి సుబ్బారావుగారి అభిప్రాయము.[3] ఈ విధంగా ఎవరి అభిప్రాయాలు వారు వెలిబుచ్చిరే తప్ప నిరూపణ కందే సాక్ష్యాధారాలు సరైనవి లభ్యంకాకపోవటంతో నేటివరకు అసనపురపు పునికిని తెలుసుకొనే ప్రయత్నాలు ఫలించలేదు. ఇదే అంశాన్ని చర్చిస్తూ సక్కి విషయమైన సర్వసిద్ధిదాపుల్లో ఉన్న ఆచెళ్ళపురాన్ని అసనపురంగా గుర్తిస్తూ 1978 లో విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీకాంగ్రెసు తృతీయ సమావేశాల్లో ఓ వ్యాసాన్ని సమర్పించాను.[4] అలా గుర్తించటానికి బలమైన అనుమానమే తప్ప నిరూపింపదగ్గ సాక్ష్యాధారాలులేవు. అసనపురమున్న విషయనామముగాని, దాని ఎల్లలందున్న గ్రామములుగాని, ఎక్కడా ప్రస్తావింపబడకపోవటంతో, సరియైన పరిశోధన కాకపోయినప్పటికీ యితరాధారాల ప్రాపున అనుమానప్రమాణాన్ని ఆశ్రయించవల్సివచ్చింది, కాని తర్వాత మా గురువర్యులు శ్రీ చెన్నపిళ్ళ సోమసుందరరావుగారి పరిశీలనలో అసనపుర ప్రస్తావన చివరిసారిగా నొక దాక్షారామ శాసనంలో నున్నట్లు కనుగొని నా పూర్వపుటభిప్రాయం మార్చుకొని సవరణమేరకు పై విషయాన్నిగూర్చి మరో వ్యాసం ప్రకటించటం జరిగింది.[5] అయితే విషయం మరింత వెల్గులోకి వచ్చింది గాని సమస్యకి పరిష్కారం కుదరలేదు. అసనపురాన్ని గుర్తించటాన్కి ప్రస్తుతాధారాలు చాలవు.

శ్రీ భావరాజు వెంకట కృష్ణారావుగారి వాదాన్ని సమర్థిస్తూ 1982 మార్చిలో హైదరాబాద్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెసు ఆరవసమావేశంలో వేరొకరు జయసింహుని నిడుపఱ్రు శాసనమాధారంగా అసనపురస్థానాన్ని గుంటూరుజిల్లాలో నిరూపింప ప్రయత్నించారు. కాని ఆ నిర్ణయం అంగీకరింపబడలేదు. నిడుపఱ్రు శాసనం[6]లో దాన ప్రదేశాన్కి రెండు గవ్యూతుల దూరమున నున్నట్లు పేర్కొనబడినది. గందేరు రాజప్రాసాదమేగాని అసన పురముకాదు. అసనపురపు ఉనికి గందేరు విషయమునకన్న గుద్రహారవిషయమున నున్నట్లు భావించుటకే చాలా అవకాశముంది.

ఇదిలావుండగా శ్రీ తురగా కృష్ణమూర్తిగారు 1982 మే నెల 'భారతి' కలగూరగంపలో నేను 1978 లో వ్రాసిన వ్యాసాన్ని విమర్శిస్తూ విపులచర్చ జరిపారు. అప్పటి నా వ్యాసంలోని అభిప్రాయాన్ని నేను మార్చుకొని మరోవ్యాసాన్ని ప్రచురించటం బహుశః వారికి తెలియదు. నా రెండోవ్యాసాన్ని వారు చూసి వుండకపోవచ్చు. అదలావుంచి ముందు శ్రీ కృష్ణమూర్తి అభిప్రాయాన్ని పరిశీలిద్దాం. ఈ విషయమై వారు తమ నిర్ణయాన్ని "ఘంటాపథంగా" చెప్తూ అసనపురాన్ని రాజమహేంద్రవరమేనని రూఢిపరచిరి. అసనపురం 'ఘటికాస్థానము' కనుక, నన్నయభట్టు భారతావతారికలో "సత్సభాంతరసరసీవనంబుల" ను కొనియాడెను కనుక, ఆ కొనియాడుటలో తమకు 'ఘటికాస్థాన' సంప్రదాయము గోచరించినది కనుక, తామట్లు చెప్పుటకు సాహసించుచున్నామని, అసనపురం రాజమహేంద్రవరమని నమ్మటాన్కి ఎలాంటి సందేహ మక్కర్లేదని సెలవిచ్చినారు.[7]

కాని వారి యీ నిర్ణయాన్కి ఓ ఆధారమనేది వుందా?

పండితకూటాన్ని, విద్వత్సభల్ని నన్నయ పేర్కొన్నంతలో రాజమహేంద్రవరాన్ని అసనపురంగా గుర్తింపవచ్చునా? అసలు నేనెరిగినంతవరకు రాజమహేంద్రవరాన్నిగూర్చి చరిత్రకారుల్లో రెండేరెండు వాదాలున్నాయి. ఒకటి 'రాజమహేంద్ర' బిరుదు ధరించిన మొదటి అమ్మరాజు నిర్మించాడని,[8] మరొకటి 'కావ్యాలంకారచూడామణి' ఆధారంగా చెప్పే రాజరాజనరేంద్రుడే రాజమహేంద్రవరనిర్మాత అనీను.[9] కాని ప్రస్తుతం వీరు దానికి మరింత ప్రాచీనత కల్పిస్తూ అసనపురంతో ముడిపెట్టారు. ఒక్కసారిగా అసనపురం అనే నామం రాజమహేంద్రవరంగా మారిపోవటం

సాధ్యమా? ఆ 'మార్పు'ని తెలియజెప్పే ఆధారం లభ్యంకానిదే, అసలు విజానికి మారినా, మనం నమ్మవల్సిన హేతువుందా? నన్నయ పేర్కొన్న విద్వత్సభల్లో 'ఘటికాస్థాన సంప్రదాయాన్ని' విధిగా వెతుక్కోవాలా? అవి సభలో రాజాశ్రయంలో వుండే పండిత మండలులు కాకూడదా? కాదంటే, చాళుక్యుల యితర శాసనాల్లో, సమకాలీన రాష్ట్రకూట, వేములవాడ చాళుక్యుల శాసనాల్లో రాజాశ్రయంలోని పండితుల ప్రసక్తి మాటేమిటి? అంచేత రాజమహేంద్రవరంలోని రాజరాజనరేంద్రుని సభలోని విద్వత్పరిషత్తును సంస్మరించిన నన్నయరచనలో 'అసనపుర ఘటికాస్థాన విశిష్టత' కృష్ణమూర్తిగారికి గోచరించినదనటం, తత్కారణంగా రాజమహేంద్రవరాన్ని అసనపురంగా రూఢిపరచబోవటం చరిత్రను పెడత్రోవ పట్టించడమే. వీరే మరో వ్యాసమున, మరో సందర్భములో తాముదాహరించిన "పంచబ్రహ్మోదయ భాష్యము" నందలి "రాజమందిరము"ను కూడా రాజమహేంద్రవరంగా గుర్తించారు.10 దీనిబట్టి రాజమహేంద్రవరమును తొల్లి అసనపురముగా, తర్వాత రాజమందిరముగా గుర్తించాలని వీరి అభిప్రాయం కావచ్చు. రాజమహేంద్రవరానికి యిన్ని పేర్లున్నట్టు తర్వాతి కాలంలోని శాసనాల్లో, సాహిత్యంలో ఎక్కడా లేని విషయం జగద్విదితం. మరి ఎలాంటి ఆధారం లేని వాదాన్ని ఎలా విశ్వసించటం?

అసనపురాన్ని గుర్తించటానికి ప్రస్తుతాధారాలు చాలవని ముందే పేర్కొన్నాను. చాళుక్యరాజ్య కాలంలో ఎంతగానో ప్రస్తావింపబడ్డ అసనపురం, చాళుక్యుల రాజ్యాంత కాలంలో అసలు పేర్కొనబడ లేదు. దాని ప్రాముఖ్యత సన్నగిల్లుతోందనుకుందికి యిదొక నిదర్శనం. చిట్టచివరిసారిగా అసనపురం పేర్కొనబడినది, దాక్షారామమునందలి యొక శిథిల శాసనమున.11 దీని తర్వాత మరేయితర చారిత్రకాధారాల్లోనూ అసనపుర ప్రస్తావన రాలేదు. ఈ శాసనమైనా అసనపురస్థలనిర్ణయానికి ఉపయోగపడదు. కాని కాలగతిలో ఆ గ్రామనామం కొద్దిగా మార్పుచెందుతోందనటానికి ఉపయోగపడుతుంది. ఈ శాసనాన్ని గమనించండి.

1. ....
2. సంవత్సరంబుల [గు] శ్రీహిశ్రీ భీమేశ్వరమహాదేవరకు ఉత్తరాయణ సంక్రాంతి నిమిత్తమున
3. హసనపురపు మాపనభట్లపెండ్ల [ము వె] ల్లమూరిదేవనఅప్పన తల్లి ముత్తనమ్మ తనకు ధ-
4. ర్మార్థముంగా బోలునలువురపూజ్బగా మహేశ్వరయెఱియ భోని వరమునంబెట్టిన.
5. దివ్యగడ్డికి ఇనుపయెన్ల ఎ[|*] ఆ చంద్రార్కస్థాయినిత్య ప వోయుంగల త్రిభువనాంకుఅర
6. శనేతవ్యగడ్డి లిఖితం పెద్దనాచారి [సూ] రాచాయ్యల [||*]

—ఇది యే సంవత్సరానికి చెందినదో స్పష్టంగా పేర్కొనబడలేదు; పేర్కొనబడినా శిథిలమైన పై పంక్తిలో పోయి వుండవచ్చును. ఇక మిగిలినది రెండవవాక్యంలోని యిరవై ఆరవరాజ్యసంవత్సరమనే విషయం. శాసనలేఖకుడు పెద్దనాచారి కొడుకు సూరాచారి. విచారించగా యిది పన్నెండవ శతాబ్దిలోని చాళుక్యచోళుల కాలంలోని శాసనంగా చెప్పవచ్చు. చాళుక్యచోళుడైన రెండవ రాజరాజుకాలానికో, మూడవ కులోత్తుంగచోడదేవుని కాలానికో యిది చెందుతుంది. కాని యిరవైయారవరాజ్యవత్సరం పేర్కొనటాన్నిబట్టి యిది మూడవకులోత్తుంగ చోళుని కాలంలోనిదే అని గ్రహించగలం. ఈ విధంగా యిది పన్నెండవ శతాబ్దపు చివరి దశల్లోని శాసనం. ఇందు పేర్కొనబడినది. భీమేశ్వరునకు ఒక అరదివ్వెసమర్పించుటకై యివ్వబడిన దాన విషయం. దానకర్త ముత్తనమ్మ. ఈమె వెల్లమూరిదేవన అప్పన తల్లి. హసనపురపు మాపనభట్లభార్య. ఇందు పేర్కొనబడిన 'హసనపురం' అసనపురానికి రూపాంతరమో లేక లేఖకుని అజాగ్రత్తగనో భావిస్తే అసనపురాన్ని ఆఖరుసారిగా పేర్కొన్న శాసనం యిదే అవుతుంది. శాసనం యివ్వబడ్డ దాక్షారామానికి దగ్గరలో 'హసనబాద్' అనే కుగ్రామం ఒకటి ప్రస్తుతంవుంది. కాని ఆ గ్రామానికి అసలు ప్రాచీనతగాని మరేయితరాధారాలు గాని లేకపోవటంతో దీన్ని కూడా అసనపురంగా భావించటానికి వీలు కావటం లేదు.

కనుక క్రొత్త సాక్ష్యాధారాలు బయల్పడితే తప్ప ప్రస్తుతాధారాల్తో అసనపురాన్ని గుర్తించటం అసాధ్యమని చెప్పొచ్చు.

అధోజ్ఞాపికలు

1. "వేంగి చాళుక్యులు"
2. హిస్టరీ ఆఫ్ ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి, పే. 102
3. జె. ఎ. హెచ్. ఆర్. ఎస్. వాల్యూమ్ VI
4. ఎ. పి. హెచ్. సి. ప్రొసీడింగ్స్ వాల్యూమ్ నెం. I, పే. 67
5. నవ భారతి, జూలై, 1979, పే. 18
6. ఎ. ఆర్. ఇ. నెం. 7, 191˜; ఇ. ఐ. వాల్యూమ్ XVIII పే. 137; ఐ. ఎ. వాల్యూమ్ XX, పే. 97
7. భారతి, 1983, మే, పే. 50
8. హిస్టరీ ఆఫ్ ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి; బి. వి. కృష్ణారావు, పే. 238
9. ది ఈస్టరన్ చాళుక్యాస్ ఆఫ్ వేంగి; ఎన్. వెంకటరమణయ్య, పే. 218
10. భారతి, 1982, జనవరి, పే. 10
11. ఎ. ఆర్. ఇ. నెం. 337 ఎ ఆఫ్ 1893
    ఎస్. ఐ. ఐ. వాల్యూమ్ IV, నెం. 1219

శ్రీ కొల్లూరు సూర్యనారాయణ

గ్రంథ విమర్శలు

ఆంధ్ర మహాభారతము - అలంకార సమీక్ష

[రచయిత : డాక్టర్ సర్రాజు లక్ష్మీనరసింహారావుగారు. డెమ్మీసైజు 448 పుటలు. వెల సాదాప్రతి రు 35-00. మేలు ప్రతి రూ. 40-00. ప్రతులకు - లేపాక్షి ఆర్ట్ ప్రింటర్స్, శ్రీనివాసా బిల్డింగ్స్, పెనుగొండ రోడ్డు, హిందూపురం-515201 అనంతపురం జిల్లా.]

సాహిత్యంలో ప్రధాన ప్రక్రియయైన కావ్యంలో రసానికే ప్రాముఖ్యమున్నా, అలంకారాలకే విస్తృతమైన ప్రచారం ఉన్నది. ప్రాచీనాలంకారికులు తమ లక్షణగ్రంథాల్లో అలంకారాల్నే ముఖ్యంగా వివరించారు. సాహిత్య శాస్త్రానికి అలంకార శాస్త్రమనే పేరు రూఢమయింది. వామనాచార్యుడు 'కావ్యం గ్రాహ్య మలంకారాత్' అని అలంకారం ఉండడంవల్లనే కావ్యం స్వీకరింపబడుతున్నట్లు చెప్పారు. మరిన్నీ 'సౌందర్య మలంకారం' అని అలంకారమన్నది సౌందర్యమే అని తెలియజేశాడు. సుందరమైన కావ్యాన్ని అందరూ శిరసా వహిస్తారు. ఇది సంస్కృత వాఙ్మయ పద్ధతి. సంస్కృతపు అడుగుజాడల్లోనే నడిచిన ఆంధ్ర వాఙ్మయంలోకూడా అలంకారాలకు ఉత్తమ స్థానం ఉన్నది. ఆంధ్ర మహాభారతం సంస్కృతంలోని భారతేతిహాసానికి స్వేచ్ఛానువాదమయినా కావ్య మార్గంలోనే దాని రచన సాగింది. ఆ భారతంలోని వైశిష్ట్య పరిశీలన వివిధ దృక్కోణాలలో జరిగినా ఆంధ్రభారతంలోని అలంకారాలను గురించిన ప్రగాఢ పరిశీలనను జరిపిన సిద్ధాంత వ్యాసం వచ్చినట్లు నాకు తెలియదు. ఏవో ప్రత్యేకాలంకారాలను గురించిన సమీక్ష జరిగితే జరిగి ఉండవచ్చును. ఈ విషయాన్ని గమనించే కాబోలు రచయిత, యీ విషయమై తీవ్రకృషి చేసి ఈ బృహద్వ్యాసాన్ని ప్రకటించారు. వీరు హిందూపురంలోని శారదాంబా గోవిందయ్య సెట్టి కళాశాలలో ప్రధానాంధ్రోపన్యాసకులుగా ఉండి, పై విషయాన్ని గురించి పరిశోధించి, ఈ సిద్ధాంతవ్యాసం వ్రాసి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ పట్టా సంపాదించారు. దీని ముద్రణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇతరులు ఆర్థిక సహాయం చేశారు. గ్రంథం చక్కగా తయారయింది.

రచయిత యీ సిద్ధాంత వ్యాసాన్ని తయారు చెయ్యడానికి సంస్కృతాంధ్రాంగ్ల భాషల్లో దీనికి సంబంధించిన గ్రంథాలను డెబ్బయికి పయిగా సంప్రదించారు. వాటిలో సాహిత్య శాస్త్రానికి సంబంధించిన గ్రంథాలేకాక ఇతరములైన గ్రంథాలుకూడా ఉన్నవి. దీనినిబట్టి యీ విషయంలో వీరికృషి వ్యక్తమవుతూ ఉన్నది.

ఇందులో ప్రధానంగా రెండు అధ్యాయాలున్నవి. మొదటి అధ్యాయం అలంకార సిద్ధాంత సమీక్షకు సంబంధించినది. ఇందులో అలంకార ప్రశస్తి నిర్వచనం, అలంకార ప్రయోజనం, పూర్వరంగ సిద్ధాంతాలు, అలంకారస్థాన శిల్పాలు, వర్గీకరణౌచిత్యాలు మున్నగునవి ఉన్నవి. రెండవ అధ్యాయం అలంకారప్రయోగ సమీక్షకు సంబంధించినది. ఇందులో మొదట కవిత్రయంవారి అలంకార భావన చర్చించబడింది. తర్వాత అర్థాలంకారాలలో ప్రధానాలై, తరచుగా కాన వస్తున్న ఉపమా, రూపక, ఉత్ప్రేక్షాలంకారాలను గురించీ, తర్వాత ఇతరములైన అలంకారాలను గురించి విపులంగానూ చెప్పబడింది. 'పరిశిష్ట' శీర్షికలో రసవదలంకారం మొదలైనవి, రుద్రటాదులు చెప్పిన అనుమానాలంకారం, ఇతర చమత్కృతులు, శబ్దాలంకారాలు చెప్పబడినవి. శబ్దాలంకారాలను గురించిన విషయం చాలా స్వల్పంగా ఉన్నది. గ్రంథం చివర ఉపయుక్త గ్రంథాల పట్టిక ఇయ్యబడింది.

కవిత్రయం వారి భారతంలోని పద్యాలలోని అలంకారాలను వివరిస్తున్నప్పుడు డాక్టర్ లక్ష్మీ నరసింహారావుగారు లక్ష్య లక్షణ సమన్వయం సముచిత పద్ధతిలో జరిగించారు. అలంకార లక్షణాలను చెప్పవలసినప్పుడు ఏ ఒక్కరి అభిప్రాయాన్నిమాత్రం తీసుకోకుండా ప్రసిద్ధాలంకారికుల లక్షణాలను వారి వారి లక్షణ వివరణ, సమన్వయాలను వివరించారు. ఇది రచయిత సమగ్ర పరిశీలనకు దృష్టాంతం. దీనిని చదివితే సంస్కృతంలోని వేర్వేరు లక్షణ గ్రంథాలలోని అలంకార లక్షణాలు, భారతంలోని వాని సమన్వయ పద్ధతి తెలుసుకొనుటకు చక్కని అవకాశం ఏర్పడుతుంది.

అయ్యలరాజు కవితా వైభవం

[రచయిత: శ్రీ కొత్తపల్లి విశ్వేశ్వరశాస్త్రి (డాక్టర్) యువభారతీ ప్రచురణ. డెమ్మీసైజు 55 పుటలు. వెల రూ 3. ప్రతులకు యువభారతి, 5, కింగ్స్‌వే, సికిందరాబాదు - 3 లేక యువభారతీ కార్యాలయం.]

రాయల యుగంలో ప్రబంధాలకు ఎక్కువ గౌరవం ఉన్నందున, అప్పటి కవులు పురాణాల్లోని కథాంశాలు తీసుకుని ప్రబంధాలు రచించారు. అల్లసాని పెద్దన మహాకవి మార్కండేయ పురాణంలోని స్వారోచిషమను వృత్తాంతాన్ని తీసుకుని మను చరిత్రను, ముక్కు తిమ్మన భాగవతంలోని పారిజాతాపహరణాన్నీ రచించారు. కాని, అయ్యలరాజు రామభద్రకవి పూర్తిగా రామాయణ కథను తీసికొని రామాభ్యుదయ ప్రబంధాన్ని రచించి ప్రఖ్యాతి గడించారు. ఈ కవి రామాయణాన్ని ప్రబంధంగా రూపొందించి ఒక కొత్త ప్రయోగం చేశాడనీ, ధారాశుద్ధికీ, పద సౌష్టవానికీ నన్నయవలె నిగ్రహం వున్న శృంగార రసపోషణకూ, ఇంపైన శబ్దాలంకారాలకూ ఈ ప్రబంధం లక్ష్యప్రాయమనీ యువభారతి అధ్యక్షులు శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తిగారు చక్కగా చెప్పారు. రామభద్రకవి కవితారీతులపై పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని వ్రాసి కొత్తపల్లి విశ్వేశ్వర శాస్త్రిగారు 1974 లో డాక్టర్ పట్టాన్ని సంపాదించారు. ఆయన యువభారతి వారి కోరిక పై యి, రామాభ్యుదయంలోని ఎన్నికైన కొన్ని పద్యాలను తీసుకుని వాటిలోని సొగసులను వివరిస్తూ యీ రచన సాగించారు. విశ్వేశ్వరశాస్త్రిగారు విజయవాడలోని కె. బి. ఎన్. కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేస్తూ ఉన్నందున, ఏ విధంగా వ్రాస్తే అందరికీ సులభగ్రాహ్యంగా ఉంటుందో గ్రహించి యీ విపుల వ్యాఖ్యను రచించారు. రామభద్రకవి కవిత్వంలో శ్లేష, అచ్చ తెలుగు పదాల పొందిక, చమత్కారం, శబ్దాలంకారముల కూర్పు తర్వాతి కవులకు ఆదర్శమయాయి. చక్కని జాతీయాలను పొందు పరచడంలో ఈ కవి దిట్ట. ఈ విషయాలన్నీ యీ పుస్తకంలోని వ్యాఖ్యలో చక్కగా వివరించబడ్డాయి. రామభద్రకవి కవితా చమత్కృతిని, వైశిష్ట్యాన్ని తెలుసుకొనుటకు ఈ రచన ఎంతో సహాయకారిగా ఉంటున్నది.

"ఆంగీరస"

గమనిక

కొన్ని అనివార్య కారణాల వల్ల మార్చి నెల భారతి వెలువడటానికి ఆలస్యం జరిగింది; ఇక ముందు ఇటువంటి ఆలస్యం జరుగకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నామని మనవి చేసుకుంటున్నాము.

సంపాదకుడు

పరిమళ తరంగాలు

[బెజవాడ గోపాలరెడ్డి. వెల: రు 6-00 లు. ప్రతులకు : 1) ఆంధ్ర సారస్వత పరిషత్, తిలక్ రోడ్డు, హైదరాబాద్-1; 2) విశాలాంధ్ర పబ్లిషింగ్ హవుస్, ఏలూరు రోడ్డు, విజయవాడ; 3) నవోదయ పబ్లిషర్సు, ఏలూరు రోడ్డు, విజయవాడ]

ఈ కావ్యం విశ్వనాథ సత్యనారాయణగారికి, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారికి అంకితం చెయ్యబడింది. గోపాలరెడ్డిగారు గత కొంతకాలంనుంచీ వచన కవిత్వం రాయటం మొదలుపెట్టారు. అట్లా వచన కవిత్వంలో వస్తున్న వారి కావ్య పరంపరలో ఈ పరిమళ తరంగాలు ఒక కావ్యం. ఇందులో మొత్తం ఇరవైరెండు కవితలున్నాయి. అందులో ఠాగూర్ కవిత ఒకటి, ఇక్బాల్ రెండు కవితలు మాత్రం అనువాదాలు. మిగిలినవి వారి సొంత కవితలు.

ఈ కవితల్లో వానాకాలం మీద, తెల్లమబ్బుల మీద భుట్టో ఉరి మీద, చివరకు వారి షేవింగ్ బ్రష్ మీద కూడా కవితలున్నాయి. గోపాలరెడ్డిగారి వచన కవిత్వంలో కవిత్వభాగం కంటె వచనభాగం ఎక్కువగా ఉంటుంది. కావ్యఖండికలు చదువుతుంటే పాఠకునికి కవిత్వం చదువుతున్నామనే స్పృహ ఎక్కడో కాని కలగదు. ఉదాహరణకు-మాత తెరీసా ఖండిక.

"తెరీసాదేశము అల్బేనియా
యుగాస్లావియాలో చిన్నదుకాణదారు
అట్టి తండ్రికి పుట్టి వయస్సురాగానే
సన్యాసియై ఉపాధ్యాయినిగ
కలకత్తావచ్చి సంఘసేవికయై
విశ్వవిఖ్యాతి గడించి
పదిహేనులక్షల ఇరవై వేల రూపాయలు
నార్వీజియన్ నోబెల్ శాంతి బహుమతిని పొందింది."

ఇట్లాగేసాగుతుంది వీరి వచన కవిత్వం. ఆ పాదాలను వచనంగా రాసినా వచ్చిన నష్టం ఏమీలేదు. పోతే వారిలో ఉన్న కవిత్వాంశ చాలా తక్కువ చోట్ల తళుక్కున మెరుస్తుంది. తెల్లమబ్బులు అనే ఖండికలో మబ్బులు ఆయనకు దర్శనమిచ్చిన తీరులో కవిత్వ స్పృహ ఉన్నది.

"వ్రతభంగమైన మునీశ్వరుల
ఎగిరొచ్చిన ఆశ్రమ పతాకలా
ఘోరతపమొనర్చే విశ్వామిత్రునికి
మేనక ఎత్తిన శ్వేత ఆతపత్రమా
హరిశ్చంద్రుని స్వచ్ఛ యశోరాసులు
స్వర్గానికి పయనిస్తూ రోదసిలో
తొలి విడిది చేశాయా!"

ఇట్లాంటి పాదాల్లో వారి ఊహ చమత్కృతి, కవిత్వాంశ తొంగిచూస్తాయి. మిగిలిన భాగమంతా వచనమే.

మధుజ్వాల

[జ్యోతిరాణి. వెల: రు-10-00 లు ప్రతులకు:- 1) కిన్నెర పల్లి కేశవన్న, 2 - 2 - 647/153, సెంట్రల్ ఎక్సైజ్ కాలని, హైదరాబాద్ - 13; 2) జ్యోతిరాణి, కేరాఫ్ - ఎ. రవీంద్ర, 1-7-281, బొకారం, హైదరాబాద్-48.]

ఈనాడు స్త్రీలలో కవిత్వం రాస్తున్నవాళ్లు అరుదు. వారిలో కూడా నవ్య కవిత్వ చైతన్యం క్రమక్రమంగా పొడచూపటం ఆనందదాయకం. జ్యోతిరాణిగారి కవితలను సంకలించి తెలుగు కవితాభిమానులకు అందించిన కిన్నెరపల్లి కేశవన్న వారిని అభినందించవలసినదే.

జ్యోతిరాణిగారి కవిత్వానికి అన్నివిషయాలు వస్తువులే అయ్యాయి. ఆమె ఏ వస్తువుపైనైనా కవిత్వం అలవోకగా రాయగలదు. వసంత కాలంమీద, ఉగాది మీద, సంక్రాంతిమీద, సూర్యుని మీద, చంద్రునిమీద మరి దేనిమీదనైనా సరే కవిత్వం రాయగలిగిన సామర్థ్యం ఈమెకుంది. ముఖ్యంగా మానవత, కరుణ, జాలి ఇత్యాదులైన విషయాలంటే ఈమెకిష్టం.

"కంకరరాళ్ళవంటి కఠినత్వానికి
నీ కళ్ళల్లో చోటివ్వకు
బుద్ధదేవుని కనుల్లోని కరుణ
నీ కళ్ళల్లో ప్రతిబింబించు"

అని అంటుందీమె.

దేశంలో ఉన్న అవినీతి, అమానుషత్వం అంటే ఈమెకు అసహ్యం. ఏదో ఒక ఉపద్రవం వచ్చి వీటన్నింటినీ అంత మొందించాలని జ్యోతిరాణిగారు కోరుకొంటున్నారు.

"ఒకసారి అగ్నివర్షం కురిసి
అవినీతిని బూడిదగా మార్చాలి
అది రాళ్ళ వర్షమే అయితే
దురహంకారుల నణచాలి
మీసాల ముసుగులు జారిపోయేటట్లు
వర్ణవిభేదాలు చివికి చితికిపోయేటట్లు
ఒక వర్షం కురవాలి
ధరణి హర్షం పొందాలి"

అని భవిష్యదాశావాదాన్ని వినిపిస్తోంది ఈ కవయిత్రి.

గుడ్ మార్నింగ్

(మినీ కవితా సంపుటి)

[ప్రతులకు: 1) రావి రంగారావు, తెలుగు లెక్చరర్, ఆంధ్ర జాతీయ బోధనాకళాశాల, మచిలీపట్నం-521001; 2) స్పందన సాహితీ సమాఖ్య, 26-162, బుట్టాయిపేట, మచిలీపట్నం-521 001]

ఇది రావి రంగారావుగారి ద్వితీయ కవితా సంకలనం. ఇది మినీ కవితా సంకలనం. మినీ కవిత్వం ఈనాడు యువకుల్ని ఉత్తేజితుల్ని చేస్తున్న కవిత్వం. ఆ ఉత్తేజమే రావి రంగారావుగారు కూడా పొంది నట్లున్నారు. మినీ కవిత్వం దాని పుట్టుపూర్వోత్తరాలకు ఇది స్థలమూ కాదు, సమయమూ కాదు, సందర్భం అంతకంటె కాదు. కనుక రంగారావుగారు వారి కవిత్వానికి ఏ పేరు పెట్టినా వారు రాసిన ఖండికల్ని అనుశీలించటం ప్రస్తుత కర్తవ్యాంశం.

ఈ సంకలనంలో అక్షరాల అచ్చు కొత్తరకంగా ఉంది. ప్రతి ఖండికకు జి. వి. పూర్ణచంద్‌గారి కార్టూను లున్నాయి. ఇదొక ప్రత్యేక ఆకర్షణ. సెటైరుతో మనుషుల్ని ఖూనీ చెయ్యవచ్చు. అందొకొక ఉదాహరణ.

"రాబోయే కుర్రవాళ్లు
తెలివి మీరితే
అధికారాన్ని లాక్కుంటారని
పదవుల్లోని ముసలివాళ్లు
పాఠశాలల్లో పరీక్ష లెత్తేశారు."

ప్రతీకాత్మకంగా కూడా మినీ కవిత చెప్పొచ్చు అని ఒప్పిస్తున్నారు రంగారావుగారు.

"దేశంలో
పెద్ద పులులూ సింహాలూ
ఖడ్గ మృగాలూ
సంఖ్య పెరిగింది
వేటగాళ్ళు కావాలి."

ఇట్లా ఈ సంకలనం వ్యంగ్యాత్మకంగానూ, ప్రబోధాత్మకంగానూ, ప్రతీకాత్మకంగానూ ఉంది. ముందు ముందు రంగారావుగారు ఒక లక్ష్యంతో కవిత్వం రాస్తారని ఆశిద్దాం!

కృష్ణశాస్త్రి జీవితం - సాహిత్యం

[జె. చెన్నయ్య, డా. బి. భాస్కర చౌదరి. వెల : రు. 15-00 లు ప్రతులకు :- 1) సమతా పబ్లికేషన్సు, 20-11-36/1 జైల్ ఖానా వీధి, చిత్తూరు; 2) నవోదయ పబ్లిషర్సు, ఏలూరు రోడ్డు, విజయవాడ.]

కృష్ణశాస్త్రిగారి జీవితాన్ని గురించి భాస్కర చౌదరి గారు, సాహిత్యాన్ని గురించి చెన్నయ్యగారు రాసిన పరిశీలనా గ్రంథమిది. పుట్టుక, విద్యాభ్యాసం, కృష్ణశాస్త్రి పై తండ్రి పెద తండ్రుల ప్రభావం, గురువుగారైన నరసింహంగారు, ఆ పిమ్మట రఘుపతి వెంకటరత్నంనాయుడుగార్ల ప్రభావం, సాహితీ మిత్ర సమితి స్థాపన ఇత్యాదులైన విషయాలమీద భాస్కర చౌదరిగారు సమాచారం అందించారు.

కృష్ణశాస్త్రిగారి రచనలలో గల బహుముఖీనతను చెన్నయ్యగారు వివరించటం జరిగింది. తెలుగులో భావ కవిత్వ యుగానికి రాయప్రోలు ప్రారంభకుడైతే కృష్ణశాస్త్రి స్థాపకుడూ, వ్యాపకుడూ అన్న నారాయణరెడ్డిగారి అభిప్రాయంలో యథార్థం ఉంది. కృష్ణ శాస్త్రిగారు కవిత్వం రాశారు, ఉపన్యాసాలు ఇచ్చారు, శ్రవ్య రూపకాలు రాశారు, గేయకృతులూ రాశారు, పద్య కృతులూ రాశారు. అయితే వీటన్నింటిలోనూ కృష్ణశాస్త్రిని మరణంలేని కవిగా జీవింపజేసింది కృష్ణ పక్షము, ప్రవాసము, ఊర్వశి అని నా అభిప్రాయం. చెన్నయ్య గారు కృష్ణశాస్త్రి గొప్పతనాన్ని విశ్లేషించబోయి తమకు తెలియకుండానే గొప్ప అపచారం చేశారు. అదేమిటంటే కృష్ణ శాస్త్రిగారి పద్యాన్ని ఉదహరించటం ఈ సందర్భంలో ఫలానా వారిని స్మరించటం మంచిది అనటం. ఉదాహరణకు—

"క్రౌర్య కౌటిల్య కల్పిత కఠిన దాస్య
శృంఖలములు తమం తనె చెదరిపోవ
గగన తలము మ్రోగగ గంతమెత్తి
జగమునిండ స్వేచ్ఛాగాన ఝురుల నింతు"

భావ కవులకు ప్రాణప్రదమైన వ్యక్తి స్వేచ్ఛను శాస్త్రిగారు ఇక్కడ కావ్యస్తం చేశారు. దానిని ఉదహరిస్తూ చెన్నయ్యగారు షెల్లీసామ్యం చెప్పి గమనింప దగ్గది అంటున్నారు. ఇట్లాగే ప్రతిచోటా రవీంద్రుని చరణాలను కీట్సు చరణాలను, షెల్లీ చరణాలను కృష్ణశాస్త్రిగా ప్రతి పద్యానికి ఉదహరించి వాటిని గమనించాల చెప్పారు. ఇవన్నీ గమనిస్తే కృష్ణశాస్త్రి ఏమిటి? అనే ప్రశ్న పాఠకునికి ఉద్భవిస్తుంది. ఒక గొప్ప కవి అనేక మం కవుల్ని చదివి ఉంటాడు. వాళ్ళ ప్రభావం ఆ కవిమీ కొంత ఉండవచ్చు. ప్రభావం అంటే కాపీ కొట్టడ కాదు గదా! ఆ ప్రభావం ఇదీ అని చూపించేటప్పుడ కవి వ్యక్తిత్వాన్ని కూడా విశ్లేషించాలి. ఆ పని చెన్నయ గారు చెయ్యలేదు. దాని ఫలితాన్ని వారు గమనించినట్ల లేదు. పోగా గ్రంథమంతా విశ్వవిద్యాలయాల సిద్ధాం గ్రంథాలకుమల్లే అభిప్రాయాల క్రోడీకరణ అయిం కాని రచయితల పరిశీలనకు, పరిశోధనకు ప్రతీకాత్మకంగ నిలవలేక పోయింది.

భాస్కర చౌదరిగారు గతంలో జాషువా జీవి కవితా ప్రస్థానాన్ని వెలయించిన వారు. కట్టమం వారి మీద ప్రచురించిన పుస్తకంలో వీరిద్దరూ వ్యాసాల రాసిన వారే. సాహిత్య కృషి నిరంతరంగా చేస్తున్నందుక సంతోషిస్తూనే భవిష్యత్తులో ఇంతకంటె ఆలోచనాత్మ మైన విమర్శ గ్రంథాలను ఈ రచయితలు రాస్తార ఆశిస్తున్నాను.

బాల గీతాలు

[బడి పిల్లల నటన, నాట్య పాటలు. కె. విశ్వం, వెల 0-80 పై. ప్రతులకు: రేఖా పబ్లికేషన్సు, 10, మున్సిపల్ కాలని కట్పది రోడ్, గుడియాత్తం - 632 602.]

సినిమాపాటల బాణీలో బడిపిల్లలు పాడుకునేందుకు వీలుగ సులభ శైలిలో రాసిన పాటలివి. శారదా స్తుతి, గాంధి చరిత్ర ఆగస్టు పదిహేను, ఆటవిడుపు, శుభ్రత సుఖము నిచ్చును, పత్రి పఠనం, ఆంధ్రుల ఐక్యం, బాల్యమున నేర్పు, లాల్ బహదూ శాస్త్రి, విద్యావిలువ, నెహ్రూ చాచా, సత్యమేజయం, ప్రబోధగీత విద్య - విత్తం అనే శీర్షికలతో విశ్వంగారు పాటలు రాశారు.

క్షణ క్షణమున క్షితిలో
జరిగెడి మార్పులనేకం
దిన దిన మవి మనమెఱుగ
చదువగ వలె పత్రికల.

ఇట్లా ఉంటాయి వీరి పాటలు.

సిన్నమ్మి పాటలు

[ఆన్నవరం ఆదిశేషయ్య. వెల : రు. 8-00 లు. ప్రతులకు : 'రచన' సాహిత్య వేదిక, 2/194, నాగరాజుపేట, కడప - 516 001.]

పల్లీయుల ప్రణయంలో ఉన్న మాధుర్యాన్ని, స్వచ్ఛతను, అమాయకతను నండూరి సుబ్బారావుగారు ఎంకి పాటల్లో చెప్పారు. ఇప్పుడు- ఎంకి పాటలతో సమానం కానప్పటికీ ఆదిశేషయ్య గారు మళ్ళీ అదేభావాన్ని సిన్నమ్మిపాటల్లో చెప్పటానికి ప్రయత్నించారు. ఆదిశేషయ్యగారు నండూరి కంటె తాను గొప్పవాణ్ణి అని ఎక్కడా అనుకున్న దాఖలాలు లేవు. పోగా ఆయన కావ్యాదిలో పీఠిక రాసుకుంటూ నండూరి వారికి ఇవ్వవలసినంత గౌరవాన్ని ఇచ్చారు. నండూరి కాలానికీ, ఈ కాలానికీ పల్లెల్లో, వాటి సంస్కారంలో ఓక మార్పు వచ్చింది. ఆ మార్పు భాషలోనూ, భావంలోనూ కూడా కనబడుతుంది. కనుకనే "ఎంకి పాటల నాటికీ, ఈనాటికీ పల్లె ప్రజల జీవన సరళిలో, భాషలో, హావభావాలలో చాలా మార్పు వచ్చింది. అందుకే సిన్నమ్మి పాటలలో కొన్ని జానపదుల నోట ససేమీ పట్టవనిపించే మాటలు చోటుచేసుకున్నాయి అన్నారు శేషయ్యగారు. అక్కడక్కడా విశ్వనాథవారి కిన్నెరసాని నడకలు కనిపించినా కవితాప్రభావం మాత్రం నండూరి వారిదే.

ఎంకి పాటల్లో నండూరివారు -

ఎంకెవ్వరని లోక
మెపుడైన కదిపితే-
యెలుగు నీడల వైపు
యేలు సూపింతు

అంటారు. సిన్నమ్మి పాటల్లో ఆదిశేషయ్యగారు సిన్నమ్మిని గురించి-

నీలి రంగుల కులకు నింగియే సిన్నమ్మి
నింగిపై కెగబాకు నేలయే సిన్నచ్చి
నేలనూ నింగికీ నీరాజనమే కవనమ్ము
నింగికీ నేలనూ హారావళమే సఖ్యమ్ము

అన్నారు. భావం పాతదైనా చెప్పే పద్ధతిలో వరిజినాలిటీ ఉన్నది. చక్కటి ధారాశుద్ధి కలిగిన శైలి ఆదిశేషయ్య గారిది.

ముగ్గులేస్తావుంది సిన్నమ్మి
వలపు నిగ్గులన్నీ గలిపి
ముగ్గులేస్తావుంది సిన్నమ్మి
ముంగిళ్ళ మొగ్గలేస్తావుంది - నాయమ్మి

ఇట్లాంటి శైలే కావ్యమంతా. భావకవితా నంతరకాలంలో భావుకత కలిగిన భావకవిత్వాన్ని అందించారు ఆదిశేషగారు.

ఊర్వశి

[పొట్లపల్లి సీతారామారావు, వెల: రు.6-00లు, ప్రతులకు: పొట్లపల్లి సీతారామారావు, అనంతభవన్. రెండవలైను, మారుతీ నగర్, విజయవాడ - 520 004.]

సీతారామారావుగారిని క్రితం తరం సాహిత్యమూర్తులలో ఎరగని వారుండరు. అంతప్రసిద్ధమైన విమర్శకుడాయన. ప్రాచీన సంస్కృత ఆలంకారిక శాస్త్ర అధ్యయనం క్షుణ్ణంగా చేసిన పండితులు సీతారామారావుగారు. ఆనందవర్ధనుడి ధ్వని సిద్ధాంతం ఆయన్ను ఎక్కువగా ప్రభావితం చేసి ఉండవచ్చు. గురజాడపై, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రిలపై, కవిత్వసిద్ధాంతాలపై వారు అనేక విమర్శక వ్యాసాలు రాశారు. విమర్శకునిగానే కాక కవిగా స్థిరపడటానికేమో ఈ ఊర్వశి కావ్యరచన. అంచేతనేనేమో "లాలసపడి నీకునై కలవరంపడి నే గవిగూడనైతి, నా యశమువిమర్శకుండనెడి యంతటిమాత్రనె నిల్చిపోవకే" అని సీతారామారావుగారన్నది

ఊర్వశి కావ్యప్రారంభానికి ముందు కవిత్వతత్వాన్ని గురించి కొన్ని సిద్ధాంతాలు చేశారాయన. వాటిని ఒకింతపరామర్శించవలసిన అవసరం ఉన్నది. కవిత్వంపై ఎవరి అభిప్రాయాలు వారికుంటాయి. ప్రతిఒక్కరూ రెండోవాడిది దోషం అనటం సాహిత్యంలో ఔచిత్యానికి భంగకరం కదా! ఒకడికి తన అభిప్రాయం ఎంత సత్యం అయిందో మరొకడికి వాడి అభిప్రాయం అంతే సత్యం అవుతుంది.

అర్ధదృష్టితో సంఘంబు నరసి సాంఘి
కమ్ము దృష్టికి రాజకీయమ్ము గలుపు
పంచకూల కషాయమ్మువంటి బుద్ధి
కావ్యపరిశీలనమున కక్కఱకు రాదు

అని అంటున్నారు సీతారామారావుగారు. కాలంగడిచేకొద్దీ కవిత్వంలో దృక్పథాలు మారుతాయి. మారే దృక్పథాలతో కవిత్వ రూపాలు మారుతాయి. రూపాలు మారుతున్నప్పుడల్లా కొలమానాలు మారతాయి. ప్రతి కవితా రూపానికీ ఒకే విమర్శనా సూత్రం వర్తించదు. పదార్థం మారుతున్నప్పుడల్లా కొంతపద్ధతి మారుతుంది. ఈనాటి సాహిత్యం, దాని విమర్శ రాజకీయాలనుంచి, సమాజం నుంచి దూరంగా ఎట్లావుంటుంది?

రాజకీయముల్ మనసులోరగులు కొనగ
భావరసమార్గములు బూజుపట్టెనంచు
సాహితీసీమముల రొమ్ము సాచిపలుకు
సాహసికులకిదేవీనమస్కారశతము

అని సీతారామారావుగారు ఊర్వశి కావ్య ప్రారంభంలో రాయవలసిన అవసరం ఎంతమాత్రమూ లేదు. వారు వెలువరించిన మరొక అభిప్రాయాన్ని పాఠకులు పరిశీలించి నిగ్గుతేల్చుకోవలసిందే.

కావ్యమొనరించు ఋషివంటి కవియెదాని
జదివి లాలించు కవివంటి సహృదయుండె
కవి సహృదయ లోకములకే కావ్యసృష్టి
గాని తర్కారులకు కాదు కాదు కాదు.

ఊర్వశి కథ కొత్తది కాదు. భారతీయ భాషల్లో అనేకమంది ఊర్వశిని గూర్చి రాసి ఉన్నారు. సీతారామారావుగారు ఊర్వశి కావ్యం తను రాయటంలో గల పరమార్థాన్ని ఈ విధంగాచెప్పారు.

"పరమాత్మలో నంతర్లయించుటకు జీవుడు పొందెడి యుత్కంఠయందలి ప్రాధానవ్యంగ్యము. పురూరవునిగా నారోపించుకొనిన కవి స్వీయవేదనానుభవము - ఇందు వాచ్యార్థము" పండితుడు కవి అయితే ఆ కవిత్వంలో కొంత కర్కశత్వం ప్రవేశిస్తుందని కొంతమంది చెబుతారు. కాని దానికి అపవాదమే సీతారామారావుగారి ఊర్వశీ కావ్యం. కావ్యపరమార్థతత్వానికి అనుగుణమైన శైలి, ఛందము ఈ కావ్యంలో కనబడతాయి. రసానుగుణమైన శబ్దం పలకటం అంత తేలికయిన విషయం కాదు. విమర్శకుడైన కవి అట్లా శబ్దాన్ని పలికించటం మరీ విశేషం. ఈ విశేషమే సీతారామారావుగారి కవిత్వానికి ప్రాణ మూలమైన లక్షణమైంది.

ఓ నవకాల మేఘ శక
లోజ్జ్వల సుందరకేశబంధనా
టీనిలయ ప్రసూనవిత
తి భ్రమరాయిత జీవలోక! నీ
వా నెలరేక పంచు దడి
యారని నవ్వుల నృత్యమాడి, నా
మానస మెల్ల నద్దిపరి
మాణము, బొంగులుగా నొనర్చకే

ఈ పద్యంలో వారి భావము, భాష, ఛందస్సు త్రివేణీ సంగమంలా ఏకం కావటం చూస్తాం. ఊర్వశిని వ్యక్తిగత ప్రేయసిగా ఊహించి విరహకవిత్వం రాయటం ఈ కావ్యపరమార్థం కాదని ఆయన చెప్పకపోయినా మనకు తెలుస్తుంది. కృష్ణశాస్త్రిగారి అద్వైతభావననే సీతారామారావుగారు మరొక రకంగా చెప్పారు. పైగా విశ్వనాథ, కృష్ణశాస్త్రిల ప్రభావం తన మీద ఉందని, అది దోషం కాదని కవిగారే చెప్పుకున్నారు.

ఓయి! యతిలోకసుందరీ! యూర్వశీ! మ
దీయ హృదయాంగణ ప్రభాదీపికా! వ
చింతు నొక మాట, యీ జీవితాంతమిట్లె
నిన్ను నా మనోగగనాన నిల్పియుంతు

అని కవిగారు భావించినట్లుగానే ఈ ఊర్వశీకావ్యం కూడా పాఠకుని మనోగగనాన నిల్చి ఉంటుంది.

శ్రీ టి. ఎల్. కాంతారావు

శతాబ్దాలుగా తెలుగు భాషాస్వరూపం

ఆధునిక భాషా శాస్త్రంపై తెలుగులో వచ్చే గ్రంథాలు అధికంగా రెండురకాలుగా కన్పిస్తున్నాయి. సీరియస్‌గాఉంటూ పరిశోధనాస్థాయిలో సాగేవి. నాన్ సీరియస్‌గా ఉంటూ పాఠకుడికి విషయం పట్ల అసక్తి కల్పరచడానికి వస్తున్న పరిచయ గ్రంథాలు మరో రకం. ప్రస్తుత గ్రంథం ఏ వర్గానికి చెందిందో నిర్ణయించడం కష్టంగా ఉంది. ఎందుకంటే పై లక్షణాలేవీ కన్పించకపోగా పాఠకుణ్ని అయోమయావస్థలోకి నెట్టివేస్తుంది. కాని రచయితే ఈ పుస్తకాన్ని 'పరిశోధక గ్రంథం గా' పేర్కొన్నారు (ధైర్యం చేసి).

"ఇది పరిశోధనాత్మక గ్రంథం .... ప్రతి పరిశోధకునికి అంతకుముందు వారుచేసిన పరిశోధనలు ఎంతగానో ఉపకరిస్తాయి. (అందుకు సందేహం ఏమాత్రం లేదు.) అదే విధంగా నా కృషి కూడా ఇతర పరిశోధనలకు ఉపకరిస్తుందనే నమ్మకం నాకుంది" (పేజీ VI) అని సెలవిచ్చారు. (కొటేషన్‌లో, బ్రాకెట్‌లో ఇచ్చినవి నా స్వంత అభిప్రాయం).

అయితే 184 పేజీలు విస్తరించిన 28 అధ్యాయాలుగల ఈ పుస్తకాన్ని చదివింతర్వాత రచయిత చేసింది పరిచయమా? పరిశోధనా? అనే సందేహం కలగక మానదు.

'పరిశోధన' అని ఉపయోగించటం కాకుండా దాన్ని సాగదీయటం (పుస్తకంనిండా) వల్లనే వస్తోంది పేచీ అంతా. లేకుంటే ఒక నాన్-ప్రొఫెషనల్(రచయిత పి & టిలో పనిచేస్తున్నారు) గా జరిపిన అటెంప్ట్‌ని మెచ్చుకోవచ్చును.

వ్యతిరేకతకు కారణాలు పేర్కొంటూపోతే మరో గ్రంథంగా తయారయే ప్రమాదం ఉంది కనుక సంక్షిప్తంగా ముగిస్తాను.

రచయిత ఈ గ్రంథంలో స్వంతాభిప్రాయాలు ఎక్కడా ప్రకటించలేదు. మొత్తం ఇతర గ్రంథాలనుంచి సంగ్రహించి అస్తవ్యస్తంగా కూర్చటం జరిగింది.

పోతే ముద్రా రాక్షసాలు ఏ పుస్తకానికైనా తప్పవేమో కాని ఈ పుస్తకంలో ఉన్నన్ని (అదీ పరిశోధక గ్రంథంలో!) భరించటం కష్టం. దాదాపు అయిదు పేజీలకొకసారి ఇవి పలకరిస్తూ ఉంటాయి.

ఇక విషయానికొస్తే రచయితకున్న అసమగ్ర, అశాస్త్రీయ భావాలు కొట్టవచ్చినట్లు ఎన్నోచోట్ల (13, 28, 66 పేజీలు) కన్పిస్తాయి. మచ్చుకు ఒకటి చూడండి.

'వ్యావహారిక భాషకు, వ్యాకరణ నిబంధనలతో అవసరం ఉండదు' (పేజీ 1) విషయం చెప్తున్నప్పుడు ఉపయోగించుకున్న ఆధార గ్రంథాలుకానీ, వాదన పరామర్శగానీ శాస్త్రీయంగా చేయలేదు. అసలు పుస్తకం చివర ఇచ్చిన గ్రంథసూచి చూస్తే ఎంత అవకతవకల్తో ఇవ్వచ్చో గ్రహించవచ్చు. సాహిత్యోదాహరణలు చదువుతూన్నప్పుడు ఎంతో ఆసక్తిగా భాషావిషయాలేమన్నా చర్చిస్తాడేమోనని ఎదురుచూసే చదువరికి నీరసంగా కొన్ని 'ఎంప్టీ స్టేట్‌మెంట్స్' కన్పిస్తాయి. అంటే రచయిత చెప్పదల్చుకున్నదేమీ లేదుకనుక స్వభావోక్తితో 'ఇలాఉంది' (పేజీ 14) అని ప్రారంభించి ఉదాహరణలతో పేజీలు దొర్లించి చివర 'సుబోధకంగా ఉండడం గమనించగలం' (పేజీ 17) అని ముగిస్తారు ఎన్నో సందర్భాల్లో (పేజీ 10, 18, 14, 21, 23, 45, 62, 78, 98 లల్లో ఇంకా) ఈ వింతలు కన్పిస్తాయి. ఇంకా కొన్నిచోట్ల మరికొన్ని స్టేట్‌మెంట్స్ కన్పిస్తాయి. 'చాలా వాటిపేర్లు మనకు తెలియవు' (83 పేజీ) 'మరికొన్ని ఆటలు తెలియవు' (పై పేజీలోనే) 'కొన్నిపదాలు తెలియవు' (పేజీ 70), అక్కడక్కడ (అ)శాస్త్ర చర్చలూ (95, 109 పేజీలు), చరిత్రపై చర్చలూ(95, 96 పేజీలు), కొన్ని లిస్టులూ (23, 24, 25 అధ్యాయాల్లో), అసమగ్ర సమాచారాలు (26వ అధ్యాయంలో) కన్పిస్తాయి- చెప్పాల్సింది- 'వ్యావహారిక భాషస్థితి- దేశభాషలు- శాసన, సాహిత్య భాషాస్వభావం. జానపదుల భాష, ముద్రణ, పత్రికల భాషల (రచయిత ప్రణాళిక ప్రకారం) — గురించయినా చదివింతర్వాత చదువరికే తెల్సిన విషయాలమీద సందేహం రావటం తప్పదు. (తెల్సుకున్న విషయాలేవన్నా ఉంటే) ఇది నిజంగా పరిశోధనాగ్రంథమా(!) అని ఆశ్చర్యం కలగక మానదు.

ఏమైనా పాఠకులు(ముఖ్యంగా పరీక్షలకు వెళ్ళేవాళ్ళు, కవర్ పేజీని కంటెంట్సను చూసి పుస్తకంకొనే ప్రమాదం ఉంది. కాని చదివింతర్వాత వారి స్థితేమవుతుందో మనం ఆలోచించలేం (!). పరిశోధక గ్రంథం (!) ఇలా ఉండకూడదన్న దానికయినా చదివి తీరాల్సిందేమరి.

శ్రీ కె. లక్ష్మీనారాయణశర్మ

మధ్వుల తత్త్వవిచారము

[రచన: శ్రీ చేరాల పురుషోత్తమ రావు, 7/410-3, గొడుగుపేట, మచిలీపట్నం-521001. క్రౌను 90 పుటలు వెల 3 రూ. ప్రతులకు రచయితకే వ్రాయవలెను.]

వైదిక మతాలలో ప్రసిద్ధమైనవి ద్వైతాద్వైత విశిష్టాద్వైతమతాలు. పీటిలో మొదటిది శ్రీ శంకరాచార్యులు స్థాపించిన అద్వైతమతం. తర్వాత శ్రీ రామానుజాచార్యులు విశిష్టాద్వైతాన్ని స్థాపించారు. ఆ తర్వాత స్థాపితమైనది శ్రీ మధ్వాచార్యులు స్థాపించిన ద్వైతమతం. అద్వైతమత సిద్ధాంత విషయంలో తీవ్రమైన అభిప్రాయభేదాల వల్ల విశిష్టాద్వైతం, అది సముచితంగా లేదని తోచినందున ద్వైతమతం స్థాపితాలయాయి. ఏ మతస్థులకు ఆ మతం

సిద్ధాంతలే సాధారణంగా శిరోధార్యాలయి ఉంటున్నాయి. రచయిత ద్వైత మతానికి చెందినందున శ్రీ మధ్వమునుల సిద్ధాంతాలనే శిరోధార్యాలుగా స్వీకరించి, ద్వైత మత తత్వాన్ని ఆంధ్ర పాఠకులకు ఈ గ్రంథం మూలంగా అందిస్తున్నారు.

అద్వైత, విశిష్టా ద్వైత మతాలను గురించిన గ్రంథాలు తెలుగులో విరివిగా ఉన్నవి. ద్వైతాన్ని గురించినవి చాలా తక్కువ. వాటిలో ప్రామాణ్యం గల వాటిలో నేనెరిగినది మహామహోపాధ్యాయ, తాతా సుబ్బారాయ శాస్త్రిలుగారు రచించి, విజయనగరం ఆంధ్ర విజ్ఞాన సమితి వారిచే ప్రకటింపజేయబడిన 'ద్వైతాద్వైతములు' అను గ్రంథం మాత్రమే! అది పండితులకే అర్థముకాగల భాషలో రచించ బడినది. అదిఇప్పుడు అలభ్యంకూడాను. అందువల్ల సులభంగా ఆ మతాన్ని గురించి తెలుసుకొనుటకు తగిన గ్రంథం ఎంతో అవసరం. ఆ అవసరాన్ని యీ రచయిత ఈ గ్రంథ ప్రకటనద్వారా తీర్చారని చెప్పవలసి యున్నది.

అద్వైత మతమున జీవాత్మ పరమాత్మల కభేదము చెప్పబడినది. విశిష్టాద్వైత మతమున జీవుడు, తాను సంపూర్ణముగ పరమాత్మ కర్పణము చేసికొను ఉత్తమభక్తి వలననే ముక్తిని పొందునని అద్వైతమునకు భిన్నముగ చెప్పబడినది. ద్వైతమతము ముక్తిని పొందిన జీవుడు పరమాత్మయొక్క ప్రతిబింబము వంటివాడే కాని అభిన్నుడు కాదనియు, జీవ పరమాత్మలకు ఏకత్వము లేదనియు, చెప్పుచున్నది. పయి అంశములిందు సులభ పద్ధతిలో చెప్పబడియున్నవి.

90 పుటల యీ చిన్న గ్రంథములో ద్వైతమత విషయము 48 వ పుటనుండి మాత్రమే వివరింపబడినది. మొదటి 47 పుటలతో విదేశీయుల మతాలయిన ఇస్లాం, క్రైస్తవ మతాలు, అవి భారతదేశంలో ప్రవేశించడానికి ఏర్పడిన పరిస్థితులు, నాస్తికమతాలైన బౌద్ధజైన మతాలు, విగ్రహారాధన, భగవంతుని గురించిన చర్చలు, వైదిక మతాలైన అద్వైత, విశిష్టాద్వైత శైవ, శాక్తేయమతములు వివరించ బడినవి ఇట్లు వివిధ మతాల సిద్ధాంతాలను, స్వరూపాలను తెలిసికొనుటకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఇది తిరుమల-తిరుపతి దేవస్థానముల ఆర్థిక సహాయంతోనూ, ఉదారుల విరాళాలతోనూ ముద్రించ బడింది.

భారతదేశంలో వ్యాప్తిలో ఉన్న ప్రధాన మతములను గురించి తెలుసుకోదలచినవారీ గ్రంథాన్ని తప్పక చదవవలసి ఉన్నది.

శ్రీ బులుసు వేంకట రమణయ్య

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.

